
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 24.09.2026 | సంపుటి :13 సంచిక : 65 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# కర్ణాటక గ్రీన్‌సిగ్నల్

## జూరాలకు కృష్ణమ్మ పరుగులు



- తెలంగాణకు విడతల వారీగా 3 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం
- కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్,ఇరిగేషన్ అధికారులతో పాలమూరు ప్రజాప్రతినిధుల భేటీలో ఈ మేరకు నిర్ణయం

### రైతన్నల పోరాటం ఫలించింది

జూరాల కుడి, ఎడమ కాలువలకు సాగునీరు విడుదల

అన్నదాతల్లో హర్షాతిరేకాలు

2లో..

బెంగుళూరు(జనంసాక్షి):ఎల్‌నినోతో ఏర్పడిన నీటిఎద్దడితో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన బాటపట్టిన జూరాల ఆయకట్టు రైతులకు కర్ణాటక ప్రభుత్వం నుంచి శుభవార్త అందింది. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల చర్చలతో నీటివిడుదలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. నారాయణపూర్ నుంచి జూరాలకు మిగతా 2లో..




### థాంక్యూ.. శివకుమార్

- కర్ణాటక ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సీఎం రేవంత్
- ఫలించిన తెలంగాణ దౌత్యం

హైదరాబాద్(జనంసాక్షి):మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక సీఎంకు ఫోన్ చేసి జూరాల దిగువన ఉన్న అవసరాలను వివరించారు. నీటి నిల్వలు తగ్గిపోయిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపూర్‌ల నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలపై చర్చించారు. రాష్ట్రం నుంచి మంత్రుల బృందాన్ని పంపుతున్నట్లు డీకేకు వివరించారు. నీటిపారుదల శాఖ మంత్రి మిగతా 2లో..



దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో

# పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి జరగాలి

### ఈ దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలి

- అందుకు అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో చర్చించండి
- విద్యుత్ శాఖపై సమీక్షలో అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి భట్టికి సూచించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రితో కలిసి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై ఈ సందర్భంగా అధికారులను ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి మిగతా 2లో..

### అసైన్డ్ భూముల లబ్దిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలి

దీనికి అవసరమైన కసరత్తు ప్రారంభించాలి

అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

2లో..

### డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు



### మీరాబాయికి రజతం

49కేజీల విభాగంలో తృటిలో గోల్డ్ చేజార్చుకొని రెండో స్థానంలో నిలిచిన భారత వెయిట్ లిఫ్టర్

2లో..

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉద్యోగ సంఘాల చర్చలు విఫలం

నాలుగు ప్రధాన డిమాండ్లపై స్పష్టత కరవు..

నేడు అత్యవసర రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి ప్రతిపాదించిన నాలుగు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూతో బుధవారం సచివాలయంలో జరిగిన చర్చలు ఎలాంటి స్పష్టమైన నిర్ణయం లేకుండానే ముగిశాయి. డిమాండ్లపై కాలపరిమితితో కూడిన స్పష్టత ఇవ్వకపోవడంతో చర్చలు విఫలమైనట్లుగా భావిస్తున్నామని సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు.గత మే 2న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని మిగతా 2లో..

# బీఆర్‌ఎస్ థర్మల్ ప్రాజెక్టుల బాట

ఎన్‌నినో వల్ల కాదు.. కాంగ్‌నినో వల్లే కరెంట్ కోతలు

- గతంలో చెప్పిందే ఇప్పుడు జరుగుతోంది
- మా హయాంలో విద్యుత్ వ్యవస్థ చాలా అద్భుతంగా నడిచింది
- రైతుల పోరాటంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చింది: కేటీఆర్




కేసీఆర్ పదేళ్లు కష్టపడి విద్యుత్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. మీరు హామీ ఇచ్చినట్లు రాష్ట్రంలోని రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాల్సిందే. విద్యుత్ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేసింది. నిజాలు తేల్చడానికి సీనియర్ నేతల ఆధ్వర్యంలో ఆరు బృందాలు ఏర్పాటు చేశాం. రేపు పవర్ ప్లాంట్ల పరిశీలనకు వెళ్తాం. రేపు 6 చోట్ల పవర్ ప్లాంట్ల సందర్శనకు బీఆర్‌ఎస్ బృందాలు వెళ్తాయి. వైటీపీఎస్, కేటీపీఎస్, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను పరిశీలిస్తాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ థర్మల్ పవర్ స్టేషన్లలో ఏం జరుగుతుందో నిజానిజాలు తేల్చడానికి మా బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఆరు బృందాలు గురువారం పవర్ స్టేషన్లకు వెళ్తాయని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేటీఆర్ అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, ఇతర నల్గొండ నాయకులు బృందం, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర బృందం, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ బృందం, కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బృందం, సింగరేణి థర్మల్ పవర్ స్టేషన్ పర్యటనకు వెళ్లనున్న మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, దివాకర్ రావు, సింగరేణి ప్రధాన కార్యాలయం పర్యటనకు వెళ్లనున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మిగతా 2లో..

# ఎల్‌నినోను కూడా రాజకీయం చేస్తున్నారు

## రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం బీఆర్‌ఎస్ నీచ రాజకీయం

- సాగు చేసిన పంటలను కాపాడతాం..
- వేసవిలో మంచినీటి ఎద్దడి రానివ్వం
- పార్టీకి కార్యకర్తలు, నాయకులే వెన్నెముక
- రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులను
- ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నేరేడుచర్ల(జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్?కరువు రావాలని, పంటలు ఎండిపోవాలని కోరుకుంటూ పైశాచికానందం పొందేందుకు ప్రయత్నిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ప్రకృతి కారణంగా ఏర్పడిన వర్షపాత లోటును కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన దుయ్యబట్టారు. రైతుల కష్టాన్ని రాజకీయ పెట్టుబడిగా మార్చుకోవడం బాధ్యతాయుతమైన ప్రతిపక్ష లక్షణం కాదని మండిపడ్డారు.నేరేడుచర్ల మండలం మేదారం గ్రామంలో రూ.26.40 కోట్ల వ్యయంతో నిర్మించిన నేరేడుచర్ల-దూపాడు డబుల్ రోడ్డును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. అదే కార్యక్రమంలో రూ.20 లక్షలతో నిర్మించిన జానల్‌దిన్నె గ్రామపంచాయతీ భవనం, మిగతా 2లో..



### రేపు గణేష్ నిమజ్జనోత్సవం

ప్రశాంత వాతావరణంలో కార్యక్రమం నిర్వహించుకోవాలి

హైదరాబాద్‌లో భారీ ఏర్పాట్లు: డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్(జనంసాక్షి): వినాయక విగ్రహాల నిమజ్జనం వేడుకల్లో అన్ని విభాగాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తున్నారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గణేశ్ వేడుకలకు సంబంధించి కొన్ని ఫేక్ వీడియోలు వైరల్ చేశారని, పాత, ఫేక్ వీడియోలు పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గణేశ్ మండపాల వద్ద వల్గర్ పాటలు, డ్యాన్స్‌లపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నిమజ్జనానికి హైదరాబాద్‌లో 20వేల మంది, ఇతర జిల్లాల్లో 8,400 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని చెప్పారు. ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ శోభాయాత్రకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. వినాయక చవితి వేడకల పర్యవేక్షణకు ఈసారి ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. నిమజ్జనం వేడుకల్లో డీజేలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డిజిపి సి.వి. తెలిపారు. గురువారం మిగతా 2లో..




# ‘సర్’పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే

- ఎలాంటి అనుమానాలొద్దు: ఈసీ
- ఈసీ సభ్యులు అభ్యంతరాలు తెలిపారన్న రాజకీయ పార్టీల విమర్శలపై క్లారిటీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో పలు రాష్ట్రాల్లో ఓటర్ల పేర్ల తొలగింపుపై ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన మీడియా కథనంపై ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. కమిషన్ జారీచేసే అన్ని అధికారిక ఆదేశాలు, నిర్ణయాలు, పరిపాలనాపరమైన సూచనలకు పూర్తి చట్టబద్ధత ఉంటుందని వెల్లడించింది. సర్ ప్రక్రియపై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే అని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకుతావ ్రలేదని ఈసీ తెలిపింది. ఇవన్నీ ప్రధాన ఎన్నికల కమి షనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం నిర్దేశించిన చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జరుగుతాయని తెలి పింది. అయితే, ఏ సంస్థలోనైనా నిర్ణయాలు తీసుకునే ముందు జరిగే చర్చల్లో భిన్నాభిప్రాయాలు సాధార ణమేనని పేర్కొంది.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయ డంలో తన రాజ్యాంగవిధులను పూర్తి చిత్తశుద్ధితో నిర్వర్తించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఈసీ మిగతా 2లో..

# సీఈసీని అరెస్ట్ చేయండి

‘సర్’పై ఈసీలో ఏకపక్షంగా తీసుకుంటున్నారంటూ జాతీయ మీడియాలో కథనాలు..

జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని విపక్షాల డిమాండ్



న్యూఢిల్లీ(జనంసాక్షి):సర్ నిర్ణయాలను ఈసీలో ఏకపక్షంగా తీసు కుంటున్నారంటూ జాతీయ మీడియాలో వచ్చిన కథనాలపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దేశంలో ఎన్నికల ప్రక్రియను బలహీనపరిచిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశాయి. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఈసీని అడ్డుపెట్టుకుని ఓటు చోరీ చేస్తూ.. ఎన్నికల్లో గెలుస్తున్నారని ఆరోపించాయి. భాజపా, ఆర్‌ఎస్‌ఎస్, ఎన్నికల సంఘం కుమ్మక్కై దేశద్రోహానికి పాల్పడ్డాయని విమర్శించాయి.‘ఓటు చోరీ.. రాజ్యాంగంపై జరుగుతోన్న ప్రత్యక్ష దాడి. దేశవ్యాప్తంగా జరుగుతోన్న ఈ కార్యక్రమానికి మిగతా 2లో..

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

# ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

తెలంగాణ భవిష్యత్తు, ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే చారిత్రాత్మక ఘట్టమిది

అధికారులంతా స్ఫూర్తితో భాగస్వాములు కావాలి

డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రపంచ పెట్టుబడుల సదస్సు:డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 2026 డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026’ ఏర్పాట్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. “తెలంగాణ భవిష్యత్తును, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే ఈ చారిత్రాత్మక ఘట్టంలో అధికారులంతా భాగస్వాములై ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026’ను దిగ్విజయం చేయాలి” అని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు నిర్వహించనున్న ఈ గ్లోబల్ సదస్సు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
గురువారం 24.09.2026

## అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలి

**హైదరాబాద్:**తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ మేరకు అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని, ఇందుకోసం అవసరమైన కసరత్తు ప్రారం భించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సెక్రటేరియెట్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అసైన్డ్ భూముల పరిరక్షణకు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించాలని, జిల్లాల్లో అసైన్డ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించినట్లు సమాచారం.

## డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**హైదరాబాద్:**మాదకద్రవ్యాల నియంత్రణలో దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ఈగల్ ఫోర్స్ సాధించిన జాతీయ స్థాయి గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు.రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ 3వ జాతీయ సదస్సులో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అత్యుత్తమ అవార్డును అందుకోవడం రాష్ట్ర పోలీసు శాఖకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ అనుసరిస్తున్న సమర్థవంతమైన విధానాలకు ఈ జాతీయ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు.మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టడం కేవలం పోలీసు వ్యవస్థ బాధ్యత మాత్రమే కాదని, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి సంస్థ, ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యువతే రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అని పేర్కొంటూ, మాదకద్రవ్యాల ప్రభావం నుంచి యువతను రక్షించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, డ్రగ్స్ విక్రయం, వినియోగంపై సమాచారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు."'నషా ముక్త భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడాలి. 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే దిశగా ఈగల్ ఫోర్స్ మరింత దృఢ సంకల్పంతో పనిచేయాలి" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలపై పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తూ, యువతను చైతన్యపరచడం, డ్రగ్స్ అక్రమ రవాణా మరియు విక్రయాలపై ఉక్కుపాదం మోపడం, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం ద్వారా సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉద్యోగ సంఘాల చర్చలు విఫలం

కోరుతూ సమితి సెప్టెంబర్ 10న తలపెట్టిన హైదరాబాద్ తరలివచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ మేరకు వాయిదా వేసింది. అనంతరం ప్రభుత్వంతో జరగాల్సిన సమావేశం రెండుసార్లు వాయిదా పడగా, చివరకు బుధవారం సచివాలయంలో చర్చలు జరిగాయి. అయితే ప్రధానంగా లేవనెత్తిన నాలుగు అంశాలపై స్పష్టమైన నిర్ణయం లేదా అమలుకు కాలపరిమితి వెల్లడించకపోవడంతో సమితి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.కరువు భత్యంపై ప్రతిపాదన మాత్రమే: దసరాకు ఒక కరువు భత్యం, ఉగాదికి మరో కరువు భత్యం ఇచ్చే అంశాన్ని మంత్రివర్గానికి ప్రతిపాదిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపినట్లు సమితి వెల్లడించింది.పెండింగ్ బిల్లులపై స్పష్టత లేదు: గతంలో మాదిరిగా నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పెండింగ్ బిల్లులను చెల్లించాలని సమితి కోరగా, ప్రస్తుతం నెలకు సుమారు రూ.వెయ్యి కోట్ల మేర మాత్రమే చెల్లింపులు చేయగలమని ప్రభుత్వం తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.వేతన సవరణ సంఘంపై కాలపరిమితి లేదు: వేతన సవరణ సంఘం నివేదికను ఇప్పటివరకు తెప్పించలేదని, మరో ఒకటి లేదా రెండు నెలల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, అనంతరం రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం తెలిపినట్లు సమితి పేర్కొంది. పాత పింఛను విధానంపై కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం తెలిపినప్పటికీ, కమిటీ ఏర్పాటు చేయడానికి, నివేదిక సమర్పించడానికి ఎలాంటి కాలపరిమితిని వెల్లడించలేదని సమితి తెలిపింది. ముఖ్యంగా 2004 సెప్టెంబర్ 1 నాటికి నియమితులైన ఉద్యోగుల విషయంలోనూ స్పష్టత ఇవ్వలేదని పేర్కొంది.ఈ నాలుగు అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు, కాలపరిమితులు ప్రకటించకపోవడంతో ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమైనట్లుగా భావిస్తున్నామని సమితి నాయకులు తెలిపారు. తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు గురువారం అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో రాష్ట్రస్థాయి అత్యవసర విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని సమితి నాయకులు స్పష్టం చేశారు.తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. కృష్ణమూర్తి, కన్వీనర్ డా. బి. స్వరాజ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి జి. అశోక్ తదితరులు ప్రకటనలో పేర్కొన్నారు.

# కర్ణాటక గ్రీన్ సిగ్నల్

విడతల వారీగా 3 టీఎంసీల విడుదల చేయాలని సీఎం డీకే శివకుమార్ అధికారులను ఆదేశించారు. కర్ణాటక సర్కార్ సానుకూల స్పందనతో జూరాల కాల్వలకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు.జూరాల ఆయకట్టు రైతులు, ఆందోళనలు, రాస్తారోకోలతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితానిచ్చాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కీలకమైన జూరాల జలాశయం కింద కృష్ణా జలాలను విడుదల చేయాలని రాష్ట్ర మంత్రుల బృందం విజ్ఞప్తికి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో మరోసారి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి ఎద్దడిపై వివరించి నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు. మంత్రుల విజ్ఞప్తికి శివకుమార్ అంగీకరించారు. నారాయణపూర్ నుంచి జూరాలకు విడతల వారీగా 3 టీఎంసీల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### థాంక్యూ.. శివకుమార్

ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా డీకేతో మాట్లాడారు. ఈ పరిణామాల నడుమ మంగళవారం బెంగళూరు వెళ్లిన మంత్రుల బృందం నీటివిడుదలపై కర్ణాటక సీఎంకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మరోసారి భేటీ అవుదామని డీకే సూచనతో మళ్లీ జరిగిన సమావేశంలో సానుకూల నిర్ణయం వెలువడింది. పాలమూరు రైతుల కోసం నీటి విడుదలకు అంగీకరించిన డీకే శివకుమార్‌కు తెలంగాణ ప్రజల తరఫున రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య స్నేహభావానికి ఇది చక్కటి నిదర్శనమని పేర్కొన్నారు.

## రైతన్నల పోరాటం ఫలించింది

### జూరాల కుడి, ఎడమ కాలువలకు సాగునీరు విడుదల,అన్నదాతల్లో హర్షాతిరేకాలు



ధరూరు(జనంసాక్షి):పంట పొలాలు ఎండిపోకుండా కాపాడుకునేందుకు ఆయకట్టు రైతులు చేసిన ఐక్య పోరాటం ఎట్టకేలకు విజయం సాధించింది. జూరాల కాలువలకు సాగునీరు అందించాలంటూ గత కొద్దిరోజులుగా జోగులాంబ గద్వాల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల రైతులు, ప్రతిపక్ష పార్టీలు చేపట్టిన ధర్నాలు, రాస్తారోకోల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జారీ చేసిన ఆదేశాల మేరకు బుధవారం ఉదయం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ అధికారులు కుడి మరియు ఎడమ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేశారు.ఎట్టకేలకు కాలువ గట్లు జలకళను సంతరించుకోవడంతో, చేతికొచ్చే దశలో ఉన్న పంటలను కాపాడుకోగలమని ఆయకట్టు పరిధిలోని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కాలువల వారీగా స్పష్టమైన నీటి విడుదల వివరాలు:ప్రస్తుత పంటల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు రెండు ప్రధాన కాలువల ద్వారా కింది పరిమాణంలో నీటిని వదిలారు.ఎడమ ప్రధాన కాలువ ఈ కాలువ ద్వారా అత్యధికంగా 750 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. విడుదలైన నీరు చివరి ఆయకట్టు భూములకు సైతం అందేలా ప్రణాళిక సిద్ధం చేశారు.కుడి ప్రధాన కాలువ.ఈ కాలువ ద్వారా ప్రాథమికంగా 350 క్యూసెక్కుల నీటిని సాగు అవసరాల కోసం విడుదల చేశారు.కాలువలకు మొత్తం కలిపి 1,100 క్యూసెక్కుల ప్రవాహాన్ని మళ్లించగా, ఆయకట్టు అవసరాల మేరకు దీనిని దశలవారీగా పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టాలు ఇన్-ఫ్లో ఎగువ ప్రాంతాల నుంచి జూరాల ప్రాజెక్టులోకి ప్రస్తుతం 2,687 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.నీటి నిల్వ, ప్రాజెక్టులో ప్రస్తుతం 9.173 టీఎంసీల వద్ద నీటి నిల్వ కొనసాగుతోంది.రాజకీయాలకు అతీతంగా అన్నదాతల గెలుపునీటి విడుదల క్రెడిట్ విషయంలో అటు అధికార, ఇటు ప్రతిపక్షాల మధ్య భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి.ప్రతిపక్షాల వాదన: పంటలను కాపాడాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో, ధరూర్ మాజీ జడ్పీటీసీ పద్మా వెంకటేశ్వర్ రెడ్డి నేతృ త్వంలో ఐదు రోజులుగా రైతులు చేసిన పోరాటం వల్లే ప్రభుత్వం దిగివచ్చిందని ప్రతిపక్ష నేతలు పేర్కొన్నారు. నీటి విడుదల అనంతరం వారు డ్యామును సందర్శించి రైతుల ఐక్యతకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ పక్షం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షపాతేనని, పంటల రక్షణే ధ్యేయంగా మంత్రి వాకిటి శ్రీహరి తక్షణ నిర్ణయం తీసుకుని సాగునీరు విడుదల చేయించారని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఈ సందర్భంగా కృషి చేసిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిలకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా, కొన్ని రోజులుగా సాగునీరు అందక ఆందోళనలో ఉన్న రైతులకు ఈ నీటి విడుదల పెద్ద ఉపశమనం కలిగించింది. కాలువలకు నీరు చేరడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగం ఊపిరి పీల్చుకుంది.

### దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి

ఉ-9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు వివరించారు. సింగరేణిలో జీ 9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు తెలిపారు.జీ 9 గ్రేడ్ బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతపై ఆధారపడిన థర్మల్ విద్యుత్ కేంద్రం ఎలా నిర్మించారని ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం అధికారులను ప్రశ్నించారు. పిట్ హెడ్ కాకుండా, ఎందుకు దూరంగా నిర్మించారని అడిగారు. ఈ కేంద్రానికి బొగ్గు సరఫరా చేయడం వల్ల రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను ప్రశ్నించారు.అప్పట్లో రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్‌పై కాకుండా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం దూరంగా నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని చెప్పారు. సింగరేణి నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గుకు ఉన్న అవకాశాలపై ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ-9 గ్రేడ్ బొగ్గును సింగరేణి నుంచి సరఫరా చేయలేదని అధికారులు వివరణ ఇచ్చారు. ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని సమావేశంలో అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్ బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు.

## మీరాబాయికి రజతం

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారీ అంచనాలతో దిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయి చానుకు రజత పతకం దక్కింది. 49కేజీల విభాగంలో ఆమె త్రుటిలో గోల్డ్ చేజార్చుకొని రెండో స్థానంలో నిలిచింది. ఆసియా క్రీడల్లో పతకం సాధించడం ఆమెకు ఇదే మొదటిసారి కావడం విశేషం. అలాగే ఆసియా గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో భారత్‌కు పతకం రావడం 28 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 1998లో చివరిసారిగా ఆసియా క్రీడల్లో కరణం మల్లీశ్వరి కాంస్యం సాధించింది.

## 'సర్'పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే

పునరుద్ఘాటించింది. ముసాయిదా దశలో కమిషన్ సభ్యులు అడిగే ప్రశ్నలు లేదా ఇచ్చే సూచనలు, ఓటర్ల హక్కులను కాపాడేందుకు చేసే పరిపాలనా ప్రక్రియలో భాగమేనని వివరించింది. ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచటానికి కేవలం ముగ్గురు కమిషనర్లు మాత్రమే కాకుండా కమిషన్‌లో ప్రతి అధికారి సూచనలు ఇవ్వటానికి పూర్తి అధికారం కలిగి ఉన్నారని ఈసీ స్పష్టం చేసింది.

## సీఈసీని అరెస్ట్ చేయండి

జ్ఞానేశ్ కుమార్ ప్రధాన సూత్రధారి. మోదీ సహా పలువురు ప్రముఖ నేతలు తెర వెనక ఉండి చక్రం తిప్పుతున్నారని ప్రజలకు అర్థమయ్యింది. భాజపా, ఆర్ఎస్ఎస్, ఈసీ దేశద్రోహానికి పాల్పడ్డాయి. వారు తగిన శిక్ష అనుభవించే రోజు దగ్గరలోనే ఉంది' రాహుల్ గాంధీ అని అన్నారు.'జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల ప్రక్రియను బలహీనపరిచారని మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. దాని ద్వారానే మోదీ ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నారు. ఈ దారుణాలకు పాల్పడినందుకు జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేసి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. ఆయన నేతృత్వంలో జరిగిన దిల్లీ, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, హరియాణా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికలను రద్దు చేసి.. మళ్లీ నిర్వహించాలి' కేజ్రీవాల్ అని అన్నారు.'ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు. ఇది మన ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అటువంటి హక్కులను ప్రజలకు దూరం చేసిన జ్ఞానేశ్ కుమార్‌కు సీఈసీగా కొనసాగే హక్కు లేదు' -కేసీ వేణుగోపాల్ 'అక్రమంగా ఓట్లు తొలగించినందుకు జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి. ఈ చర్యల వెనుక ఎవరున్నారో విచారించడానికి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి' -కపిల్ సిబల్. 'భారత ఎన్నికల సంఘాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడానికి జ్ఞానేశ్ కుమార్‌ను ఎన్నికల సంఘంలోకి భాజపా పంపింది. ఆయన ఎన్ని అక్రమాలు చేస్తున్నా అవి బయటపడకుండా రక్షిస్తోంది. కోట్లాది మంది భారతీయుల ఓటు హక్కును హరించిన సీఈసీకి తగిన శిక్ష విధించాలి' పవన్ ఖేడా అన్నారు.

## రేపు గణేష్ నిమజ్జనోత్సవం

ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న ఆయన.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. 13 ఏళ్లుగా ఖైరతాబాద్‌తో అనుబంధం....సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసినప్పటి నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందని డిజిపి గుర్తుచేశారు. సుదర్శన్ గారు , ఇప్పుడు వారి కొడుకులు సందీప్ మరియు రాజ్కుమార్ కూతురు వీణా, మహేష్ యాదవ్ ఇతర సభ్యులు వారందరూ శాంతియుతంగా నిమజ్జనాలు చెయ్యడానికి చాలా సహకరిస్తారని తెలియచేసారు.ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 30 వేల మంది పోలీసులతో బందోబస్తు పది రోజుల గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు జరుగుతున్నాయని, రేపు, ఎల్లుండి భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ సీపీలు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో సుమారు 30 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం మోహరించినట్లు వెల్లడించారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనాల కోసం జీహెచ్ఎంసీ, విద్యుత్, జలవనరులు, ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు.

# ఎల్‌నినోను కూడా రాజకీయం చేస్తున్నారు

రూ.33 లక్షలతో నిర్మించిన నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. మొత్తం రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు.అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులపై నిప్పులు చెరిగారు."ఎల్‌నినో అనేది కాంగ్రెస్ కార్యాలయంలో పుట్టిన పదం కాదు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే శాస్త్రీయ పరిణామం. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కంటే వేడెక్కినప్పుడు ప్రపంచ వాతావరణ నమూనాలు మారుతాయి. భారత రుతుపవనాలపైనా దాని ప్రభావం పడుతుంది. ఈసారి కొన్ని కీలక దశల్లో వర్షపాతం దాదాపు 40 శాతం వరకు తగ్గింది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రభుత్వంపై విష ప్రచారం చేయడం బీఆర్ఎస్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం" అని విమర్శించారు."ఆకాశంలో ఎల్‌నినో వర్షాలను అడ్డుకుంటే.. భూమిపై బీఆర్ఎస్ అబద్ధాల వరద పారిస్తోంది. రైతు పొలంలో పంట ఎండిపోతే ప్రభుత్వానికి బాధ కలుగుతుంది; బీఆర్ఎస్‌కు మాత్రం రాజకీయ అవకాశం కనిపిస్తోంది. రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం కంటే నీచమైన రాజకీయం మరొకటి ఉండదు" అంటూ విరుచుకుపడ్డారు. వర్షాలను ఎవరూ స్విచ్ వేసి కురిపించలేరని, అయితే అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కనూ కాపాడి ప్రజల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. జలాశయాల్లో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ సాగు చేసిన పంటలను కాపాడడం, రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూడడం కోసం ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోందన్నారు."సమస్య వచ్చినప్పుడు పరిష్కారాన్ని వెతికేది కాంగ్రెస్ ప్రభుత్వం. సమస్య మరింత పెరగాలని కోరుకునేది బీఆర్ఎస్. మేము రైతు పంటను కాపాడేందుకు నీళ్ల కోసం రాష్ట్రాల తలుపులు తడుతున్నాం. వాళ్లు మాత్రం హైదరాబాద్‌లో కూర్చొని అబద్ధాల వరద పారిస్తున్నారు" అని దుయ్యబట్టారు.జూరాల ఆయకట్టు కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించే అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో మంతనాలు జరిపినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తనకున్న వ్యక్తిగత స్నేహాన్ని తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం వినియోగించానని చెప్పారు. తెలంగాణ విజ్ఞప్తికి డి.కె. శివకుమార్ సానుకూలంగా స్పందించారని, నీటి లభ్యతను పరిశీలించి సహకరించేందుకు హామీ ఇచ్చారని వివరించారు."మేం కర్ణాటకతో మాట్లాడి నీళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు మాత్రం రైతుల వద్దకు వెళ్లి భయం సృష్టిస్తున్నారు. మాకు రాజకీయాల కంటే పంటలు ముఖ్యం; ప్రచారం కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం" అని స్పష్టం చేశారు.ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతుందని చెప్పారు. అవసరమైన చోట నీటి విడుదల, ప్రత్యామ్నాయ వనరుల వినియోగం, జలాశయాల సమర్థ నిర్వహణపై నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు."సాగు చేసిన పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనాథలుగా వదిలిపెట్టం. రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. వేసవిలో ప్రజల గొంతు ఎండకుండా మంచినీటి సరఫరాకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రకృతిని శాసించలేకపోవచ్చు.. కానీ ప్రజలను కాపాడే బాధ్యత నుంచి ఒక్క అడుగు కూడా వెనక్కి వెళ్లం" అని ప్రకటించారు.హైదరాబాద్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' సన్నాహక సమావేశం ఉన్నప్పటికీ నేరేడుచర్ల?దూపాడు రహదారి ప్రారంభోత్సవానికి ప్రత్యేకంగా హాజరయ్యానని మంత్రి తెలిపారు. ఈ రహదారిని ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.నూతన డబుల్ రోడ్డు నిర్మాణంతో నేరేడుచర్లతోపాటు పత్తేపురం, వైకుంఠపురం, రామలక్ష్మీపురం, మేడారం, బక్కయ్యగూడెం, దూపాడు గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయాలు గణనీయంగా మెరుగుపడతాయని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

## బీఆర్ఎస్ థర్మల్ ప్రాజెక్టుల బాట

ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు లు వెళతారని అయన అన్నారు.కేటీఆర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో 1980'బ ట్రెండ్ నడుస్తుంది.. తెలంగాణలో 1980'బ రోజుల్లో కరెంట్ కోతలతో రైతులు అవస్థలు పడినట్లు ఇప్పుడు అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదని మేము ముందే చెప్పాం.. ఇవాళ అదే జరుగుతుంది. తెలంగాణలో ప్రతి చోట కరెంట్ కోతలు ఉన్నాయని రోజూ పత్రికల్లో వస్తున్నాయి. వీటి మీద సబ్‌స్టేషన్ల దగ్గరికి వెళ్లి చెక్ చేస్తే 6 గంటలకు మించి కరెంట్ ఇవ్వడం లేదు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ వస్తే కరెంట్ ఉండదని అన్నాడు. కానీ తెలంగాణ తెచ్చి 24 గంటలు కరెంట్ ఇచ్చి చూపించాం.. మళ్లీ ఇప్పుడు కిరణ్ కుమార్ రెడ్డి చెప్పినట్లు రేవంత్ రెడ్డి కరెంట్ లేకుండా చేస్తున్నాడని విమర్శించారు.కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదని గతంలో తాము చెప్పామని, ఇప్పుడు అదే జరుగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది' అంటూ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "మా హయాంలో విద్యుత్ వ్యవస్థ చాలా అద్భుతంగా నడిచింది. కాంగ్రెస్ వచ్చాక రాష్ట్రంలో కరెంట్ ఇబ్బందులు ఉన్నాయని అన్ని పత్రికలు కథనాలు రాశాయి. ఏ సబ్‌స్టేషన్‌లో చూసినా 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా ఉండట్లేదు. కరెంట్ ఇవ్వట్లేదని అడిగితే ఎల్‌నినో అంటున్నారు. ఎల్‌నినో వల్ల కాదు.. కాంగ్‌నినో వల్లే ఈ కరెంట్ కోతలు.జెన్‌కోలో బొగ్గు నిల్వలు లేవు. సింగరేణిలో 40లక్షల టన్నుల బొగ్గు మాయమైంది. బొగ్గు ఉంటే ఎందుకు థర్మల్ విద్యుత్ స్టేషన్లను మూసేస్తున్నారు? నీళులేక జల విద్యుత్ ప్లాంట్లు మూతపడ్డాయి. మీరు హామీ ఇచ్చినట్లుగా రాష్ట్రంలోని రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వాల్సిందే" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది**

జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు.రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

### ఆదిలాబాద్ రిమ్స్ ఘటన..

## మరో ఇద్దరు పసికందుల మృత్యువాత

ఆదిలాబాద్(జనంసాక్షి): ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మరో ఇద్దరు పసికందులు మృతిచెందారు. ఇప్పటికే ముగ్గురు మృతిచెందగా.. తాజా మరణాలతో ఆ సంఖ్య ఐదుకు చేరింది. రిమ్స్‌లో సోమవారం అర్ధరాత్రి విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్, ఏసీ పేలడంతో అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై విచారణకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.

### 100 శాతం టారిఫ్‌ల ముప్పు వేళ..

## అమెరికా పర్యటనకు వెళ్లనున్న మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత ప్రధాని నరేంద్రమోదీ డిసెంబర్‌లో అమెరికాలో పర్యటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిసెంబర్ 14, 15 తేదీల్లో ట్రంప్ సర్కార్ ఫ్లోరిడాలో జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఈ పర్యటన జరగనున్నట్లు తెలుస్తోంది. ఆ సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మోదీ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగొచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీనిపై భారత ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాలపై సుంకాల మోత మోగించేందుకు అమెరికా ప్రభుత్వం తీసుకువచ్చిన 'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ బిల్లు'పై ఇటీవల ట్రంప్ సంతకం చేసిన సంగతి తెలిసిందే.

## ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

ఏర్పాట్లు, ప్రచారం, రోడ్‌షోల నిర్వహణపై డిప్యూటీ సీఎం పక్కా కార్యాచరణను ఖరారు చేశారు.??ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచ సదస్సు ఇదని, దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని వెల్లడించారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అధికారుల కమిటీలతో పాటు ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి, వాటికి సంబంధిత మంత్రులను చైర్‌పర్సన్లుగా నియమించినట్లు తెలిపారు. ప్రతి కమిటీకి కన్వీనర్లను కూడా నియమించామని, వారు వెంటనే సంబంధిత మంత్రులను కలిసి బాధ్యతలు స్వీకరించి పనులు ప్రారంభించాలని సూచించారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రతిరోజూ కార్యక్రమాలు జరిగేలా చూడాలని అన్నారు. ??ఈ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. "ఈ రోజు నుంచే ప్రతిరోజూ సదస్సుకు సంబంధించిన ఏదో ఒక వార్త మారుమోగాలి. ప్రచారానికి ఆకాశమే హద్దుగా పనిచేసి, పెద్ద సంఖ్యలో అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు హాజరయ్యేలా చూడాలి" అని అధికారులకు స్పష్టం చేశారు.??3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే ధ్యేయం?2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న బృహత్తర లక్ష్యంలో ఈ సమ్మిట్ కీలక మైలురాయి కానుందని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఎంవోయూలను కూడా సమీక్షించి, వాటి అమలు పురోగతిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రతి అధికారి భాగస్వామి కావాలని సూచించారు. సదస్సు ఏర్పాట్లను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా రాష్ట్రానికి దీర్ఘకాలికంగా ఉపయోగపడే ఆస్తిగా తీర్చిదిద్దాలని అన్నారు. ?తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దేశాలు, నగరాలు, రంగాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఏ దేశంలో ఏ రంగంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయో అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళిక రూపొందించి మంత్రిమండలి ఉపసంఘానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసి రోడ్‌షోలను ప్రారంభించాలన్నారు.?అధికారులు వెంటనే తమ టీమ్‌లతో సమావేశమై వార్ రూమ్ ద్వారా పనులను పర్యవేక్షించాలని, ప్రతిరోజూ సాయంత్రం పనుల పురోగతిని తనిఖీ చేసిన తర్వాతే రోజువారీ బాధ్యతలు ముగించాలని చెప్పారు. ప్రతినిధుల స్పందనను బట్టి అవసరమైతే ప్రస్తుతం అనుకుంటున్న 4 సభా ప్రాంగణాలను (హాల్స్) 6 లేదా 8కి పెంచేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక వికాసంలో అధికారులందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడా రాజీ పడకుండా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను చారిత్రాత్మక విజయం చేయాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు.



# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉద్యోగ సంఘాల చర్చలు విఫలం

- నాలుగు ప్రధాన డిమాండ్లపై స్పష్టత కరవు.. రేపు అత్యవసర రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ సమితి ప్రతిపాదించిన నాలుగు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో బుధవారం సచివాలయంలో జరిగిన చర్చలు ఎలాంటి స్పష్టమైన నిర్ణయం లేకుండానే ముగిశాయి. డిమాండ్లపై కాలపరిమితితో కూడిన స్పష్టత ఇవ్వకపోవడంతో చర్చలు విఫలమైనట్లుగా భావిస్తున్నామని సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. గత మే 2న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సమితి సెప్టెంబర్ 10న తలపెట్టిన హైదరాబాద్ తరలివచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ మేరకు వాయిదా వేసింది. అనంతరం ప్రభుత్వంతో జరగాల్సిన సమావేశం రెండుసార్లు వాయిదా పడగా, చివరకు బుధవారం సచివాలయంలో చర్చలు జరిగాయి. అయితే ప్రధానంగా లేవనెత్తిన నాలుగు అంశాలపై స్పష్టమైన నిర్ణయం లేదా అమలుకు కాలపరిమితి వెల్లడించకపోవడంతో సమితి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కరువు భత్యంపై ప్రతిపాదన మాత్రమే: దసరాకు ఒక కరువు భత్యం, ఉగాదికి మరో కరువు భత్యం ఇచ్చే అంశాన్ని మంత్రివర్గానికి ప్రతిపాదిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపినట్లు సమితి వెల్లడించింది. పెండింగ్ బిల్లులపై స్పష్టత లేదు: గతంలో మాదిరిగా నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పెండింగ్ బిల్లులను చెల్లించాలని సమితి కోరగా, ప్రస్తుతం నెలకు సుమారు రూ.వెయ్యి కోట్ల మేర మాత్రమే చెల్లింపులు చేయగలమని ప్రభుత్వం తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు. వేతన సవరణ సంఘంపై కాలపరిమితి లేదు: వేతన సవరణ సంఘం నివేదికను ఇప్పటివరకు తెప్పించలేదని, మరో ఒకటి లేదా రెండు నెలల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, అనంతరం రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం తెలిపినట్లు సమితి పేర్కొంది. పాత పింఛను విధానంపై కమిటీ ఎప్పుడు?: పాత పింఛను విధానంపై కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం తెలిపినప్పటికీ, కమిటీ ఏర్పాటు చేయడానికి, నివేదిక సమర్పించడానికి ఎలాంటి కాలపరిమితిని వెల్లడించలేదని సమితి తెలిపింది. ముఖ్యంగా 2004 సెప్టెంబర్ 1 నాటికి నియమితులైన ఉద్యోగుల విషయంలోనూ స్పష్టత ఇవ్వలేదని పేర్కొంది. ఈ నాలుగు అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు, కాలపరిమితులు ప్రకటించకపోవడంతో ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమైనట్లుగా భావిస్తున్నామని సమితి నాయకులు తెలిపారు. తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు గురువారం అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో రాష్ట్రస్థాయి అత్యవసర విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని సమితి నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. కృష్ణమూర్తి, కన్వీనర్ డా. బి. స్వరాజ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి జి. అశోక్ తదితరులు ప్రకటనలో పేర్కొన్నారు.

# శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక పర్యటన



**హుస్నాబాద్ (జనంసాక్షి) :** హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల, హాస్టల్‌లోని వసతులను పరిశీలించి విద్యార్థులతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులను వేర్వేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తెలిపిన సమస్యలను మంత్రి స్వయంగా నోట్ చేసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులతో కలిసి ప్రతిరోజూ సిబ్బందిలో ఒకరు భోజనం చేయాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసి భోజనం, వసతులపై వారి అభిప్రాయాలను తీసుకోవాలని ఆదేశించారు. ఇకపై భోజనానికి సంబంధించి విద్యార్థుల నుంచి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తాను హుస్నాబాద్ వచ్చినప్పుడు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తాననీ విద్యార్థుల సమస్యలను నేరుగా తెలుసుకుంటాననీ, విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా నాకు చెప్పే హక్కు ఉంది. నేను మీ గార్డియన్‌గా ఉంటాను అని మంత్రి విద్యార్థులతో అన్నారు. బాయ్స్ హాస్టల్‌లో బాత్రూమ్ తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు, మంచి ఆహారం, రవాణా సదుపాయాలు కల్పించడం తన బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# క్యాబ్ డ్రైవర్ హత్య కేసును ఛేదించిన సైబరాబాద్ పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్



**పటాన్‌చెరు (జనంసాక్షి) :** సంచలనం సృష్టించిన క్యాబ్ డ్రైవర్ హత్య,దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. మహా రాష్ట్రకు చెందిన ఘోడకే రాహుల్,సూరజ్ శశికాంత్,బాంబ్లే రాజులను అరెస్ట్ చేసారు. మరో ఇద్దరు నిందితులు ఉన్నానపి శేరిలింగంపల్లి టీపీసీ శ్రీనివాస్ వెల్లడించారు. సెప్టెంబర్ 10 రాత్రి సికింద్రాబాద్లో ముంబై వెళ్లాలంటూ డ్రైవర్ నెలమ్రి రాజశేఖర్ క్యాబ్ను నిందతులు మాట్లాడుకున్నారు. మార్గమధ్యలో రుద్రారం సమీపంలో టవల్ తో గొంతు నులిమి అతడిని హత్య చేసారు. మృతదేహాన్ని బ్రిడ్జి వద్ద పడేసారు. తరువాత కారుతో ముంబై పారిపోతుండగా కోహిర్ వద్ద వాహనం మొరాయించడంతో అక్కడే వదిలేసి పరరైయారు. బంగారు దుకాణాల్లో చోరీలకు కారు ఉపయోగించి చివరకు అమ్మేయాలని నిందితుల ప్లాన్. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి రేమండ్ కు తరలించారు.

# పేద నిరుద్యోగ యువతకు టిఆర్పీ సుమార్గ్ అండ

- కరీంనగర్ జిల్లాలో ఎస్ఐ, పీసీ, ఎఫ్‌బీఓ ఉచిత కోచింగ్
- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్
- ఫీజులు భారం కావొద్దు, ప్రభుత్వ ఉద్యోగ లక్ష్యానికి ఉచిత కోచింగ్
- మాదం రజిని కుమార్ యాదవ్
- ఆర్థిక పరిస్థితి కాదు, పట్టుదలే భవిష్యత్తును నిర్ణయిస్తుంది
- రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా




**కరీంనగర్ (జనంసాక్షి) :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన టిఆర్పీ సుమార్గ్ ఎస్ఐ, పీసీ, ఎఫ్‌బీఓ ఉచిత కోచింగ్ కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ౹౼ా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజిని కుమార్ గారు హాజరై రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల నుంచి కోచింగ్‌కు సంబంధించిన అప్లికేషన్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాదం రజిని కుమార్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం విద్యార్థులు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన కోచింగ్ మరియు నిరంతర సాధన పొందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆర్థిక స్థోమత లేని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ప్రైవేట్ కోచింగ్ కేంద్రాల ఫీజులు భారంగా మారుతున్న పరిస్థితుల్లో ౹౼ా రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా తన సొంత ఖర్చుతో నిరుద్యోగ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం కోచింగ్‌కు హాజరవడం మాత్రమే కాకుండా ప్రతిరోజూ క్రమశిక్షణతో చదువుతూ, మాక్ టెస్టులు రాస్తూ, సమయపాలన పాటిస్తూ తమ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలని వారు సూచించారు. పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందేలా విద్యార్థులు కష్టపడి చదవాలని ఆకాంక్షించారు. "ఆర్థిక ఇబ్బందుల వల్ల నేను చదువుకునే సమయంలో ఇబ్బంది పడ్డాను. మీ లక్ష్యాలకు ఆ పరిస్థితి అడ్డంకి కాకూడదు" ఈ సందర్భంగా ౹౼ా రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా మాట్లాడుతూ, తన జీవితంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును కొనసాగించడంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. ఆర్థిక పరిస్థితులు కారణంగా ప్రతిభ ఉన్న ఎంతోమంది విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని, అలాంటి విద్యార్థులకు తన వంతుగా సహాయం చేయాలనే ఉద్దేశంతో ౹౼ా సుమార్గ్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నాకు ఎదురైన ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువులో వచ్చిన కష్టాలు నాకు తెలుసు. అందుకే లక్ష్యం పెట్టుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకునే విద్యార్థులకు ఆర్థిక పరిస్థితి అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాను. కోచింగ్ ఫీజులు చెల్లించలేని విద్యార్థులు కూడా మంచి శిక్షణ పొందాలి, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి అనేదే నా లక్ష్యం అని అఖిల్ పాషా తెలిపారు. కేవలం ఉద్యోగం కోసం కాకుండా, కుటుంబానికి మరియు సమాజానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పేద కుటుంబాల విద్యార్థులు తమ ఆర్థిక పరిస్థితిని చూసి నిరుత్సాహపడకుండా "నా పరిస్థితి కాదు, నా పట్టుదలే నా భవిష్యత్తును నిర్ణయిస్తుంది" అనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అఖిల్ పాషా పిలుపునిచ్చారు. ఒక విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే అది ఒక కుటుంబ భవిష్యత్తును మార్చగలదు. అలాంటి విద్యార్థులకు నా వంతుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ విద్యార్థులకు అండగా ఉంటాను అని అఖిల్ పాషా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ ఐఏఎస్ అకాడమిక్ డైరెక్టర్ కరీమ్ రోజు సార్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు పూజారి సత్తన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, మహిళా అధ్యక్షురాలు రాచరి అరుణ దేవి, కార్యదర్శి ఇశ్రత్ శావాలి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహ్మద్ వాజిద్, ప్రధాన కార్యదర్శి అంకుష్ శావాలి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్షత్ బిన్ అలీ, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి మహబూబ్ అలీ, పెద్దపెల్లి కార్మిక అధ్యక్షుడు ఉదయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, నాయకులు ఎగుర్ల రమేష్, శివరాత్రి మోహన్, అనిల్, ఓర్సు రాజు, గుండోజు సాధానందం, కుమార్, రాజు, వెంకట్ గౌడ్, వాసాల భాను చెందర్, గుండోజు పద్మ, సత్తమ్మ, కోరేపు గంగ, సాధేఖా భాను, జడగల శ్రీనివాస్, సాధానందం తదితర కార్యకర్తలు, కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.6.70 లక్షల ఓజీ కుష్ మద్యం బాటిల్ల పట్టివేత..

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రాలను దాటించి.. ఆన్లైన్లో కంప్యూటర్ కీబోర్డ్ ముసుగులో పెద్ద మొత్తంలో ఓ జి కుష్ ను దిగుమతి చేసుకొని హైదరాబాద్ లో అమ్మకాలు జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం సీఐ రమేష్ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. దంతూరి వాసుదేవ వర్మ, చెడిపూడి కుందన్ రెడ్డి ఇంట్లో తనిఖీలు చేయగా ఖరీదైన శివాజీ రీగల్ పురాతనమైన బాటిళ్ల ను కూడా 14 నిందితుల ఇంటిని నుంచి ఎస్టిఎఫ్ టీం ం సీజ్ చేశారు. ఈ కేసులో దంతూరి వాసుదేవ వర్మ, చెడిపూడి కుందన్ రెడ్డిలను అరెస్టు చేశారు. పట్టుకున్న ఓజిగుష్ మద్యం బాటిల్లు మొత్తంగా రూ. 6.70 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు. నిందితుల వద్ద ఉన్న 60 గ్రాములు 14 మద్యం బాటిల్లను కూకట్పల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

# కరెంట్ కోతలతో కాలిపోతున్న ట్రాన్స్ ఫార్మార్లు

- ఎండిపోతున్న పైర్లు



**సూర్యాపేట (జనంసాక్షి) :** పెన్‌పహాడ్ మండలం గాజుల మల్కాపురం గ్రామంలో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయి. దాంతో పైర్లు ఎండిపోతున్నాయని రైతులు మండిపడు తున్నారు. కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లతో రిపేర్ కేంద్రానికి లైన్లు కట్టారు. రోజుకు కేవలం 7-8 గంటలు మాత్రమే కరెంట్ వస్తుందని, అది కూడా 4 విడతలుగా వదలడంతో లో ఓల్టేజ్ సమస్యతో ట్రాన్స్ఫార్మర్లు, మోటార్లు కాలిపోతున్నాయని రైతుల ఆవేదన. పది0 రోజులైనా ట్రాన్స్ఫార్మర్లు రిపేర్ చేయకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో పంటలు ఎండిపోతున్నాయని గోస పెట్టుకుంటున్నారు. పంటలు ఎండిపోయి పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వచ్చిందని, ప్రభుత్వం ఇకనైనా కోతలు లేకుండా కరెంట్ వదలాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# హైదరాబాద్‌లో నీటి వృథాపై జలమండలి కఠిన చర్యలు

- జూబ్లీహిల్స్‌లో ఐదుగురు వినియోగదారులకు జరిమానా




**హైదరాబాద్, సెప్టెంబర్ 23, (జనంసాక్షి) :** నగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సోమవారం జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన అధికారులు, తాగునీటిని వాహనాలు కడగడానికి, ఫ్లోర్‌లు శుభ్రం చేయడానికి వాడుతున్న ఐదుగురు వినియోగదారులకు జరిమానాలు విధించారు. ట్యాంకులు నిండి పొంగిపోతున్నా, నల్లాలు వదిలేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రారంభంలో అవగాహన కార్యక్రమాలు, హెచ్చరికలతో సరిపెట్టిన జలమండలి, మార్పు రాకపోవడంతో జరిమానాలను భారీగా పెంచింది. నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి రూ.1,000 నుంచి రూ.5,000, రూ.10,000, గరిష్ఠంగా రూ.20,000 వరకు జరిమానాలు విధిస్తున్నారు. పదేపదే నీటిని వృథా చేసేవారి నల్లా కనెక్షన్లను శాశ్వతంగా తొలగిస్తామని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెం. 23లో ఫ్లోర్ క్లీనింగ్‌కు తాగునీరు వాడుతున్న పూర్ణిమ అనే వినియోగదారురాలికి రూ.20,000 జరిమానా విధించడం గమనార్హం. ఈ తనిఖీలను నగరం అంతటా విస్తరిస్తున్నారు. సోమవారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఎస్కే నగర్‌లో అక్రమంగా మోటార్ వాడుతున్నందుకు ఒకరికి రూ.5,000, అల్కాపురి యాదవ్ నగర్‌లో తాగునీటితో ఫ్లోర్ కడుగుతున్నందుకు మరొకరికి రూ.1,000 ఫైన్ వేశారు. నగరంలో పెరుగుతున్న నీటి డిమాండ్, ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, మంజీరా-సింగూరు జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడం వల్లే ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. "ఈరోజు మనం వృథా చేసే ప్రతీ నీటి చుక్క, రేపు మరొకరి దాహార్తిని తీర్చగలదు" అని బోర్డు పేర్కొంది. అదే సమయంలో తమ సిబ్బందికి కూడా జలమండలి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నగరంలోని 15,000 కిలోమీటర్ల పైప్‌లైన్లలో ఎక్కడైనా లీకేజీ ఫిర్యాదు వస్తే 24 గంటల్లోగా శాశ్వత పరిష్కారం చూపాలని, తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకునే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. నీటి దుర్వినియోగంపై ప్రజలు 99499 30003 అనే వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని బోర్డు సూచించింది. నీటి సంరక్షణ అనేది వినియోగదారులు, జలమండలి ఉమ్మడి బాధ్యత అని పేర్కొంది.



## ప్రజాప్రతినిధుల కోర్టుకు డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల మనోరంజన్ కోర్టుకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హాజరయ్యారు. 2022 జనవరి 4న కొత్తగూడెం జిఆర్ బస్తీ ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ రూల్స్ పాటించకుండా ప్రెస్ మీట్ నిర్వహించారని బట్టి విక్రమార్క తో పాటు ఆరుగురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు అయింది. ఆ కేసులో విచారణలో భాగంగా న్యాయమూర్తి ముందు హాజరైయారు.

## నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

**భద్రాద్రి కొత్తగూడెం (జనంసాక్షి) :** ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో నర్సింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి (18) అనే యువతి అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఇంటి ఆవరణలోని బాత్రూమ్ వెనుక మృతదేహం లభించింది. పక్కింటి వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడని మృతురాలి తల్లి ఆరోపణ. తండ్రి మరణించడంతో కూలి పనులు చేసి ఇద్దరు కూతుళ్లను తల్లి రాజేశ్వరి చదివిస్తోంది. సెలవుల నేపథ్యంలో హరిణి ఇటీవలే ఇంటికి వచ్చింది. అదే గ్రామంలోని చుట్టాల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి హరిణి కనిపించడంలేదని తల్లి వెతికింది. ఈ నేపథ్యంలో ఒంటిపై గాయాలతో, బాత్రూమ్ వెనుక హరిణి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నయీం హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్

- ప్రధాన సూత్రధారి ఉమామహేష్ సహా ఇద్దరి అరెస్ట్
- అదుపులో మొత్తం 11 మంది నిందితులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ మహమ్మద్ నయీం హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా ముగ్గురిని నాగోల్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. ఖమ్మంకు చెందిన కె.ఉమామహేష్ అలియాస్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్.బి.నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 16న ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన సూత్రధారి ఉమామహేష్ మాత్రం అప్పటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. తాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నయీం, ఉమామహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడటంతో ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై రౌడీషీట్లు ఉన్నాయి. కొంతకాలంగా ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తూ ఉండేవారు. ఓ రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లో విభేదాలు రావడంతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, ఉమా మహేష్ ఖమ్మంలో సోలార్ ప్యానల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా ఇద్దరి మధ్య ఏర్పడిన విభేదాలు ఒకరిపై ఒకరు కక్ష పెంచుకునేలా దారితీసింది. నయీంను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమా మహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించి మరుసటి రోజు ఖమ్మం నుంచి నిందితులు కారులో హైదరాబాద్‌కు చేరుకున్నారు. మున్నా ద్వారా నయీంకు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నారు. బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీం ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లి అతడి కళ్లలో కారం చల్లి వెంబడించిన నిందితులు.. హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మంది అరెస్టు కాగా.. తాజాగా మరో ముగ్గురి అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య 11కు చేరింది. కాగా ఈ కేసులో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, ఐపీఎస్ బి.సుమతి ఆదేశాలతో ఎల్.బి.నగర్ డీసీపీ బి.అనురాధ, ఎస్ఓటి ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో నాగోల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పరారీలో ఉన్న నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టి ప్రధాన సూత్రధారి ఉమామహేష్‌తో పాటు మరో పదిమంది నిందితులను అరెస్టు చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.

సంపాదకీయం

# రీల్ హీరోలు బాధ్యతగా ఉంటారా?

*హాని కలిగించే ఉత్పత్తులకు ప్రచారం చేయడాన్ని సినీ తారలు మానుకుంటారా? కోట్లాది రూపాయల పారితోషికం కోసం ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే ఉత్పత్తులకు ముఖచిత్రాలుగా మారడం సమర్థనీయమేనా? జాతీయ చలనచిత్ర పురస్కారాల వేదికగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన సూచన ఈ ప్రశ్నలను మరోసారి ప్రజల ముందుకు తెచ్చింది. ఇది ఒక వేడుకలో చేసిన సాధారణ వ్యాఖ్యగా ముగిసిపోవాల్సిన అంశం కాదు. సినీ తారలకున్న ప్రజాదరణ, వారి ప్రచార ప్రభావం, దాని వల్ల సమాజంపై పడే ప్రభావం గురించి ఆలోచించాల్సిన సందర్భం.*

సినీ హీరోను ప్రేక్షకులు కేవలం తెరపై కనిపించే వ్యక్తిగా చూడరు. అతని మాట, దుస్తులు, అలవాట్లు, జీవనశైలి.. అన్నింటినీ అభిమానించే వారు కోట్లలో ఉంటారు. అందుకే వాణిజ్య సంస్థలు తమ ఉత్పత్తులకు తారలను ప్రచారకర్తలుగా ఎంచుకుంటాయి. ఒక ఉత్పత్తి గురించి సాధారణ ప్రకటన చెప్పే మాటకంటే, తమ అభిమాన హీరో చెప్పే మాటకు యువతలో ఎక్కువ ప్రభావం ఉండే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితిలో పొగాకు, పాన్ మసాలా, అధిక చక్కెర లేదా కొవ్వు ఉన్న ఆహార పదార్థాలు, అనారోగ్యకరమైన పానీయాలు వంటి వాటికి తారలు ప్రచారం చేయడం కేవలం వ్యక్తిగత వాణిజ్య నిర్ణయంగా చూడలేం.

ప్రశ్న ఇక్కడే వస్తోంది. ఒక ప్రకటన కోసం భారీ పారితోషికం తీసుకునే ముందు ఆ ఉత్పత్తి సమాజానికి ఏం చేస్తుందో తారలు ఆలోచిస్తున్నారా? ఒప్పందం లోని చట్టపరమైన అంశాలను పరిశీలించడంతో పాటు, తమ అభిమానులపై పడే ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారా? చట్టం తప్పుదోవ పట్టించే ప్రకటనలకు ప్రచారకర్తలపైనా బాధ్యతను నిర్దేశిస్తున్నప్పుడు, చట్టపరమైన బాధ్యతకు ముందే నైతిక బాధ్యత గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

అయితే బాధ్యతను కేవలం సినీ తారలకే పరిమితం చేయడం కూడా సరైంది కాదు. హానికర ఉత్పత్తులను తయారు చేసే సంస్థలు, ప్రకటనలను రూపొందించే సంస్థలు, వాటిని అనుమతించే నియంత్రణ వ్యవస్థలు, ప్రజల్లోకి తీసుకెళ్లే మాధ్యమాలు అన్నీ తమ పాత్రను సమీక్షించుకోవాలి. అయినప్పటికీ ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపే శక్తి తారలకు ఎక్కువగా ఉన్నందున, వారి బాధ్యత కూడా ఎక్కువగానే ఉంటుంది. వెండితెరపై కథానాయకుడు చెడుపై పోరాడుతాడు. సమాజానికి మంచి సందేశాలు ఇస్తాడు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, తప్పు అలవాట్లకు దూరంగా ఉండాలని పాత్రల ద్వారా చెబుతాడు. మరి అదే కథానాయకుడు తెర బయట ప్రజారోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తికి ప్రచారం చేస్తే ఆ సందేశాలకు విలువ ఏముంటుంది? ఇది తారలు తమను తాము ప్రశ్నించుకోవాల్సిన విషయం.

డబ్బు సంపాదించడం తప్పు కాదు. కానీ ప్రభావవంతమైన వ్యక్తిగా ఉండటం ఒక అదనపు బాధ్యతను కూడా తెస్తుంది. తాము తీసుకునే ప్రతి ప్రకటన ద్వారా సమాజానికి ఏ సందేశం వెళ్తుందో ఆలోచించడం వృత్తిపరమైన విచక్షణలో భాగం కావాలి. రాష్ట్రపతి సూచన ఒక హెచ్చరికగా కాకుండా సినీ పరిశ్రమలో ఆత్మపరిశీలన కు ఆరంభంగా మారాలి. తెరపై మాత్రమే కాదు.. తెర బయట కూడా కథానాయకు లుగా నిలవాలంటే ప్రజారోగ్యం విషయంలో తారలు బాధ్యత చూపించాల్సిందే.

# స్వేచ్ఛ కోసం మండిన విప్లవ జ్వాల ప్రీతిలత వడ్డేదార్



బ్రిటిష్ సామ్రాజ్యవాదం ముందు తలవంచని 21 ఏళ్ల యువతి ఆమె. చేతిలో ఆయుధం పట్టి వలస పాలనను సవాలు చేసింది. పట్టుబడి బానిస జీవితాన్ని గడపడం కంటే, స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగాన్నే ఎంచుకుంది. చిట్టగాంగ్ విప్లవోద్యమంలో మాస్టర్‌దా సూర్యసేన్‌తో కలిసి పోరాడిన ప్రీతిలత వడ్డేదార్ 1932 సెప్టెంబర్ 24న అమరురాలైంది. ఆమె మరణం ఒక వ్యక్తి త్యాగం కాదు.. వలస పాలనపై ఒక యువ విప్లవకారిణి విసిరిన తిరుగుబాటు సవాలు. 94 ఏళ్లు గడిచినా ప్రీతిలత పేరు భారత విముక్తి పోరాటంలో మహిళా విప్లవ ధైర్యానికి ప్రతిధ్వనిగానే నిలిచింది.

1932 సెప్టెంబర్ 24. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న యువ విప్లవకారిణి ప్రీతిలత వడ్డేదార్ చివరి పోరాటంలోకి అడుగుపెట్టిన రోజు. మాస్టర్‌దా సూర్యసేన్ నాయకత్వంలో సాగిన చిట్టగాంగ్ విప్లవోద్యమంతో ఆమెకు అనుబంధం ఏర్పడింది. బ్రిటిష్ పాలనను సవాలు చేసిన ఆ విప్లవకారుల బృందంలో మహిళగా ఆమె పోషించిన పాత్ర అప్పటి సామాజిక పరిమితులను కూడా సవాలు చేసింది. ప్రీతిలత కథను కేవలం ఒక యువతి త్యాగకథగా చదవడం ఆమె చారిత్రక ప్రాధాన్యాన్ని తగ్గించడమే అవుతుంది. ఆమె జీవితం ఒక ప్రశ్నను ముందుకు తెచ్చింది. వలస పాలన మనిషి గౌరవాన్ని, స్వేచ్ఛను, సమానత్వాన్ని నిరాకరిస్తున్నప్పుడు దానికి వ్యతిరేకంగా ఎవరు నిలబడాలి? మహిళలు ఎందుకు వెనుక ఉండాలి? దేశ విముక్తి పోరాటం పురుషులకే పరిమితమైన రంగమా? ఈ ప్రశ్నలకు తన జీవితంతోనే ప్రీతిలత సమాధానం చెప్పింది.

చిట్టగాంగ్ ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాటంలోని ఒక ప్రత్యేక అధ్యాయం. 1930లో చిట్టగాంగ్ ఆయుధాగారంపై విప్లవకారుల దాడి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ ప్రతిఘటనకు ఒక కొత్త రూపాన్ని చూపించింది. ఆ ఉద్యమానికి సూర్యసేన్ నాయకత్వం వహించారు. ఆ ఉద్యమం ప్రభావంతో అనేక మంది యువతలో తిరుగుబాటు చైతన్యం పెరిగింది. ప్రీతిలత కూడా అదే ప్రవాహంలోకి వచ్చింది. ఆమెకు స్వాతంత్ర్యం అంటే కేవలం పాలకుడు మారడం కాదు, బానిసత్వపు సంకెళ్లు తెగిపోవడం. ఆ కాలంలో మహిళలపై ఉన్న సామాజిక ఆంక్షలను అధిగమించి విప్లవ కార్యకలాపాల్లో పాల్గొనడం ఆమె రాజకీయ చైతన్యానికి, వ్యక్తిగత ధైర్యానికి నిదర్శనం.

1932 సెప్టెంబర్ 24న జరిగిన సాయుధ చర్యలో బ్రిటిష్ బలగాలతో ఘర్షణ చోటుచేసుకుంది. పట్టుబడితే వలస పాలకుల చేతుల్లో తీవ్రమైన హింస, విచారణ, శిక్ష తప్పదని తెలిసిన పరిస్థితిలో ప్రీతిలత బందీగా చిక్కకుండా అమరత్వాన్ని ఎంచుకుంది. ఆ రోజుతో ఆమె జీవితం ముగిసినా, ఆమె పేరు మాత్రం భారత విప్లవ చరిత్రలో నిలిచిపోయింది. ప్రీతిలత త్యాగాన్ని స్మరించుకోవడం అంటే గతాన్ని ఆరాధించడం మాత్రమే కాదు. స్వేచ్ఛ, సమానత్వం, మానవ గౌరవం వంటి విలువలను వర్తమానంలో ఎలా కాపాడుకోవాలనే ప్రశ్నను ముందుకు తెచ్చుకోవడం కూడా.

స్వాతంత్ర్యోద్యమ చరిత్రను ఒకే రాజకీయ ధోరణి, ఒకే నాయకత్వం, ఒకే పద్ధతిలో జరిగిన పోరాటంగా చూపించడం చరిత్రకు న్యాయం చేయదు. సత్యాగ్రహాలున్నాయి. కార్మిక, రైతు ఉద్యమాలున్నాయి. విద్యార్థి, యువజన ఉద్యమాలున్నాయి. విప్లవకారుల సాయుధ ప్రతిఘటనలు కూడా ఉన్నాయి. మహిళల పోరాటాలు ఉన్నాయి. ఈ విభిన్న ప్రవాహాల సమష్టి భారత వలస వ్యతిరేక చరిత్రను నిర్మించింది. ప్రీతిలత ఆ చరిత్రలో మహిళా విప్లవకారిణుల చెరగని ముద్ర. ఆమెను కేవలం ఒక స్మారక చిహ్నంగా మార్చకూడదు. ఆమె జీవితాన్ని అధ్యయనం చేయాలి. ఆమె కాలంలోని సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఒక యువతి తన కాలపు భయాలను ఎలా అధిగమించింది? దేశ విముక్తి కోసం తన వ్యక్తిగత జీవితాన్ని ఎందుకు త్యాగం చేసింది? మహిళలు రాజకీయ పోరాటాల్లోకి రావడానికి ఆమెలాంటి విప్లవకారిణులు ఎలాంటి మార్గాన్ని తెరిచారు? ఇవన్నీ నేటి తరానికి చర్చించాల్సిన ప్రశ్నలు.

నేడు ప్రీతిలత వడ్డేదార్ 94వ వర్ధంతిని స్మరించుకుంటున్నప్పుడు, ఆమెను కేవలం గతంలోని వీరనారిగా చూడకుండా, అన్యాయాన్ని ప్రశ్నించే స్ఫూర్తిగా గుర్తించాలి. అణచివేత ఎక్కడ ఉన్నా దాన్ని ప్రశ్నించే ధైర్యం, అసమానత ఎక్కడ ఉన్నా దాని మూలాలను పరిశీలించే చైతన్యం, మనిషి గౌరవాన్ని కాపాడే సంకల్పాలన్ని ఆమె వారసత్వాన్ని అర్థవంతం చేసే మార్గాలు. ప్రీతిలత వడ్డేదార్ జీవితం చిన్నది. కానీ ఆమె ఎంచుకున్న మార్గం చరిత్రలో సుదీర్ఘ ప్రతిధ్వనిని మిగిల్చింది. ఆమె త్యాగం మనకు చెప్పేది ఒక్కటే. స్వేచ్ఛ అనేది ఎవరో ఇచ్చే వరం కాదు. దాని కోసం ప్రజలు పోరాడిన చరిత్ర ఉంది. ఆ చరిత్రలో మహిళల రక్తం, చెమట, ధైర్యం కూడా అంతే కీలకం. కామ్రేడ్ ప్రీతిలత వడ్డేదార్‌కు విప్లవ జోహార్లు. ఆమె త్యాగానికి ఎర్రజోహార్లు.



- మామిండ్ల రమేష్ రాజా
తెలంగాణ కార్యదర్శి
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్
7893230218

# ఎర్రజెండాల మధ్య అడ్డుగోడలు సిద్ధాంతాలా? ఆధిపత్యాలా..?



కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యమేనా..? ఈ ప్రశ్నకు సమాధానం వెతకడానికి ముందు కమ్యూనిస్టు ఉద్యమం తనను తాను అడగాల్సిన మరో ప్రశ్న ఉంది. ప్రజల విముక్తి కోసం పుట్టిన ఉద్యమాలు తమలోని విభజనలను అధిగమించలేకపోతే... సమాజంలోని విభజనలను ఎలా అధిగమిస్తాయి..? ఇది కమ్యూనిస్టు ఉద్యమాన్ని తక్కువ చేయడానికి వేసే ప్రశ్న కాదు. దాని చారిత్రక పాత్రను గుర్తిస్తూనే, నేటి వాస్తవాన్ని నిజాయితీగా పరిశీలించాల్సిన అవసరం నుంచి వచ్చే ప్రశ్న. సమానత్వం, దోపిడీ నిర్మూలన, శ్రమకు గౌరవం, సామాజిక న్యాయం వంటి లక్ష్యాలతో భారతదేశంలో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించిన కమ్యూనిస్టు శక్తులు కాలక్రమంలో అనేక రాజకీయ సంస్థలుగా విడిపోయాయి. ఈ విభజనలకు సిద్ధాంతపరమైన వైరుధ్యాలు ఉన్నాయి. రాజకీయ వ్యూహాలపై భేదాభిప్రాయాలున్నాయి. చారిత్రక పరిస్థితులు ఉన్నాయి. కానీ అంతటితోనే కథ ముగియదు. సిద్ధాంత భేదాలు ఒక కారణమైతే... సంస్థాగత ఆధిపత్యం, నాయకత్వ ప్రశ్నలు, గత అనుభవాలపై అవిశ్వాసం, తమ సంస్థే సరైనదనే మానసిక ధోరణి కూడా ఐక్యతకు అడ్డుగోడలుగా మారుతున్నాయా..? ఈ ప్రశ్నను తప్పించుకోవడం ద్వారా ఐక్యత సాధ్యం కాదు. మార్క్సిస్టు దృక్పథం మార్పును, వైరుధ్యాలను, చారిత్రక పరిణామాలను అర్థం చేసుకునే విశ్లేషణా పద్ధతిని అందిస్తుంది. కానీ సమాజం మారుతున్నదనే వాస్తవం నుంచి కమ్యూనిస్టు పార్టీల విలీనం తప్పనిసరిగా జరుగుతుందని తేల్చలేం. మార్పు ఏ దిశగా సాగుతుంది..? దానికి ప్రజల మద్దతు ఎలా లభిస్తుంది..? ఏ సంస్థలు దానికి నాయకత్వం వహిస్తాయి..? ఏ రాజకీయ కార్యక్రమం ప్రజల జీవితాలతో ముడిపడుతుంది..? ఇవే అసలు ప్రశ్నలు. ఇక్కడ మరో కోణం కూడా ఉంది.

పార్టీలు కేవలం సిద్ధాంత పత్రాలతో నడవవు. వాటిలో మనుషులు ఉంటారు. వారి జీవితాలు, త్యాగాలు, రాజకీయ గుర్తింపులు, గత విజయాలు, ఓటములు, ఘర్షణలు, నాయకత్వంతో ఉన్న అనుబంధాలు సంస్థాగత నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. దశాబ్దాలుగా ఒక జెండా కింద పనిచేసిన కార్యకర్తకు ఆ జెండా ఒక రాజకీయ గుర్తింపు మాత్రమే కాదు... అతని జీవితంలో ఒక భాగం. అందుకే విలీనం అనేది కేవలం జెండాలు, కార్యాలయాలు, పేర్లు మార్చడం కాదు. గతాన్ని ఎలా అర్థం చేసుకోవాలి..? తప్పిదాలను ఎలా అంగీకరించాలి..? నాయకత్వం ఎలా పంచుకోవాలి..? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రక్రియ.

కులం, వర్గం ప్రశ్న కూడా ఇందులో కీలకమే. భారతీయ సమాజంలో వర్గ దోపిడీతో పాటు కులాధిపత్యం, సామాజిక అసమానత, ప్రతినిధిత్వ సమస్యలు కొనసాగుతున్నాయి. కాబట్టి వర్గ ప్రశ్నను కుల ప్రశ్న నుంచి వేరు చేసి చూడటం ఎంత పరిమితమో, కులాన్ని పూర్తిగా వర్గంలో కలిపివేయడం కూడా అంతే పరిమితమైనదే. అంబేద్కర్ ఆలోచనలు, సామాజిక న్యాయ ఉద్యమాల అనుభవాలు, కులపీడిత సమూహాల స్వతంత్ర స్వరాలతో వామపక్ష రాజకీయాలకు మరింత లోతైన సంభాషణ అవసరం. మరోవైపు శ్రామిక ప్రపంచం కూడా మారిపోయింది. సంప్రదాయ పరిశ్రమల కార్మికులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అసంఘటిత, వలస, వ్యవసాయ, డిజిటల్ వేదికల కార్మికులు కొత్త వాస్తవాన్ని నిర్మిస్తున్నారు. వారి సమస్యలను అర్థం చేసుకోకుండా పాత రాజకీయ భాషలోనే మాట్లాడితే ప్రజల నుంచి ఉద్యమం మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది. అందుకే కమ్యూనిస్టు ఉద్యమం ముందున్న ప్రశ్న కేవలం ఎన్ని సీట్లు..? ఎన్ని పార్టీలు..? అన్నది కాదు. ప్రజలు ఇంకా ఎందుకు దూరమవుతున్నారు..? యువతతో సంబంధం ఎలా ఉంది..? మహిళలు, దళితులు, ఆదివాసీలు, అసంఘటిత కార్మికులు, కొత్తతరం శ్రామిక వర్గాలతో అనుబంధం ఎంత..? మారుతున్న సమాజాన్ని రాజకీయంగా అర్థం చేసుకునే సామర్థ్యం ఎంత..? అన్నదే అసలు ప్రశ్న. అయితే ఐక్యతకు మార్గం ఏమిటి..? వెంటనే అన్ని పార్టీల విలీనం కోరడం కంటే ప్రజా సమస్యలపై ఉమ్మడి కార్యాచరణతో ప్రారంభించడం ఆచరణాత్మకమైన మార్గం కావచ్చు. కార్మికులు, రైతులు, సామాజిక న్యాయం, ప్రజా హక్కులు, పర్యావరణం వంటి అంశాలపై కలిసి పోరాడాలి. ఉమ్మడి కనీస కార్యక్రమాలను రూపొందించాలి. కలిసి చేసిన ఉద్యమాలను సమీక్షించాలి. గత విభేదాలపై బహిరంగంగా చర్చించాలి. నాయకత్వం, ప్రతినిధిత్వం, నిర్ణయాధికారంపై పరస్పర విశ్వాసాన్ని నిర్మించాలి. విలీనం కంటే ముందు విశ్వాసం కావాలి. విశ్వాసం కంటే ముందు పరస్పర గౌరవం కావాలి. అవి రావాలంటే విమర్శతో పాటు ఆత్మవిమర్శ కూడా కావాలి. కాబట్టి కమ్యూనిస్టుల ఐక్యత అనేది కేవలం ఎర్రజెండాలను ఒకే వేదికపైకి తీసుకురావడం కాదు. ప్రజల జీవితాల్లో మార్పు కోసం అవసరమైన రాజకీయ విశ్వాసాన్ని తిరిగి నిర్మించడం. సిద్ధాంతాన్ని వదిలేయడం కాదు... ఆచరణతో పరీక్షించుకోవడం. గతాన్ని చెరిపేయడం కాదు... దాని నుంచి నేర్చుకోవడం. విభేదాలను దాచడం కాదు... వాటిని ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించడం. కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యమేనా..?అనే ప్రశ్నకు సమాధానం కేవలం పార్టీ కార్యాలయాల్లో దొరకదు. ప్రజా ఉద్యమాల్లో దొరుకుతుంది. ఎన్ని ఎర్రజెండాలున్నాయన్నది కంటే...ప్రజల కోసం ఎన్ని ఎర్రజెండాలు కలిసి కదులుతున్నాయన్నదే అసలు ప్రశ్న. ఎర్రజెండాల ఐక్యతకు ముందు... ప్రజల విశ్వాసాన్ని ఐక్యం చేయాలి. అదే కమ్యూనిస్టు ఉద్యమం ముందున్న అసలు చారిత్రక పరీక్ష.



దారా
rajenderdamera@gmail.com

# మహిళా రైతు సాధికారతే - వ్యవసాయ అభివృద్ధికి మార్గం!

భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక అయితే, ఆ వెన్నెముకను నిలబెట్టే ప్రధాన శక్తుల్లో మహిళలు ముందుంటారు. విత్తనాల ఎంపిక నుంచి నాట్లు వేయడం వరకు, కలుపు తీయడం నుంచి కోత వరకు, పశుపోషణ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ వరకు మహిళలు అనేక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ వారి శ్రమకు తగిన గుర్తింపు, ఆర్థిక ప్రతిఫలం, భూమిపై యాజమాన్య హక్కులు, రుణ సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల్లో ఇప్పటికీ తీవ్రమైన అసమానతలు కొనసాగుతున్నాయి. ఇది భారతీయ వ్యవసాయ రంగంలోని అతిపెద్ద వైరుధ్యాలలో ఒకటి.

వ్యవసాయ శ్రామిక శక్తిలో మహిళల వాటా 64 శాతంగా ఉంది. అంటే భారతీయ వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న ప్రతి వంద మందిలో గణనీయమైన సంఖ్యలో మహిళలు ఉన్నారని అర్థం. ఈ గణాంకం మహిళలు వ్యవసాయానికి కేవలం సహాయకులుగా మాత్రమే కాకుండా, ప్రధాన ఉత్పాదక శక్తిగా ఉన్నారనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పురుషులు ఉపాధి కోసం పట్టణాలకు, ఇతర రాష్ట్రాలకు లేదా విదేశాలకు వలస వెళుతున్న పరిస్థితుల్లో వ్యవసాయ బాధ్యతలు మహిళల భుజాలపై మరింతగా పడుతున్నాయి. పొలం దున్నే పనులు, విత్తనాలు వేయడం, నాట్లు వేయడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం, పంట కోయడం, ధాన్యం ఆరబెట్టడం, నిల్వ చేయడం, పశువుల సంరక్షణ వంటి అనేక పనుల్లో మహిళలు ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు.

అయితే వ్యవసాయ శ్రామిక శక్తిలో మహిళల వాటా 64 శాతం వరకు ఉన్నప్పటికీ, మహిళల చేతిలో ఉన్న సాగుభూమి విస్తీర్ణం కేవలం 11.7 శాతమే ఉండటం తీవ్రమైన అసమానతను సూచిస్తుంది. పొలంలో పనిచేసే మహిళకు ఆ పొలంపై యాజమాన్య హక్కు ఉండకపోవడం భారతీయ వ్యవసాయ వ్యవస్థలోని ప్రధాన సమస్య. భూమి కుటుంబ సభ్యుల పేర్లలో ఉన్నప్పటికీ, మహిళలు అదే భూమిపై రోజంతా శ్రమిస్తుంటారు. కానీ రైతుగా అధికారిక గుర్తింపు మాత్రం ఎక్కువ సందర్భాల్లో పురుషులకే లభిస్తుంది. భూమిపై యాజమాన్య హక్కు లేకపోవడం వల్ల మహిళలు వ్యవసాయ రుణాలు పొందడంలో, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుకోవడంలో, పంట బీమా పొందడంలో, వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేయడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భూమి మహిళల పేరుపై లేకపోతే ఆమెను అధికారికంగా రైతుగా గుర్తించని పరిస్థితులు ఇంకా అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఒక మహిళ ప్రతిరోజూ పొలంలో పనిచేస్తున్నా, నిర్ణయాలు తీసుకునే హక్కు ఆమెకు ఉండకపోవచ్చు. ఏ పంట వేయాలి, ఎప్పుడు విత్తనం కొనాలి, ఎరువులు ఎంత ఉపయోగించాలి, పంటను ఎక్కడ అమ్మాలి, వచ్చిన ఆదాయాన్ని ఎలా వినియోగించాలి వంటి కీలక నిర్ణయాలు పురుషుల ఆధీనంలోనే ఉండే పరిస్థితులు ఉన్నాయి. ఫలితంగా శ్రమ మహిళది అయినప్పటికీ, నిర్ణయాధికారం ఇతరుల చేతిలో ఉండటం ఆమె ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తోంది.

వేతన అసమానత కూడా వ్యవసాయ రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య. పురుషులు పొందే ప్రతి రూ.100 ఆదాయానికి మహిళలు కేవలం రూ.82 మాత్రమే పొందుతున్నారు. ఒకే రకమైన లేదా సమానమైన శ్రమ చేసినప్పటికీ మహిళలకు తక్కువ వేతనం ఇవ్వడం సామాజిక, ఆర్థిక అసమానతకు స్పష్టమైన ఉదాహరణ. వ్యవసాయ కూలీ పనుల్లో మహిళలు గంటల తరబడి కష్టపడుతున్నప్పటికీ, వారి పనికి తక్కువ విలువ కట్టడం అన్యాయం మాత్రమే కాదు, దేశ ఆర్థికాభివృద్ధికి కూడా ఆటంకం.

మహిళల శ్రమను తక్కువగా అంచనా వేయడానికి ఒక ప్రధాన కారణం వారి పనిలో చాలా భాగం అధికారికంగా నమోదు కాకపోవడమే. ఉదాహరణకు కుటుంబ పొలంలో పనిచేసే మహిళలు ఎక్కువగా వేతనం లేకుండానే శ్రమిస్తున్నారు. కుటుంబ పొలాల్లో ఉచితంగా పనిచేస్తున్న మహిళల శాతం 47.7 శాతం కాగా, పురుషులలో ఇది కేవలం 20.2 శాతం మాత్రమే. ఈ వ్యత్యాసం భారతీయ వ్యవసాయంలో మహిళల కనిపించని శ్రమ ఎంత విస్తృతంగా ఉందో తెలియజేస్తోంది.

ఒక రైతు కుటుంబంలో మహిళ ఉదయం నుంచి రాత్రి వరకు అనేక పనులు చేస్తుంది. పశువులకు మేత వేయడం, పాలు పితకడం, పొలానికి వెళ్లడం, కలుపు తీయడం, పంట కోతలో పాల్గొనడం, ఇంటికి వచ్చి కుటుంబానికి ఆహారం సిద్ధం చేయడం, పిల్లలను చూసుకోవడం వంటి అనేక బాధ్యతలను ఆమె నిర్వర్తిస్తుంది. కానీ ఈ పనుల్లో చాలా వాటికి ఆర్థిక విలువను కేటాయించడం జరగదు. ముఖ్యంగా కుటుంబ పొలంలో చేసే పనిని "కుటుంబ బాధ్యత"గా పరిగణించి వేతనం చెల్లించకపోవడం మహిళల ఆర్థిక స్థితిని బలహీనపరుస్తోంది.

వ్యవసాయ రంగంలో వనరుల అసమానత కూడా మహిళల ఉత్పాదకతపై ప్రభావం చూపుతోంది. అవసరమైన వనరులు అందుబాటులో లేకపోవడం వల్ల మహిళా రైతుల దిగుబడి సుమారు 24 శాతం వరకు వెనుకబడే పరిస్థితి ఉంది. ఇది మహిళలకు వ్యవసాయ నైపుణ్యం లేదని సూచించదు. భూమి, రుణం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, నీటి సదుపాయం, వ్యవసాయ యంత్రాలు, శిక్షణ, మార్కెట్ సమాచారం వంటి వనరులకు సమానమైన ప్రాప్యత లేకపోవడమే ప్రధాన కారణం.

ఒక మహిళా రైతుకు పురుష రైతుకు లభించే భూమి, రుణం, సాంకేతిక పరిజ్ఞానం, నీటి వనరులు, నాణ్యమైన విత్తనాలు, మార్కెట్ అవకాశాలు సమానంగా లభిస్తే ఆమె ఉత్పాదకతలో గణనీయమైన పెరుగుదల సాధ్యమవుతుంది. ప్రస్తుతం మహిళలు వెనుకబడుతున్నారనే పేరుతో వారి సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయడం సరైంది కాదు. అసలు సమస్య మహిళల సామర్థ్యంలో కాదు; వారికి అందుతున్న అవకాశాల్లో ఉంది.

భారతీయ వ్యవసాయంలో మహిళలు కేవలం పంటల సాగుకే పరిమితం కాలేదు. పశుపోషణ, కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం, మేకల పెంపకం, పాల ఉత్పత్తి, కూరగాయల సాగు, విత్తనాల సంరక్షణ, ఆహార నిల్వ, చిన్న తరహా వ్యవసాయ ఆధారిత ఉపాధి వంటి రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ కుటుంబాల ఆహార భద్రతలో కూడా మహిళల పాత్ర అత్యంత ప్రధానమైనది. కుటుంబానికి అవసరమైన ఆహార పదార్థాల ఎంపిక, నిల్వ, పోషకాహార నిర్వహణలో మహిళలు ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తారు. సాంప్రదాయ వ్యవసాయ జ్ఞానాన్ని తరతరాలకు అందించడంలో కూడా మహిళల పాత్ర గొప్పది. స్థానిక విత్తనాల ఎంపిక, విత్తనాల నిల్వ, పశువుల సంరక్షణ, స్థానిక వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతుల ఎంపిక వంటి అనేక విషయాల్లో గ్రామీణ మహిళలకు విశేషమైన అనుభవజ్ఞానం ఉంది. అయితే ఈ జ్ఞానానికి శాస్త్రీయ మరియు ఆర్థిక గుర్తింపు తక్కువగా లభిస్తోంది.



మహిళలపై కొనసాగుతున్న అసమానతలు వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు; అవి దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న అసమానతల కారణంగా ఏటా సుమారు 1.2 నుంచి 2 ట్రిలియన్‌ల వరకు ఉత్పత్తి విలువ కోల్పోతున్న పరిస్థితి ఉందని అంచనా. ఇది మొత్తం వ్యవసాయ దిగుబడిలో సుమారు 2.5 నుంచి 4 శాతం వరకు నష్టానికి సమానమని పేర్కొనబడుతోంది. అంటే మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం కేవలం సామాజిక న్యాయానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు; అది దేశ ఆర్థికాభివృద్ధికి అత్యవసరమైన చర్య కూడా.మహిళల శ్రమకు గుర్తింపు ఇవ్వడంలో మొదటి అడుగు వారిని అధికారికంగా రైతులుగా గుర్తించడం. భూమిపై మహిళల యాజమాన్య హక్కులను పెంచడానికి కుటుంబ స్థాయిలో సంయుక్త యాజమాన్య విధానాలను ప్రోత్సహించాలి. భూమి పత్రాల్లో మహిళల పేర్లను నమోదు చేయడం ద్వారా వారు వ్యవసాయ రుణాలు, బీమా, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. భూమి హక్కు మహిళకు ఆర్థిక భద్రతతో పాటు నిర్ణయాధికారాన్ని కూడా అందిస్తుంది.

మహిళలకు వ్యవసాయ రుణాల అందుబాటు కూడా విస్తరించాలి. చాలా మంది మహిళలకు భూమి వారి పేరుపై లేకపోవడం వల్ల రుణాలు పొందడం కష్టమవుతోంది. మహిళా రైతుల కోసం ప్రత్యేక రుణ సదుపాయాలు, తక్కువ వడ్డీతో ఆర్థిక సహాయం, స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యవసాయ పెట్టుబడి సదుపాయాలు మరింత బలోపేతం కావాలి. వ్యవసాయంలో మహిళలు స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవడానికి ఆర్థిక స్వావలంబన అత్యంత అవసరం.

సాంకేతిక పరిజ్ఞానం కూడా మహిళా రైతులకు చేరాలి. వ్యవసాయ యంత్రాలు ఎక్కువగా పురుషుల శారీరక సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించబడుతున్న సందర్భాలు ఉన్నాయి. మహిళలకు అనుకూలమైన తేలికపాటి వ్యవసాయ పరికరాలు, విత్తన యంత్రాలు, కలుపు తొలగింపు పరికరాలు, కోత పరికరాలు అందుబాటులోకి రావాలి. దీని ద్వారా మహిళల శారీరక శ్రమ తగ్గడంతో పాటు ఉత్పాదకత పెరుగుతుంది.

వ్యవసాయ శిక్షణ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం కూడా అవసరం. ఆధునిక సాగు పద్ధతులు, నీటి నిర్వహణ, వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయం, సేంద్రియ సాగు, మార్కెట్ సమాచారం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాల్లో మహిళలకు ప్రత్యేక శిక్షణ అందించాలి. మొబైల్ ఆధారిత వ్యవసాయ సమాచారం గ్రామీణ మహిళలకు వారి భాషలో అందుబాటులో ఉండాలి.

మహిళా రైతులు మార్కెట్ వ్యవస్థలో కూడా బలమైన స్థానం సంపాదించాలి. ప్రస్తుతం అనేక సందర్భాల్లో మహిళలు పంట ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషించినప్పటికీ, విక్రయ ప్రక్రియలో వారి భాగస్వామ్యం తక్కువగా ఉంటుంది. మార్కెట్‌కు వెళ్లడం, ధరలపై చర్చించడం, కొనుగోలుదారులతో సంబంధాలు ఏర్పాటు చేయడం వంటి అంశాల్లో పురుషుల ఆధిపత్యం కొనసాగుతోంది. మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మహిళలు సమిష్టిగా మార్కెట్‌లో మెరుగైన ధరలు పొందే అవకాశం ఉంటుంది.

భారతీయ వ్యవసాయం భవిష్యత్తు గురించి మాట్లాడేటప్పుడు మహిళల పాత్రను కేంద్రబిందువుగా తీసుకోవాలి. ఎందుకంటే వ్యవసాయ రంగంలో 64 శాతం వరకు మహిళల భాగస్వామ్యం ఉన్నప్పుడు, వారి అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ వ్యవసాయాభివృద్ధిని ఊహించడం సాధ్యం కాదు. అదే సమయంలో వారి చేతిలో కేవలం 11.7 శాతం సాగుభూమి ఉండటం, పురుషులు పొందే ప్రతి రూ.100కు మహిళలు రూ.82 మాత్రమే పొందడం, 47.7 శాతం మహిళలు కుటుంబ పొలాల్లో ఉచితంగా పనిచేయడం వంటి గణాంకాలు వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక మార్పులు ఎంత అవసరమో తెలియజేస్తున్నాయి.

ముగింపుగా చెప్పాలంటే, భారతీయ వ్యవసాయ రంగంలో మహిళ కేవలం వ్యవసాయ కూలీ కాదు; ఆమె రైతు, ఉత్పత్తిదారు, విత్తన సంరక్షకురాలు, పశుపోషకురాలు, కుటుంబ ఆహార భద్రతకు రక్షకురాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలక శక్తి. ఆమె శ్రమను గుర్తించకుండా భారతీయ వ్యవసాయ అభివృద్ధి పూర్తి కావడం సాధ్యం కాదు. పొలంలో మహిళ చేతులు పనిచేస్తున్నంత వరకు భారత వ్యవసాయం నిలబడుతుంది. కానీ ఆమె చేతులకు భూమి హక్కు, ఆమె శ్రమకు సమాన వేతనం, ఆమె నిర్ణయాలకు అధికారిక గుర్తింపు, ఆమె అభివృద్ధికి సమాన అవకాశాలు లభించినప్పుడే భారతీయ వ్యవసాయం నిజమైన అర్థంలో సమగ్రంగా అభివృద్ధి చెందుతుంది.

మహిళా రైతును సాధికారత చేయడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే అభివృద్ధి చేయడం కాదు. ఒక కుటుంబాన్ని బలోపేతం చేయడం, ఒక గ్రామాన్ని ఆర్థికంగా నిలబెట్టడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, దేశ ఆహార భద్రతను రక్షించడం, భారత ఆర్థికాభివృద్ధికి కొత్త బలం ఇవ్వడం. అందువల్ల భారతీయ వ్యవసాయం భవిష్యత్తు మహిళా రైతు చేతుల్లోనే ఉందని చెప్పడం అతిశయోక్తి కాదు.

"పొలంలో మహిళ చేతి శ్రమకు విలువ ఇచ్చిన రోజే, భారత వ్యవసాయానికి నిజమైన సమానత్వం లభిస్తుంది; మహిళా రైతు ఎదిగితేనే గ్రామం ఎదుగుతుంది, గ్రామం ఎదిగితేనే దేశం అభివృద్ధి చెందుతుంది."



ప్రొఫెసర్ సుంకరి జ్యోతి
డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం.

## అన్నోజిగూడలో గడువు ముగిసిన మసాలా ఉత్పత్తుల పట్టివేత

- దిల్‌బహార్ మసాలా కంపెనీలో పోచారం ఐటీ కారిడార్ పోలీసుల తనిఖీలు
- 2,000 యూనిట్లు స్వాధీనం



**ఘట్‌కేసర్ (పోచారం), సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** అన్నోజిగూడలో గడువు ముగిసిన మసాలా ఉత్పత్తులను నిల్వ ఉంచినట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో పోచారం ఐటీ కారిడార్ పోలీసులు, ఎస్‌ఓటీ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. అన్నోజిగూడలోని దిల్‌బహార్ మసాలా కంపెనీలో తనిఖీలు చేపట్టిన పోలీసులు గడువు ముగిసిన పలు రకాల మసాలా ఉత్పత్తులను గుర్తించారు. తనిఖీల్లో దిల్‌బహార్ మటన్ బిర్యానీ మసాలా, డ్రై మ్యాంగో, సబ్జీ మసాలా, చికెన్ మసాలా, మీట్ మసాలాతో పాటు ఫిష్, చికెన్, బిర్యానీ, తందూరీ చికెన్, సాంబార్ తదితర మసాలా ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 2,000 యూనిట్ల గడువు ముగిసిన ఆహార, మసాలా ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆహార భద్రతా నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల నిల్వ, విక్రయాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

# సోషల్ వాలా వెబ్‌సైట్ ఆవిష్కరణ

**నంగునూరు, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** విద్యార్థుల్లో సాంఘిక శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించి బోధన, అభ్యసన ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు సిద్ధిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఫోరం ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర విద్యార్థుల కోసం సిద్ధిపేట జిల్లా నంగునూరు గ్రామానికి చెందిన సుద్దాల రంజిత్ కుమార్ రూపొందించిన 'సోషల్ వాలా' వెబ్‌సైట్‌ను జిల్లా విద్యాధికారి (డీఈఓ) శ్రీ సిహెచ్.రమేశ్ బుధవారం ఆవిష్కరించారు. సుద్దాల రంజిత్ కుమార్ ప్రస్తుతం సిద్ధిపేట జిల్లాలో ధూళిమిట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. సిద్ధిపేట జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. ధూళిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుద్దాల రంజిత్ కుమార్ ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. సాంఘిక శాస్త్రాన్ని విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా, అవసరమైన విద్యా సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 'సోషల్ వాలా' వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు సుద్దాల రంజిత్ కుమార్ తెలిపారు. సాంఘిక శాస్త్రానికి సంబంధించిన వివిధ అంశాలను విద్యార్థులకు సులభంగా చేరువ అయ్యేలా చేయడం, పాఠ్యాంశ బోధనలో ఉపాధ్యాయులకు సహాయపడేలా డిజిటల్ వనరులను అందించడం వంటి లక్ష్యాలతో ఈ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను విద్యారంగంతో అనుసంధానం చేయడంలో భాగంగా ఈ ప్రయత్నం చేపట్టారు. వెబ్‌సైట్ ఆవిష్కరణ సందర్భంగా సిద్ధిపేట డీఈఓ సిహెచ్.రమేశ్ మాట్లాడుతూ సిద్ధిపేట జిల్లాలోని వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయుల ఫోరమ్‌లలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం వినూత్నంగా, సృజనాత్మకంగా కార్యక్రమాలను చేపడుతోందని అభినందించారు. కొత్త ఆలోచనలతో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందిస్తూ సాంఘిక శాస్త్ర ఫోరం ఇతర సబ్జెక్టు ఫోరమ్‌లకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సాంకేతికతను వినియోగించుకుని విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వనరులను అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు, 'సోషల్ వాలా' వెబ్‌సైట్ రూపకర్త సుద్దాల రంజిత్ కుమార్ లను అభినందించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు విద్యార్థులకు,



ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా కొనసాగుతున్నాయని ఫోరం ప్రతినిధులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సాంఘిక శాస్త్ర బోధనను మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా మార్చేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మామిడి పూర్ణచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి, పలువురు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఐఐ తెలంగాణ ఏఐ సమ్మిట్-2026



**ఖైరతాబాద్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** తెలంగాణను ప్రపంచ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి పనిచేయాలని తెలం గాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఐఏఎస్ పిలుపునిచ్చారు. సీఐఐ తెలంగాణ ఆధ్వ ర్యంలో 'ప్రపంచానికి తెలంగాణ గ్లోబల్ ఏఐ, జీసీసీ పరివర్తన' ఇతివృత్తంతో హైదరాబాద్‌లో ఏఐ సమ్మిట్-2026 నిర్వహించారు. ఏఐ ఉత్పత్తులు, ఐపీ, జీసీసీలు, డేటా సెంటర్లు, జీపీయూ మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, బాధ్యతాయుత ఏఐపై చర్చించారు. ఈ సందర్భంగా అనుదీప్ దురి శెట్టి ఐఏఎస్, ఎం.గౌతమ్ రెడ్డి, ఎం.వి.రెడ్డి, సంజీవ్ దేశ్‌పాండే, నీలోత్పల్ కుమార్ దత్తా, రాజన్ నవా నీ, గౌరవ్ మహేశ్వరి తదితరులు ఏఐ ఆవిష్కరణ లు, సురక్షిత మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌లు, జీసీసీలు, పరిశ్రమ-ప్రభుత్వ సహకారంపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఇక్కడే నిర్మించండి, ఇక్కడే సృష్టించండి, ఇక్కడే పెట్టుబడి పెట్టండి అని సంజయ్ జాజు పరిశ్రమలకు పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణకు లయన్స్ క్లబ్ శ్రీకారం



**అల్వాల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా అల్వాల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ అల్వాల్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతిని పరిరక్షించాలనే ఉద్దేశంతో వివిధ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధి లయన్ గౌరారం అంజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి. సత్యనారాయణరావు, చి. కిష్టయ్య, లయన్ పి. జయంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, ఉపాధ్యాయుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పొరపాట్లు లేకుండా సర్ ప్రక్రియ పూర్తి చేయాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలన




**రంగారెడ్డి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి నాగోల్ వార్డు కార్యాలయం, కుర్మి కాలనీ, శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లను సందర్శించి క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల వివరాల పరిశీలన, పాత ఓటర్ల జాబితాలతో మ్యాపింగ్, అనోమలీస్ వంటి కేటగిరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనర్హులు, డూప్లికేట్ ఎంట్రీల తొలగింపులో నిబంధనలు పాటించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి దరఖాస్తు వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. డోర్-టు-డోర్ వెరిఫికేషన్, డాక్యుమెంట్ల పరిశీలన, డేటా ఎంట్రీ ప్రక్రియల్లో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తు చేశారు. ఏవైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీ నగర్ ఈఆర్వో, జెడ్సీ వికాస్ మహతో, సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన




**అల్వాల్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** ఆయుర్వేద డే (ధన్వంతరి జయంతి) సందర్భంగా అల్వాల్‌లో డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో బుధవారం ఆయుర్వేద ప్రాధాన్యం, ఆరోగ్యకరమైన జీవన విధానం, ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుర్వేదానికి ఆద్యుడైన ధన్వంతరి భగవానుడు శ్రీమహావిష్ణువు అవతారమని డాక్టర్ శైలజ తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు జీవనశైలిలో క్రమశిక్షణ అవసరమన్నారు. ఉదయాన్నే నిద్రలేచి యోగా, వ్యాయామం వంటి అలవాట్లను పాటించాలని సూచించారు. పోషక విలువలున్న ఆహారం తీసుకుంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. కార్యక్రమంలో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ అనగ్, వైద్య సిబ్బంది, జేఏసీ నాయకుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో పనిచేసే కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**తూప్రాన్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనాన్ని చెల్లించాలని. జీవో నెంబర్ 6ను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు. మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో స్థానిక యూనియన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తూ సెప్టెంబర్ నెల పూర్తి కావస్తున్న నేటికి ఆగస్టు నెల వేతనం అందక కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వం మే నెలలో జీవో నం 6 విడుదల చేసిందని కానీ ఈ జీవో ను ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు అమలు చేయడం లేదని వెంటనే అమలు చేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఓపి ల(రోగుల) సంఖ్య గణనీయంగా పెరిగిందని కార్మికుల సంఖ్య కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల పైన పని భారం అధికమవుతుందన్నారు. అలాగే కార్మికులకు పిఎఫ్ పథకాన్ని ను సక్రమంగా అమలు చేయాలని పెండింగ్ లో ఉన్న వేతనం తో పాటు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 6 ను ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల అందరికీ అమలు చేయాలని, ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మి,మహేశ్వరి,నవనిత,శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## అధిష్ఠానం నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- మల్‌రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షురాలు పారిజాత
- జిల్లాలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలి
- ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** కష్టపడి పనిచేసిన కార్యకర్త ఏ స్థాయికైనా ఎదిగే అవకాశం కాంగ్రెస్‌లో మాత్రమే ఉంటుందని, డీసీసీ ప్రెసిడెంట్‌గా పారిజాత నియామకమే ఇందుకు నిదర్శనమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన చిగురింత పారిజాతా నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా తిరుమలహిల్స్‌లోని నివాసంలో మల్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే కొత్త బాధ్యతల్లో మంచిపేరు తెచ్చుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్‌ను జిల్లాలో మరింత బలోపేతం చేయాలని చెప్పారు. కార్యకర్తలు, నాయకులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. డీసీసీ అధ్యక్షులుగా నియామకంలో సహకరించిన మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకతతో జరగాలి

- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** ఎస్ఐఆర్ (2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి. నారాయణరెడ్డితో కలిసి నాగోల్ వార్డు కార్యాలయం, కుర్మికాలనీ, శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లను సందర్శించి క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు,ఈ సందర్భంగా ఓటర్ల వివరాల పరిశీలన, పాత ఓటర్ల జాబితాలతో మ్యాపింగ్,నో మ్యాపింగ్ వంటి కేటగిరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఈవోసూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హులు, డూప్లికేట్ ఎంట్రీలు, చిరునామా మార్పులు తదితర అంశాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు,క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తు, అభ్యంతరం, నోటీసు, ఫైల్ డిస్పోజల్ వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలు, వివరణలను నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రతి బిఎల్ ఓ క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని ఓటర్ల వివరాలను



బాధ్యతాయుతంగా పరిశీలించాలని సీఈవో తెలిపారు. డోర్-టు-డోర్ వెరిఫికేషన్, డాక్యుమెంట్ల పరిశీలన, డేటా ఎంట్రీ, మ్యాపింగ్ తదితర ప్రక్రియల్లో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు,ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక లేదా క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి దశను సమర్థవంతంగా పూర్తి చేయాలని సీఈవో సూచించారు. నిర్దేశిత కాలపరిమితిలో ప్రక్రియను పూర్తి చేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎల్‌బీ నగర్ వికాస్ మహాతో, సంబంధిత ఎన్నికల అధికారులు, బిఎల్వోలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**హయత్‌నగర్, సెప్టెంబర్ 22 (జనం సాక్షి) :** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ అధికారులు సూచించారు. బంజారా కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత పద్ధతులను ప్రజలకు వివరించారు. ఫోన్ చేసి లాటరీ తగిలిందని, బహుమతి వచ్చిందని చెప్పి ప్రాసెసింగ్ ఫీజు పేరుతో డబ్బులు పంపించమని కోరే వ్యక్తులను నమ్మవద్దని పోలీసులు హెచ్చరించారు. అదేవిధంగా ఫోన్‌పే, ఇతర డిజిటల్ చెల్లింపుల ద్వారా మోసాలకు పాల్పడే నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆటోలు, కార్లు నడిపే డ్రైవర్లు, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి యాప్‌లలో పనిచేసే వారు కూడా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బుకింగ్ పేరుతో ఫోన్ చేసి ముందుగా డబ్బులు పంపించమని కోరే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే రోడ్డుపై పరిచయం లేని వ్యక్తులు ఫోన్ చేసుకోవడానికి మొబైల్ అడిగితే ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్‌కు వచ్చే ఓటీపీ ను ఇతరులకు చెప్పకూడదని పోలీసులు సూచించారు. రాత్రి సమయంలో కాలనీలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ప్రజలు స్వయంగా వారిని ఎదుర్కోకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని సూచించారు. అనుమానాస్పద వాహనం కనిపిస్తే



సాధ్యమైనంత సురక్షితంగా వాహనం నంబర్‌ను పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. కాలనీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ పీఎస్ క్రైమ్ సీఐ, ఎస్ఐలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారా కాలనీ పెద్దలు మేగావత్ రఘుపతి నాయక్, జాటోత్ పంతు నాయక్, మేగావత్ గోవర్ధన్ నాయక్, గుగులోత్ బాలు నాయక్, కె. లక్ష్మణ్ నాయక్, జాటోత్ సాయి నాయక్, మేగావత్ మోహన్ నాయక్ తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

6 | JANAMSAKSHI DAILY
జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
24 సెప్టెంబర్ 2026

# ఉపాధ్యాయులు లేకుండానే గురుకులాల నిర్వహణ

- ప్రధాన సబ్జెక్టుల బోధనకు దిక్కెవరు..?
- మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి కీలక సబ్జెక్టుల్లో ఖాళీలు
- నోటిఫికేషన్ జారీ చేసి, డెమోలు నిర్వహించినా భర్తీ కాని వైనం
- ఆగస్టు 10లోగా నియామకాలు పూర్తి చేయాలన్న ఆదేశాలు బేఖాతరు
- నిజామాబాద్, కామారెడ్డిలో భర్తీ పూర్తి.. మెదక్‌లోనే ఇంకా పెండింగ్
- వెంటనే నియామకాలు చేపట్టాలని నిరుద్యోగ అభ్యర్థుల డిమాండ్

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత రెండు, మూడు సంవత్సరాలుగా పలు సబ్జెక్టులకు పూర్తిస్థాయి ఉపాధ్యాయులు లేకుండానే విద్యాసంస్థలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలకమైన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్టుల్లో సైతం బోధనా సిబ్బంది కొరత ఉండటంతో విద్యార్థులు నష్టపోతున్నారని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 25 నుంచి 30 సబ్జెక్టుల్లో ఖాళీలు మెదక్ జిల్లా పరిధిలో చేగుంట, మెదక్, కౌడిపల్లి, నర్సాపూర్ ప్రాంతాల్లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల ఆధ్వర్యంలో ఒక మహిళా డిగ్రీ కళాశాల, రెండు యూఆర్‌జేసీ బాలికల పాఠశాలలు, ఒక యూఆర్‌జేసీ బాలికల స్పోర్ట్స్ పాఠశాల, ఒక సీఓఈ బాలుర కళాశాల, రెండు యూఆర్‌జేసీ బాలుర పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఈ విద్యాసంస్థల్లో తెలుగు, ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోసైన్స్, బోటనీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పీడీ తదితర సుమారు 25 నుంచి 30 సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు సమాచారం. దీంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదని, గురుకులాల విద్యా ప్రమాణాలు క్రమంగా పడిపోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




### ఆదేశాలు ఉన్నా.. నియామకాలు ఎక్కడ..?

గురుకులాల్లో సిబ్బంది కొరతను గుర్తించిన గిరిజన గురుకులాల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి గత జూలైలో అవసరమున్న చోట పార్ట్‌టైం సిబ్బందిని నియమించాలని సంబంధిత రీజినల్ కోఆర్డినేటింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఆగస్టు 10లోగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఈ మేరకు మెదక్ ఆర్‌సీఓ గంగారాం నాయక్ జూలై 20న ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో సుమారు 25 పార్ట్‌టైం పోస్టుల భర్తీకి జూలై 21 నుంచి 25 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం జూలై 28న చేగుంట బాలికల స్పోర్ట్స్ పాఠశాలలో అభ్యర్థుల నుంచి డెమోలు నిర్వహించారు.

### నెల రోజులు గడిచినా.. ముందుకు సాగని ప్రక్రియ

దరఖాస్తుల స్వీకరణ, డెమోల నిర్వహణ పూర్తయి నెల రోజులు దాటుతున్నప్పటికీ, ఇప్పటివరకు నియామక ప్రక్రియ పూర్తికాలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియామకాలపై ఆర్‌సీఓ కార్యాలయాన్ని సంప్రదిస్తే కలెక్టర్ అనుమతి, సంతకం రావాల్సి ఉందని సిబ్బంది చెబుతున్నట్లు పలువురు అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. అయితే మెదక్ జిల్లాలోనే ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉండటంపై అభ్యర్థులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

### పారదర్శకతపై అనుమానాలు

పార్ట్‌టైం ఉపాధ్యాయుల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోంది. నియామకాల్లో అక్రమాలకు అవకాశం ఉందన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కాలేదు. నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించి, పెండింగ్‌లో ఉన్న నియామకాలను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా..?

గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాల్సిన సమయంలో నియామకాల ప్రక్రియే నిలిచిపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ భర్తీలు పూర్తికాకపోవడం, కీలక సబ్జెక్టులకు బోధన అందకపోవడం విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి, నియామకాలను వేగవంతం చేసి గురుకులాల్లో బోధనా వ్యవస్థను గాడిలో పెట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ అభ్యర్థులు కోరుతున్నారు.

# జూరాల రైతులకు సాగునీరు అందించే వరకు పోరాటం కొనసాగిస్తాం




**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యలను తెలుసుకుని, రైతులకు అండగా నిలిచేందుకు జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్‌రావును జడ్చర్ల వద్ద పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆయనతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. బుధవారం తన నివాసంలో మాట్లాడుతూ అయ్యగారి ప్రభాకర్ రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షులు బి నారాయణ మాట్లాడుతూ.. రైతుల పక్షాన నిలబడి వారి సమస్యలను తెలుసుకోవడానికి వెళ్తున్న బీజేపీ నాయకులను అడ్డుకోవడం, అరెస్టులు చేయడం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ప్రభుత్వం రైతులపై దృష్టి పెట్టి జూరాల ఆయకట్టు రైతులకు అవసరమైన సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పోరాటం నేపథ్యంలో జూరాల నుంచి సాగునీటి విడుదల ప్రారంభమైందని, అయితే పంట చేతికి వచ్చే వరకు రైతులకు అవసరమైన నీటిని నిరంతరంగా విడుదల చేయాలని కోరారు. రైతుల పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైతే కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి అదనపు నీటిని విడుదల చేయించేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్ణాటకతో సమన్వయం చేసుకుని రైతుల పంటలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రైతుల సాగునీటి సమస్య పరిష్కారం అయ్యే వరకు బీజేపీ రైతుల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రేచింతల శ్రీనివాసులు కదిరి మధు పాల్గొన్నారు.

# ఉత్సవాలతో గ్రామాల్లో ఐక్యత చాటాలి

- జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో బుధవారం జరిగిన గణేష్ నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ గణపతి దేవునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం గ్రామ ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,యువతతో కలిసి నిమజ్జన శోభాయాత్రనును తిలకించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ఉత్సవాలతో గ్రామాలలో ఐక్యత చాటాలని, కోటకొండ గ్రామం ఐక్యతకు,సామరస్యానికి చిరునామాగా నిలుస్తుం దని అన్నారు. గ్రామంలో మొత్తం 58 గణపతి విగ్ర హాలను ఏర్పాటు చేసి, అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీ యమన్నారు. గణేష్ శోభా యాత్ర, నిమజ్జనం సంద ర్భంగా పోలీస్ శాఖ సూచ నలను పాటిస్తూ గ్రామ ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు, యువత డీజేలను వినియోగించ కుండా పోలీస్ శాఖకు సహకరించడం పట్ల ఎస్పీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. గణేష్ నిమజ్జన వేడుకలు సోదర భావం, ఐక్యత, సామర స్యానికి ప్రతీకగా నిలవా లని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సతీష్ రెడ్డి, బీజేపీ నాయకులు పగుడకుల శ్రీనివాసులు, విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముక్ పగడాకుల భాగస్వామి, పూజారి శాంత నంద, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరూ పనిచేయాలి

**కోహెడ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** మండలంలోని నకిరేకొమ్ముల గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖా అధ్యక్షుల సమక్షంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి కార్యకర్తల సన్నాహక సమావేశమును స్థానిక సర్పంచ్ బుర్ర కళ్యాణి – మహేష్ తో కలిసి పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిరేకొమ్ముల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , అందరూ సమిష్టిగా పనిచేసి శాసనసభ ఎన్నికల్లో, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ఇచ్చారని అదే స్ఫూర్తిని తీసుకొని అందరూ కూడా ఐక్యంగా ఉండి పార్టీనీ మరింతగా బలోపేతం చేసి రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ ప్రజాపాలన ప్రభుత్వంలో రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మన హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని, హుస్నాబాద్ నియోజకవర్గానికి మంత్రి పదవి రావడం, తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో పోరాటం చేసి రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా పని చేసిన పొన్నం ప్రభాకర్ కు మంత్రి పదవి రావడం అనేది హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. కోహెడ మండల కేంద్రంలో ఉన్న బాదుగుల చెరువు మరమ్మత్తు కోసం రెండు కోట్ల నలభై లక్షల రూపాయలు రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ సంఘం శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో రెండు వందల కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడము, వచ్చే విద్యా సంవత్సరానికి ఈ ప్రాంత పేద విద్యార్థులు చదువుకునేలా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ ప్రాంత రైతాంగం ఎంతో ఆశతో వేచి చూస్తున్న గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టును పూర్తి చేసి అలాగే వరద కాలువల ద్వారా భూమిని కోల్పోతున్న రైతులకు పరిహారం చెక్కులు కూడా ఇస్తున్నారని ,ప్రతి ఎకరాకు నీరు ఇచ్చే విధంగా మంత్రి పని చేస్తున్నారని అన్నారు. అలాగే నకిరేకొమ్ముల గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడము, పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారని అన్నారు. రానున్న రోజుల్లో కూడా ఈ గ్రామానికి మరిన్ని నిధులు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు చేస్తారని అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అందరూ కూడా ఇదే స్ఫూర్తితో పని చేసి



తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ప్రజా పాలన ప్రభుత్వం అధికారమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బీమ్ రెడ్డి తిరుపతి రెడ్డి, వరికోల్ మాజీ ఎంపీటీసీ బోయిని జయరాజు,మాజీ సర్పంచ్ లు బండిపెల్లి నారాయణ గౌడ్,బీమ్ రెడ్డి మల్లారెడ్డి, పిల్లి రాజయ్య,పాము శ్రీకాంత్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్ గౌడ్, హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆవుల మహేందర్,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముంజ శివసాయి గౌడ్,మల్యాల శ్రీనివాస్ రెడ్డి,లెంకల శ్రీకాంత్ వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బురదమయంగా జర్నలిస్ట్ కాలనీ రోడ్డు

- డ్రైనేజీ నిర్మాణం చేపట్టండి

**పెబ్బేరు, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని జర్నలిస్టు కాలనీలోని ప్రధాన రహదారి గుంతలతో నిండిపోయి, మట్టి దారిని తలపిస్తోంది. రహదారిపై ఎక్కడ చూసినా గుంతలు, ఎగుడుదిగుడులు కనిపిస్తుండటంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. దుమ్ము లేస్తుండటంతో పాదచారులు, వర్షం పడితే గుంతల్లో నీరు చేరి రహదారి పరిస్థితి మరింత ధమనీయంగా మారుతోంది. జర్నలిస్టు కాలనీ రహదారి గా చూస్తే సమస్య తీవ్రత అర్థం కాదు. రాష్ట్రంలోని ప్రముఖ సంతల్లో ఒకటైన పెబ్బేరు సంతకు ప్రతి శనివారం వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. సంతకు వచ్చి వెళ్లే వారిలో చాలామంది ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నారు. ప్రతి శనివారం రద్దీతో కనిపించే ఈ రహదారి మిగతా రోజుల్లో గుంతలతో, దుమ్ముతో దర్శనమిస్తోంది. సంతకు వచ్చే వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ఈ గుంతలను తప్పించుకుంటూ ముందుకు సాగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల రాకపోకలకు ఇంతటి ప్రాధాన్యత ఉన్న రహదారి ఏళ్ల తరబడి ఇలాగే ఉండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జూరాల ప్రధాన ఎడమ కాలువ సమీపంలో ఉండటం వల్ల రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉంది. గతంలో రోడ్డు బుడదమయంగా ఉండడంతో జూరాల కాలువలోకి ట్రాక్టర్ దూసుకుపోయి ఒక వ్యక్తి మృతి చెందారు. వేలాది మంది ప్రజలు, వ్యాపారులు వినియోగించే ప్రధాన రహదారిగా గుర్తించాలని సూచించారు. తక్షణమే డ్రైనేజ్, రోడ్డు నిర్మాణం చేపట్టాలని, స్థానిక ఎమ్మెల్యే మెఘారెడ్డి తో పాటు మున్సిపల్, చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, పాలక వర్గం ప్రత్యేక చొరవ చూపాలని కాలనీవాసులు విన్నవించారు.



# వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని జిల్లాల్లో అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి, అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో హైదరాబాదు నుంచి వరి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డిజిటల్ క్రాప్ సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీ (ఫార్మర్ ఐడీ నమోదు) ప్రక్రియలపై ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. తగినన్ని లారీలు, టార్పాలిన్ లు, గన్నీ సంచులు, హమాలీలు, సామాగ్రి సమకూర్చుకోవాలన్నారు. సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఏడు రకాల సన్న వరి వడ్లు పండించిన రైతులకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందిస్తామన్నారు. ఈ వీసీలో డిఆర్‌డివో శ్రీనివాస్ రావు, కో ఆపరేటివ్ శాఖ అధికారి పద్మ,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# తల్లునూర్ గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలి

- 100 రోజుల దీక్షకు రేవల్లి మండల నాయకుల మద్దతు
- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం

**రేవల్లి, సెప్టెంబర్ 10 (జనంసాక్షి) :** తల్లునూర్ గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా, రేవల్లి మండల నాయకులు, వివిధ గ్రామాల నాయకులు డప్పు వాయిద్యాలతో గ్రామ ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించి సంఘీభావం తెలిపారు. తల్లునూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్ద బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు రేవల్లి మండల మాజీ జడ్పీటీసీ బోర్ల భీమన్న మాట్లాడుతూ... తల్లునూర్ గ్రామం భౌగోళికంగా నాగర్ కర్నూల్ జిల్లాకు దగ్గరగా ఉందని, పరిపాలనా సౌలభ్యం కోసం ఆ జిల్లాలో విలీనం చేయడం న్యాయమైన డిమాండ్ అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దీక్షలో పాల్గొన్న వారికి మద్దతుగా నల్ల రిబ్బన్లు ధరించి సంఘీభావం ప్రకటించారు. వంద రోజులు పూర్తి చేసుకున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి హామీ రాకపోవడం బాధాకరమని, డిమాండ్ నెరవేరే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

### ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఏమైంది..?

దీక్షా శిబిరంలో వక్తలు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ తమ గ్రామానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉంటే, ప్రస్తుత జిల్లా కేంద్రమైన వనపర్తి 30 కిలోమీటర్ల దూరంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రవాణా, విద్యా, వైద్య వసతులు లేక గ్రామం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి గెలిచిన మూడు నెలల్లోనే తలుపునూరిని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలుపుతానని బొడ్రాయి వద్ద హామీ ఇచ్చారని, కానీ 100 రోజులు గడిచినా ఆ మాటను నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. ఊరిలోకి రాకుండా పక్కదారి నుంచి వెళ్లడం ఎమ్మెల్యే బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.

### బెదిరింపులకు, కేసులకు భయపడేది లేదు

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై అక్రమ కేసులు బనాయించి, గంటల తరబడి పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టడం దారుణమని అఖిలపక్ష కమిటీ అధ్యక్షులు కుంటి నరసింహ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు తీసేస్తామని, స్థానిక కాంగ్రెస్ నాయకులు, అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాడుతున్న తమను ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. తల్లునూర్ గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలిపేంత వరకు తమ పోరాటం ఆగదని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తలుపునూరు గ్రామాన్ని వనపర్తి జిల్లా నుండి నాగర్ కర్నూలు జిల్లాలో కలపాలని వంద రోజులుగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఇట్టి రిలే నిరాహార దీక్షకు మద్దతుగా, వనపర్తి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు వీరపాగ రామకృష్ణ హాజరై




తల్లునూర్ గ్రామం భౌగోళికంగా వనపర్తికి 32 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. అన్ని రవాణా సౌకర్యాలకు, వసతులకు అనుకూలమమైన ప్రాంతం నాగర్ కర్నూల్ కావున నాగర్ కర్నూలు జిల్లాకు గ్రామానికి అతి సమీపంలో 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. గ్రామ ప్రజలందరూ కూడా వారి యొక్క నిత్యవసర సరుకులు, విద్య, ఉద్యోగాలు మొదలైన పనులను అన్నింటిని నాగర్ కర్నూల్ అనుకూలంగా ఉంటుంది, కావున గత ఎలక్షన్లో వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో కలపాలని తన ప్రసంగంలో వివరించడం జరిగింది. అనంతరం తమయొక్క గ్రామాన్ని నాగర్ కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలని గ్రామంలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేవల్లి మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, యువజన సంఘాల నాయకులు, తలుపునూరు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువపత్రాలు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** అర్హులైన దివ్యాంగులందరికీ సదరం సర్టిఫికెట్స్ నిబంధనల ప్రకారం జారీ చేయడం జరుగుతుందని, ప్రత్యేక శిబిరంకు హాజరు కాలేకపోయిన దివ్యాంగులు నిర్దేశిత సమయంలో ప్రభుత్వాసుపత్రిలో కూడా పరీక్షలు చేయించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సెర్ప్ సహకారంతో గద్వాలలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో రెండు రోజులపాటు మానసిక సమస్యలున్న దివ్యాంగులకు నిర్వహించిన ప్రత్యేక మెగా సదరం శిబిరంను బుధవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు, వైద్యులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. శిబిరంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పలువురు కుటుంబ సభ్యులతో దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. రెండో రోజు ప్రత్యేకంగా దివ్యాంగ చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని, అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాలు మంజూరు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిపిఎం అరుణ, ఏపిఎం భీమన్న, తదితరులున్నారు.



## మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల

# పంపిణీ త్వరగా పూర్తి చేయాలి



- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు 6 వరకు అవకాశం
- ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 23(జనంసాక్షి) :** ప్రత్యేక సమగ్ర సవరణ-2026లో భాగంగా మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన నోటీసుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని ఎన్నికల నమోదు అధికారి, ములుగు రెవెన్యూ డివిజనల్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా రెవెన్యూ కార్యాలయంలో 109--ములుగు శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో, సమావేశం నిర్వహించి, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతి, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల పంపిణీ, దరఖాస్తులు, అభ్యంతరాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా సవరణ షెడ్యూల్‌పై చర్చించారు. ప్రత్యేక సమగ్ర సవరణలో గుర్తించిన మ్యాపింగ్ కాని వ్యత్యాస కేసులకు సంబంధించి మొత్తం 41,900 నోటీసులు రూపొందించినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు 38,571 నోటీసులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన నోటీసుల పంపిణీని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. గత వారం నుంచి బుధవారం వరకు వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలకు సంబంధించిన జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ప్రత్యేక సమగ్ర సవరణపై ఏవైనా సూచనలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఓటరు జాబితా సవరణకు భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను సమావేశంలో వివరించారు. 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. 2023 నవంబర్ 1 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ, తత్సమాన విద్యార్హత పొందిన అర్హులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నమూనా--18లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 28న బహిరంగ ప్రకటన జారీ చేస్తారని, అక్టోబర్ 15న మొదటి పునఃప్రచురణ, అక్టోబర్ 25న రెండో పునఃప్రచురణ ఉంటుందని తెలిపారు. నమూనా--18 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తారని, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఈ షెడ్యూల్ ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దైవిక సేవా కార్యక్రమాలు

# సత్ మార్గంలో నడిపిస్తాయి



**బయ్యారం సెప్టెంబర్ 23(జనంసాక్షి) :** భక్తి శ్రద్ధలతో భగవంతుణ్ణి కొలవడం దైవిక కార్యక్రమాల తోపాటు వితరణ సేవా కార్యక్రమాలు చేపట్టడం లాంటివి ఓ వ్యక్తిని మంచి మార్గంలో నడిపిస్తా యని బయ్యారం తహసిల్దార్ నాగరాజు , గార్ల ,బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవీందర్ ,ఎస్సై ప్రశాంత్ బాబు, సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ లు అన్నారు. మండలకేంద్రం లోని శ్రీ భ్రమరాంభిక సహిత మల్లిఖార్జున స్వామి ఆలయంలో కొలువుదీరిన విఘ్నేశ్వరుని నవరాత్రుల సందర్భంగా బుదవారం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న పరిస్థుతుల వల్ల పెరుగుతున్న అవసరాలను తీర్చుకోవడానికి పోటీ పడుతున్న మానవుడు సుఖ శాంతులకు దూరం అవుతున్నాడని అన్నారు. మనిషి కి మనిషికి మధ్య అనుబంధాలు,ఆత్మీయతల కంటే ఆర్థిక బంధాలు బలపడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.ఈ పరిస్థితుల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనిషిలో మార్పుకు ఎంతో దోహద పడతాయని తెలిపారు. యువ కులు ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ముందుండాలని పలితంగా యువకులకు సత్ ప్రవర్తన అలవడుతునందని అన్నారు. అన్న దాన కార్యక్రమం నిర్వహించిన నిర్వాహ కులను అందుకు సహకరించిన దాతలను అభినందించారు.ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని దాతలను నిర్వాహకులను కోరారు.ఈ సంద ర్భంగా ఆలయ అర్చకులు ఉదయ కుమారా చార్యులు గణనాథున్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. అధికారుల చేత ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సంధర్భంగా నిర్వహకులు అధికారులను, ప్రజా ప్రతినిధుల ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయపు సిబ్బంది,పోలీస్ సిబ్బంది,గ్రామ పంచాయతీ సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గంగమ్మ చెంతకు గణపతులు

- నిమజ్జనానికి సర్వం సిద్ధం
- 300 విగ్రహాల వరకు నిమజ్జనం



**కాళేశ్వరం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం వద్ద గల తెలంగాణ - మహారాష్ట్ర అంతర్ రాష్ట్ర వంతెన పై వినాయక నిమజ్జనానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. సెప్టెంబర్ 23 బుధవారం నుంచి సెప్టెంబర్ 25 అనంత చతుర్దశి వరకు ఈ నిమజ్జన వేడుకలు ప్రధానంగా సాగనున్నాయి. వంతెన పైనుంచి విగ్రహాలను సురక్షితంగా నదిలోకి నిమజ్జనం చేసేందుకు వీలుగా వంతెనపై నాలుగు ప్రత్యేక ప్రాంతాలలో స్టాండ్స్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో కూడా నిమజ్జనాలు సాఫీగా సాగేందుకు వంతెన పొడవునా భారీ ఫ్లడ్‌లైట్లు, విగ్రహాలను ఎత్తేందుకు నాలుగు క్రేన్లను అందుబాటులో ఉంచారు. స్థానిక ఎమ్మార్వో ఆధ్వర్యంలో 15 మంది రెవెన్యూ సిబ్బంది ఈ నిమజ్జన సేవలలో సేవలందిస్తున్నారు. కాళేశ్వరం అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో కాటారం డీఎస్పీ, మహాదేవపూర్ సి ఐ , కాళేశ్వరం ఎస్ ఐ తదితర 100 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అంతరాష్ట్ర వంతెన వద్ద బార్డర్ చెక్పోస్ట్ ను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. కాళేశ్వరం బస్టాండ్ వద్ద గల శ్రీపాదరావు విగ్రహం వద్ద నుండి నిమజ్జన వాహనాలు అంతర్ రాష్ట్ర వంతెన వద్దకు వెళ్లి విగ్రహాల నిమజ్జనం అనంతరం తిరిగి అదే దారిలో మహాదేవపూర్ మీదుగా తమ తమ స్థానాలకు వెళ్ళనున్నాయి. శ్రీపాదరావు విగ్రహం వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి విగ్రహాలు నిమజ్జనం కోసం గ్రామంలోనికి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.కాళేశ్వరం గ్రామం లోని వివిధ వాడలలో ప్రతిష్టించిన దాదాపు పది వినాయక విగ్రహాలను గ్రామంలోని వీధుల గుండా ఊరేగించి గోదావరి పుష్కర ఘాట్ లో నిమజ్జనం చేశారు.నదీ తీరంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా నిపుణులైన ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లతో కూడిన రెస్క్యూ టీమ్స్‌ను బోట్లతో సహా సిద్ధంగా ఉంచారు. తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వంతెన పరిసరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా వాహనాల పార్కింగ్ స్థలాలను కేటాయించారు.భక్తులకు తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాల కొరకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు.

# ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు


- మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- 15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిల్లాలో పర్యాటక, వైద్య, రవాణా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- లక్ష్మీనగర్‌లో 5.95 కోట్లతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును ప్రారంభించిన
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 23(జనంసాక్షి) :** ములుగు పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు లక్ష్మీనగర్‌లో 5.95 కోట్ల పంచాయతీరాజ్ శాఖ నిధులతో నిర్మించిన ఈస్ట్ రోడ్డును జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు పట్టణ విస్తరణకు అనుగుణంగా రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. బృందావనం కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో నివాసాలు విస్తరించడంతో స్థానికుల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కల్పించేందుకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. గతంలో మంజూరైన రహదారి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. ములుగు గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో మంజూరైన అభివృద్ధి పనులతోపాటు మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత పెరిగిన అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో అవసరమైన రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ములుగు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ట్యాంకులు, తోపుకుంట మినీ ట్యాంక్‌బండ్, అంతర్గత రహదారులు, స్మశానవాటిక అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం సమర్పించిన వినతులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా సమగ్రాభివృద్ధికి వివిధ శాఖల సమన్వయంతో నిరంతరం పనులు చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. మంజూరైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతోపాటు కొత్తగా అవసరమైన పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ములుగులో 15 కోట్లతో అథ్లెటిక్ స్టేడియం ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు మంత్రి తెలిపారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ఇటీవల ప్రారంభించుకున్నామని, జిల్లా ఎస్పీ కార్యాలయ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ములుగు పరిసర ప్రాంతాల్లో పర్యాటక సదుపాయాలను విస్తరించేందుకు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం పరిసరాల్లో పర్యాటకులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. మల్లూరు క్షేత్ర అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను నిర్మాణ నిపుణులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర అంచనాలు రూపొందించనున్నట్లు చెప్పారు. అవసరమైన మిగతా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. మేడారం సమ్మక్క-సారలమ్మ క్షేత్ర పరిసరాల్లో భక్తులు, స్థానికులకు మెరుగైన సేవలు అందించేందుకు 30 పడకల ఆసుపత్రి, రహదారులు--భవనాల శాఖ అతిథిగృహం, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జాతర ప్రాధాన్యం, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు, గ్రామాల్లో సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, నీటి ట్యాంకుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా, తాగునీటి వసతులు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల ధాన్యం నిల్వ సమస్య పరిష్కారానికి ప్రతి మండలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో గోదాం నిర్మించేందుకు వ్యవసాయ శాఖకు నివేదికలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రతిపాదనల పరిశీలన అనంతరం గోదాముల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. మంజూరైన పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ బానోత్ రవిచందర్, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేయూత... చేతివాటం

- గ్రామాల్లో కొందరి నాయకుల రంగప్రవేశం
- పింఛన్ల ముసుగులో భారీ వసూళ్లు
- అమాయక వృద్ధులు, వితంతువులే లక్ష్యంగా దందా



**వెంకటాపూర్ (రామప్ప), సెప్టెంబర్ 23 (జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేయూత పింఛన్ల పథకం వెంకటాపూర్ మండలంలో కొందరి నాయకులు, దళారులకు కాసులు కురిపిస్తోంది. ఒంటరి మహిళలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగ పింఛన్ల కోసం మండల వ్యాప్తంగా మొత్తం 458 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దసరా పండుగకు కొత్త పింఛన్లను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అధికారులు గ్రామస్థాయిలో పర్యటించి ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా సదురు దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు.

గ్రామాల్లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఒంటరి మహిళలు, భర్తను కోల్పోయి కుటుంబ భారాన్ని మోస్తున్న వితంతువులు, కల్లు గీత కార్మికులు, వృద్ధులు, వితంతువులు కొత్త పింఛన్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కుటుంబ అవసరాలకు ఎంతో కొంతైనా చేయూత లభిస్తుందని వారు భావిస్తున్నారు. ఇదే అదనుగా భావించి కొందరు నాయకులు గ్రామాల్లో రంగప్రవేశం చేయటంతో దరఖాస్తుదారుల అవసరాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బేరసారాలకు దిగుతున్నారు. తమ పలుకుబడితో మీకు పింఛన్ మంజూరు చేయిస్తామని నమ్మబలుకుతూ, పింఛన్ దరఖాస్తుదారుల నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి .ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా పింఛన్ వస్తే ఆ డబ్బుతోనే అప్పు తీర్చవచ్చనే కోణంలో కొందరు అప్పులు చేసి మరీ దళారులకు సొమ్ము చెల్లిస్తున్నట్టు తెలుస్తోంది. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు అయ్యేలా చూడటంతో పాటు గ్రామాల్లో పింఛన్ల పేరుతో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై అధికారులు ఎవరికి కూడా డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, నియమ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్లు అందించడం జరుగుతుందని తెలుపుతున్నారు. గ్రామాల్లో ఎవరైనా పింఛన్ ఇప్పిస్తామంటూ డబ్బులు డిమాండ్ చేసినట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాలు పని చేస్తుంటే గ్రామాల్లో మాత్రం నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పేద ప్రజలను దోచుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ పింఛన్ల పేరుతో గ్రామాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్ పై ఎంతైనా ఉంది.

# ద్విచక్ర వాహనం వెలుతురులో అంత్యక్రియలు!






- 2.లక్షలు వెచ్చించారు...లక్షణంగా వదిలేశారు
- దీన స్థితిలో కొడవటంచ వైకుంఠ ధామం
- కనీస వసతులు లేక గ్రామస్తుల అవస్తలు
- ఏపుగా పెరిగిన ముల్లతుప్పలు..చిమ్మ చీకటిలోనే అంతిమ వీడ్కోలు

**రేగొండ,సెప్టెంబర్ 23( జనం సాక్షి):** సామాన్య ప్రజలకు మరణానంతరం గౌరవప్రదమైన అంత్యక్రియలు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం లక్షలు వెచ్చించి తెలంగాణలోని అన్ని గ్రామాలకు వైకుంఠ ధామాలు నిర్మించింది.అందులో భాగంగానే మండలంలోని కొడవటంచ గ్రామ పంచాయతీ పరిధిలో కూడా రూ.12.50 లక్షల అంచనా వ్యయంతో వైకుంఠధామాన్ని పూర్తిచేశారు. ఇందులో దహన సంస్కారాల కోసం ప్రత్యేక ప్లాట్ ఫారంలు,నీటి సౌకర్యం, విద్యుత్ వసతి,విశ్రాంత గదులు,మరుగుదొడ్లు,పచ్చదనం ఉండేలా ప్రశాంతమైన వాతావరణం,అస్థికలు భద్రపరచుకోవడానికి అనుకూలమైన స్థలం ఉండేలా చూసుకోవాలి.కానీ ఇందుకు బిన్నంగా కొడవటంచ వైకుంఠ ధామం దర్శనమిస్తుంది.శ్మశానవాటిక ప్రాంగణమంతా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు,చిమ్మ చీకటి,కనీస వసతులు లేకుండా కనిపిస్తుంది.మంగళవారం జరిగిన ఓ అంత్యక్రియల్లో ద్విచక్ర వాహనం లైటింగ్ ఉపయోగించి అంత్యక్రియలు జరిపవలసి వచ్చిందని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పాలకుల నిర్లక్ష్యంతో ఆచరణ లోపించిందని వారు తెలిపారు.ఇప్పటికైనా పాలకులు,అధికారులు స్పందించి వైకుంట ధామంలో పిచ్చి మొక్కలు తొలగించి,విద్యుత్ సదుపాయం కల్పించి కనీస వసతులు సమకూర్చాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- టి.జి.ఐ.ఐ.సి. చైర్మన్, తహసీల్దార్, ఆత్మ కమిటీ చైర్మన్‌కు వినతి



**కొండాపూర్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** కొండాపూర్ మండలంలో దాదాపు పదేళ్లుగా జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తున్న అర్హులైన మీడియా ప్రతినిధులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ టి.జి.ఐ.ఐ.సి. చైర్మన్, తహసీల్దార్, ఆత్మ కమిటీ చైర్మన్‌కు మండల మీడియా మిత్రులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నామని తెలిపారు. గతంలో కొండాపూర్ మండలానికి చెందిన పలువురు మీడియా ప్రతినిధులకు తొగర్పల్లి శివారులో ఇళ్ల స్థలాలు కేటాయించిన విధంగానే, ప్రస్తుతం అర్హత కలిగిన జర్నలిస్టులకు కూడా తొగర్పల్లి గ్రామ పరిధిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు కోరారు. తమ పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ వినతిని సానుకూలంగా పరిశీలించి న్యాయం చేస్తారనే ఆశాభావాన్ని మీడియా ప్రతినిధులు వ్యక్తం చేశారు.

# అక్రమ టేకు కలపపై టాస్క్‌ఫోర్స్ కొరడా

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** విలువైన టేకు చెట్లను అనుమతులు లేకుండా నరికివేయడం, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా కలపను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి అక్రమాలకు అటవీ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. అటవీ సంపద పరిరక్షణలో భాగంగా జిల్లాలో అక్రమ కలప నరికివేత, నిల్వ, రవాణాపై నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.

### 24 బై 7 కమాండ్ కంట్రోల్ సెంటర్ సమాచారంతో వేగవంతమైన చర్య

అటవీ నేరాల నియంత్రణ, అటవీ సంపద రక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో భాగంగా జిల్లా అటవీశాఖ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలకంగా పనిచేస్తోంది. ఈ కేంద్రం 24ఐ7 గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక సిబ్బందితో నిరంతరం పనిచేస్తోంది. అంకంపాలెం బీట్‌లో అనుమతులు లేకుండా టేకు కలపను అక్రమంగా నిల్వ చేసినట్లు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా సంబంధిత టాస్క్‌ఫోర్స్ బృందానికి వెంటనే సమాచారం చేరవేశారు. సమాచారం అందిన వెంటనే టాస్క్‌ఫోర్స్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దమ్మపేట రేంజ్ అధికారులు, బీట్, సెక్షన్ అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో



క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం అందిన 24 గంటల్లోనే టాస్క్‌ఫోర్స్ బృందం అక్రమ కలప నిల్వను గుర్తించి స్వాధీనం చేసుకోవడం, అటవీ నేరాల నియంత్రణలో వేగవంతమైన సమాచార వ్యవస్థ, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయానికి నిదర్శనంగా నిలిచింది.

### అంకంపాలెం బీట్‌లో భారీగా టేకు కలప పట్టివేత

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందం దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అంకంపాలెం బీట్‌లో తనిఖీలు నిర్వహించి, ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను గుర్తించి స్వాధీనం చేసుకుంది.

అధికారులు నిర్వహించిన కొలతల్లో 57 టేకు రౌండ్ దుంగలు – 2.775 క్యూబిక్ మీటర్లు, 44 టేకు సాన్ సైజులు – 2.460 క్యూబిక్ మీటర్లు ఉన్నట్లు నిర్ధారించారు. మొత్తంగా 5.235 క్యూబిక్ మీటర్ల టేకు కలప, సుమారు రూ.7.05 లక్షల విలువైన అటవీ సంపదను స్వాధీనం చేసుకున్నారు. రైతు వద్ద కొనుగోలు చేశాను" అనడం మాత్రమే చట్టబద్ధతను కల్పించదు. కలపను నిల్వ ఉంచిన వ్యక్తిని అధికారులు విచారించగా, తాను ఈ టేకు కలపను ఒక రైతు వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు.

### తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

ఈ చర్యల్లో టాస్క్‌ఫోర్స్ బృందం శ్రీనివాస్, సెక్షన్ అధికారులు లోకనాదం , ప్రసాద లింగం, బీట్ అధికారి రాములు , దమ్మపేట ఫీ=వా శ్రీను , బీట్ అధికారులు పార్వతి, కాంతారావు, రాజారమేష్ మరియు ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో అటవీ సంపదకు నష్టం కలిగించే అక్రమ నరికివేత, కలప నిల్వ, అక్రమ రవాణాపై కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా 24ఐ7 నిఘా కొనసాగుతుందని, సమాచారం అందిన వెంటనే టాస్క్‌ఫోర్స్, రేంజ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో వేగవంతమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# నిమజ్జనానికి వెంటనే నీటిని విడుదల చేయాలి



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** వినాయక నిమజ్జనానికి వెంటనే ఎడమ కాలువకు నీటిని విడుదల చెయ్యాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి,మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాలరెడ్డిలు డిమాండ్ చేశారు. బుధవారం నాడు వేములపల్లి వద్ద సాగర్ ఎడమకాల్వలో గణేశ్ నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లను బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కాలువలో నీటి మట్టం తక్కువగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని చూసి వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలోకి దిగి అడుగు లోతు నీటిలోనే కొంతమంది వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారని, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా సరైన ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమని కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. రైతులు, ప్రజలతో పాటు భక్తుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. వేములపల్లి వద్ద గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్పడంతో తాము నమ్మామని, అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని తెలిపారు. నిమజ్జనానికి అవసరమైన స్థాయిలో నీరు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి వేములపల్లి సాగర్ ఎడమకాల్వ వద్దకు తగినంత నీరు చేరేలా అత్యవసర చర్యలు చేపట్టాలని కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, తిప్పర్తి, మర్లపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, బాపయ్య, రావుల శ్రీనివాసరెడ్డి, రాపోలు వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డితో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

- ఈ నెల 30 వరకు అవకాశం
- ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్ష-2027కు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు నిర్వహిస్తున్న అర్హత పరీక్షకు దరఖాస్తుల గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. శ్రీరామ్స్ విద్యా సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న సమగ్ర మార్గదర్శక పథకం ద్వారా అర్హులైన తెలంగాణ రాష్ట్ర అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజనుల సివిల్ సర్వీసెస్ అధ్యయన కేంద్రంలో నివాస వసతితో కూడిన ఉచిత శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎనిమిది నెలల పాటు లేదా ప్రాథమిక పరీక్ష తేదీ వరకు, ఏది ముందైతే అప్పటి వరకు శిక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ పరిధిలోని గ్రామాల్లో ఉన్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఈ అవకాశంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని బి.రాహుల్ కోరారు. సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకునేలా మండలాల వారీగా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన సూచించారు.

## పేదింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ధ్యేయం

- పుల్కల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



**పుల్కల్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు.పుల్కల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన రెండు ఇళ్ల నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు.లబ్ధిదారులు దప్పూరి హేమలత,మంగలి హంసమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత ఇల్లు నిర్మించుకోవాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు.ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నాయకులు ఎట్టి శ్రీనివాస్,వార్డు సభ్యులు మంగలి రాజు,చింత నరేందర్,మన్నె విట్టల్,చాకలి శారద,సొంగ శ్రీనివాస్,దప్పూరి బేతయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, మౌలిక వసతుల అంశాలపై ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గాల్లో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. చేర్యాల గ్రామంలో కుల సంఘాలకు సంబంధించిన స్థలాలను ఆయా సంఘాలకే కేటాయించాలని, టీజీఐఐసీ పేరుతో ఇతర అవసరాలకు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన ప్రాంతాల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవనాలను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. సైదాపూర్ తండాలో వాటర్ ట్యాంక్‌కు వెళ్లే మెట్లు దెబ్బతిన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ఇతర గ్రామాల్లోనూ ఇలాంటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. టీజీఐఐసీ భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో పారిశ్రామిక అవసరాలతో పాటు గ్రామాల కనీస మౌలిక వసతులకు అవసరమైన భూమిని



కేటాయించాలని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, ప్రహరీ గోడలు లేని ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి వాటికి ప్రహరీ గోడలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, మురుగు కాలువలు, కల్వర్టులు, అంతర్గత రహదారుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే మంజూరైనప్పటికీ పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యేలు కోరారు. ప్రజలకు అత్యవసరమైన తాగునీరు, విద్య, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతుల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గాలి వానతో మొరంపల్లి బంజరలో భీభత్సం

- గాలి వానతో రేకుల షెడ్లు, దుకాణాల బోర్డులు ధ్వంసం..
- కొంతసేపు స్తంభించిన జనజీవనం..



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులు, గాలి దుమ్ము, వర్షంతో కూడి భీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన గాలులకు గ్రామంలో పలుచోట్ల ఇళ్లపై ఏర్పాటు చేసిన రేకులు లేచిపోయాయి. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. గాలి వాన తీవ్రతకు రేకుల షెడ్లు దెబ్బతినడంతో పాటు దుకాణాల ముందు ఏర్పాటు చేసిన బోర్డులు కూలిపోయాయి. కొన్ని చోట్ల చెట్లు రహదారులపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి, కొంతసేపు జనజీవనం స్తంభించింది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అకస్మాత్తుగా బలమైన గాలులు వీయడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గాలి తీవ్రత తగ్గిన అనంతరం స్థానికుల రాకపోకలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేపట్టారు.

## పేదల సొంతింటి కలకు 'ఇందిరమ్మ' భరోసా

- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు
- మూడో విడతలో విస్తృతంగా మంజూరు
- నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి పొంగులేటి



**భద్రాచలం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బుధవారం భద్రాచలం అంబ సత్రం మార్గంలోని కాలనీలో లబ్ధిదారు మామిడి మౌనిక నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించి వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభించిన తుమ్మల, పొంగులేటి

- సుమారు రూ.610 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం
- సీతారామ ప్రాజెక్టుతో పది నియోజకవర్గాల్లో సాగునీరు
- మంత్రి తుమ్మల
- తొలి విడతలో 4,300 ఎకరాలకు సాగునీరు
- మంత్రి పొంగులేటి

**మణుగూరు సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** పినపాక నియోజకవర్గ రైతుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ అశ్వాపురం మండలం మారేళ్లపాడులో ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రారంభించారు.మరెళ్లపాడు పథకం పంపులను ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేసిన మంత్రులు అనంతరం పథకాన్ని జాతికి అంకితం చేశారు. సుమారు రూ.610 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు.అనంతరం గొందిగూడెం లో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న అశ్వాపురం ప్రాంత రైతుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యం లో సీతారామచంద్రస్వామి ఆశీస్సులతో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక ప్రాంతం నుంచి గోదావరి జలాలను పాలేరు వరకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ కారణాలతో నిలిచిపోయిన పనులను ఆర్థిక ఇబ్బందులు, అనుమతులు, సవరించిన అంచనాలు తదితర సమస్యలను అధిగమిస్తూ ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

### పది నియోజకవర్గాలు సస్యశ్యామలం

సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు వంటి ప్రాజెక్టులతో అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. పినపాక నియోజకవర్గం పులుసు బొంత కు అటవీ అనుమతులు, ప్రత్యామ్నాయ భూముల గుర్తింపు వంటి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతల పథకం అలాగే అన్నదైవం ప్రాజెక్టుకు కూడా గోదావరి జలాలను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సాధ్యమైన ప్రాంతాల్లో చిన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను ఏర్పాటు చేసి గోదావరి జలాలను నిల్వ చేయాలని సూచించారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో పనులు చేపడుతున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. మారేళ్లపాడు



ఎత్తిపోతల పథకం ద్వారా అశ్వాపురం మండలంలోని సుమారు 24 గ్రామాలతో పాటు ఇతర మండలాలకు కూడా సాగునీరు అందించి రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభంతో అశ్వాపురం, పినపాక ప్రాంత రైతుల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరుకోవడం రైతులకు పండుగ వాతావరణాన్ని కల్పించిందన్నారు.

### అన్ని మండలాలకు సాగునీరు

ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు,జిల్లా అటవీ అధికారి సిధార్ధ్ విక్రమ్ సింగ్ , భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ , నీటిపారుదల శాఖ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




## గూగుల్‌పై రూ.4,400 కోట్ల జరిమానా

### ఈయూ గోప్యతా నిబంధనల ఉల్లంఘన నేపథ్యం

**డబ్లిన్:** వినియోగదార్ల లొకేషన్ డేటాను తప్పుగా నిర్వహించడం ద్వారా ఐరోపా కూటమి నిర్దేశించిన గోప్యతా నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను గూగుల్‌కు 403 మిలియన్ యూరోల (దాదాపు రూ.4,400 కోట్లు) జరిమానా విధించినట్లు ఐర్లాండ్ డేటా ప్రొటెక్షన్ కమిషన్ తెలిపింది. వినియోగదార్ల బ్రౌజింగ్, సెర్చ్ హిస్టరీని ట్రాక్ చేసే గూగుల్ సెట్టింగ్ అయిన 'వెబ్ అండ్ యాప్ యాక్టివిటీ'లోనూ, మొబైల్ ఫోన్‌లతో సందర్శించిన ప్రదేశాలను మ్యాప్ చేసే లొకేషన్ హిస్టరీలోనూ గూగుల్ లొకేషన్ డేటాను చట్టబద్ధంగా ప్రాసెస్ చేయలేదని తమ దర్యాప్తులో తేలిందని పేర్కొంది. ఆండ్రాయిడ్ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్‌లోని 'లొకేషన్ అక్యూరసీ' ఫీచర్‌లో వ్యక్తిగత డేటాను ప్రాసెస్ చేసినప్పుడు కూడా ఆ సంస్థ చట్టబద్ధంగా, పారదర్శకంగా వ్యవహరించడంలో విఫలమైందని తెలిపింది. అమెరికా సాంకేతిక దిగ్గజమైన గూగుల్‌కు 27 దేశాల ఐరోపా కూటమిలో ఐర్లాండ్ ప్రధాన నియంత్రణ సంస్థగా ఉంది. ఆ సంస్థకు ఐరోపాలో ప్రధాన కార్యాలయం డబ్లిన్‌లో ఉండటమే ఇందుకు కారణం. ఆరేళ్ల క్రితం ఈ దర్యాప్తు ప్రారంభమైంది. జనరల్ డేటా ప్రొటెక్షన్‌గా వ్యవహరించే ఈయూ గోప్యతా నియమావళిని 2018లో అమల్లోకి వచ్చినప్పటి నుంచి 2020 ఫిబ్రవరి వరకు గూగుల్ ఎలా వర్తింపజేసిందో ఇందులో పరిశీలించారు. 'ఈ కేసు అప్పటి నుంచి నవీకరించిన పాత విధానాల చుట్టూ కేంద్రీకృతమై ఉంది' అని గూగుల్ ఒక ప్రకటనలో తెలిపింది. గోప్యతా నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఐర్లాండ్ నియంత్రణ సంస్థ విధించిన నాలుగో అత్యధిక జరిమానా ఇది. గతంలో టిక్‌టాక్, మెటాలకు ఇంతకంటే భారీ జరిమానాలు విధించింది.

# 100 డాలర్ల దిగువకు క్రూడ్..

## లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి ఐరాస 81వ సర్వ ప్రతినిధి సభ సమావేశం సందర్భంగా అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగడం, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. మెటల్, రియాల్టీ, ఎఫ్ఎంసీజీ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,648.32 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,529.08) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 74,973.74 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 299.17 పాయింట్లు లాభపడి 74,828.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 117.80 పాయింట్లు పెరిగి 23,446.80 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.74గా ఉంది. సెన్సెక్స్ 30లో టాటాస్టీల్, బజాజ్‌ఫైనాన్స్, ఐటీసీ, అల్ట్రాటెక్‌సిమెంట్, పవర్ గ్రిడ్, ఎల్‌అండ్‌టీ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 99.06 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,316.53 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అంతకుముందు సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ.. మంగళవారం దేశీయ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఫైనాన్స్, యంత్ర పరికరాల షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 16 పైసలు పెరిగి 95.62 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.67% నష్టంతో 98.66 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు అదే ధోరణిలో ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.29 లక్షల కోట్లు తగ్గి రూ.480.29 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 42 పాయింట్ల లాభం (క్రితం ముగింపు 74,858.99 పాయింట్లు)తో 74,901.50 వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో 75,038.93 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ, అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో 74,423.71 వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసి, చివరకు 329.91 పాయింట్ల నష్టంతో 74,529.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 85.30 పాయింట్లు కోల్పోయి 23,329 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,285.75- 23,489 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టపోయాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ 1.62%, ట్రెంట్ 1.47%, బజాజ్ ఫైనాన్స్ 1.46%, సన్‌ఫార్మా 1.28%, టీసీఎస్ 1.13%, అల్ట్రాటెక్ 1%, ఎస్‌బీఐ 0.99% డీలాపడ్డాయి. ఎటర్నల్ 1.94%, ఇండిగో 1.58%, టైటన్ 0.72%, టాటా స్టీల్ 0.60% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. హౌసింగ్ ఫైనాన్స్ 1.03%, ఫోకస్డ్ ఐటీ 1.01%, యంత్ర పరికరాలు 0.87%, ఐటీ 0.79%, ఎఫ్ఎమ్‌సీజీ 0.68% తగ్గాయి. టెలికాం, స్థిరాస్తి, సేవలు, వినియోగ మెరిశాయి. బీఎస్ఈలో 2279 షేర్లు నష్టపోగా, 2087 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 227 షేర్లలో ఎటువంటి మార్పులేదు. బ్రిటన్‌కు చెందిన ఎం గ్రూప్ నుంచి కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఐటీ కాంట్రాక్టును హెచ్‌సీఎల్ టెక్ దక్కించుకుంది. ఇందులో భాగంగా బ్రిటన్, ఐర్లాండ్‌లలో 200కి పైగా ప్రాంతాల్లో ఉన్న ఎం గ్రూప్ ఐటీ మౌలిక సదుపాయాలు, ఎండ్ యూజర్ కార్యకలాపాలను హెచ్‌సీఎల్ టెక్ నవీకరించనుంది.

ఐపీఓ సమాచారం

జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్ ఐపీఓ సెప్టెంబరు 25న ప్రారంభమై 29న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.132-139 నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.304 కోట్లు సమీకరించనుంది. రున్వాల్ ఎంటర్‌ప్రైజెస్ రూ.500 కోట్ల ఐపీఓ 25న ప్రారంభమై 29న ముగియనుంది. ధరల శ్రేణిగా రూ.290-305 నిర్ణయించారు. ఓరియెంట్ కేబుల్స్ రూ.552 కోట్ల ఐపీఓ 25న ప్రారంభమై 29న ముగుస్తుంది. ఒక్కో షేరుకు ధరల శ్రేణిగా రూ.258-272 ప్రకటించారు. సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు ఉన్న ఏస్‌వెక్టర్ ఐపీఓ 25న ప్రారంభమై 29న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణి రూ.30-32. గరిష్ఠ ధర వద్ద కంపెనీ రూ.420 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ఎస్‌డీ ఇంటర్నేషనల్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఐపీఓ ద్వారా రూ.200 కోట్లు సమీకరించాలని ఐరిస్ గ్లోబల్ సర్వీసెస్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది.

**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.40 | వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹ 1,62,254 (22 క్యారెట్లు) | ₹ 1,77,008 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,50,000

## లిస్టింగ్‌లో అదరగొట్టిన ఎస్ఎస్ రిటెయిల్స్.. 51% ప్రీమియంతో ఎంట్రీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎస్ఎస్ రిటెయిల్ లిమిటెడ్ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అదరగొట్టింది. మదుపర్లకు లాభాలను అందించింది. ఇష్యూ ధర రూ.424తో పోలిస్తే.. దాదాపు 51 శాతం ప్రీమియంతో కంపెనీ షేర్లు లిస్టయ్యాయి. కంపెనీ షేర్లు ఇష్యూ ధరతో పోలిస్తే.. బీఎస్ఈలో 50.73 శాతం ప్రీమియంతో రూ.639.10 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. ఎన్ఎస్ఈలోనూ 47.16 శాతం ప్రీమియంతో రూ.624 వద్ద లిస్టయ్యాయి. లిస్టింగ్ తర్వాత కూడా షేర్లు రాణించాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 53.60 శాతం లాభంతో రూ.692.70 వద్ద ట్రేడవుతున్నాయి. ఈ కంపెనీ ఐపీఓ సెప్టెంబర్ 16న ప్రారంభమై.. 18న ముగిసింది. ఈ ఐపీఓకు మదుపర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. పబ్లిక్ ఇష్యూ చివరి నాటికి 103.30 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదు చేసింది.

**లిస్టింగ్ తర్వాత కోలుకున్న హీరో మోటార్ షేర్లు**

ఆటో విడిభాగాల తయారీ కంపెనీ హీరో మోటార్స్ షేర్లు కూడా బుధవారం స్టాక్ మార్కెట్‌లో ఎంట్రీ ఇచ్చాయి. మొదట కంపెనీ షేర్లు నిరాశపరిచినా.. ఆ తర్వాత కోలుకున్నాయి. ఇష్యూ ధర రూ.84 కాగా, 2 శాతానికి పైగా నష్టంతో కంపెనీ షేర్లు లిస్టయ్యాయి. బీఎస్ఈలో 2.26 శాతం నష్టంతో రూ.82.10 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. ఎన్ఎస్ఈలోనూ 2.38 శాతం నష్టంతో రూ.82 వద్ద ప్రారంభమయ్యాయి. లిస్టింగ్ తర్వాత కంపెనీ షేర్లు కోలుకున్నాయి. 17 శాతం లాభంతో రూ.98.51 వద్ద ట్రేడయ్యాయి. సెప్టెంబర్ 16-18 మధ్య వచ్చిన ఈ ఐపీఓకు మోస్తరు స్పందన లభించింది. పబ్లిక్ ఇష్యూ చివరి నాటికి 6.66 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది.

31% ప్రీమియంతో జిందాల్ సుప్రీం అరంగేట్రం

ప్లాస్టిక్ పైపింగ్ సొల్యూషన్లు, సంబంధిత ఉత్పత్తులు తయారుచేసే జిందాల్ సుప్రీం (ఇండియా) (ఏతినిటజీశ్రీ రాబీజూతీవఎవ) షేర్లు కూడా మదుపర్లకు లాభాలు తెచ్చిపెట్టాయి. ఇష్యూ ధర రూ.93తో పోలిస్తే 31 శాతం ప్రీమియంతో స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయ్యాయి. బీఎస్ఈలో 31 శాతం ప్రీమియంతో రూ.121.90 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఎన్ఎస్ఈలో 29 శాతం ప్రీమియంతో రూ.120 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి. మధ్యాహ్నం 1 గంట సమయంలో బీఎస్ఈలో కంపెనీ షేర్లు రూ.127.99 వద్ద ట్రేడవుతున్నాయి. ఈ కంపెనీ ఐపీఓ కూడా అదరగొట్టింది. ఐపీఓ చివరి నాటికి 181.07 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. భారత్‌ను ఇప్పటికీ పెట్టుబడులకు అనుకూలమైన దేశంగానే ప్రపంచ స్థాయి ఇన్వెస్టర్లు చూస్తున్నారని జేపీ మోర్గాన్ ఛేస్ సీఈవో జేమీ డిమోన్ వెల్లడించారు. ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో చాలా మంది ఇన్వెస్టర్లు భారత్‌ను సానుకూల దృక్పథంతో చూస్తున్నారు. కాకపోతే పన్నుల వర్తింపు విషయంలో స్థిరత్వం లేకపోవడమే వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఈ విషయంలో నా వద్దకు చాలా సంస్థలు ఈ విషయాన్ని తీసుకొచ్చాయి. ఊహించిన స్థాయి కంటే అధికంగా పన్నులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నాయి" అని వెల్లడించారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ప్రభుత్వ దీర్ఘకాలిక బాండ్లపై సంపాదించే లాభాలు, ఆదాయంపై పన్ను మినహాయింపును ఇచ్చిందని డిమోన్ వెల్లడించారు. దీంతోపాటు ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులు దీర్ఘకాలిక బాండ్లలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించిందన్నారు. రూపాయి విలువ మరింత పతనం కాకుండా ఈ నిర్ణయం తీసుకొందన్నారు. వాస్తవానికి ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం దాదాపు రెండు నెలలపాటు తీవ్ర స్థాయిలో అంతర్గత చర్చలు జరిపిందని వెల్లడించారు. అంతేకాదు.. భారత్‌లో పోటీపడటానికి విదేశీ కంపెనీలను ఈ మార్కెట్‌లో ఓ పట్టాన అనుమతించరన్నారు. ఫలితంగా భారత్ తక్కువ మొత్తంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని వెల్లడించారు. మార్కెట్లో పోటీ తత్వం భారత్‌కు మంచే చేస్తుందన్నారు.

# ఏఐకి బ్రేకులు అసాధ్యం..

## శ్రీధర్ వెంబు కీలక వ్యాఖ్యలు



చెన్నై: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విపత్కర పరిణామాలకు దారితీస్తుందన్న అంచనాలను జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తోసిపుచ్చారు. అదంతా అతిశయోక్తేనని కొట్టిపారేశారు. అలాగే, ఏఐని స్లో డౌన్ చేయాలన్న పిలుపుపైనా స్పందించారు. ఏఐ అభివృద్ధి విషయంలో విరామం అంటూ వచ్చే అవకాశం లేదన్నారు. భారత్ ఏఐ సహా అన్ని రంగాల్లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ఏఐ విషయంలో భారత్ స్వతంత్ర వైఖరితో వ్యవహరించాలని శ్రీధర్ వెంబు సూచించారు. సాంకేతిక రంగంలో అమెరికా, చైనా మధ్య నెలకొన్న పోటీలో నలిగిపోకుండా.. ఏఐ అభివృద్ధిలో భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఎవరితోనూ శత్రుత్వం లేకుండా అందరినీ కలుపుకొని పోవాలన్నారు. మన అవకాశాలను ఎప్పుడూ తెరిచే ఉంచాలన్నారు. ఆర్‌అండ్‌డీ విషయంలో పెట్టుబడులు అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ప్రాథమిక ఆర్‌అండ్‌డీకి, ఏఐ మోడళ్ల అభివృద్ధికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. అన్ని రంగాల్లో ప్రాథమిక ఆర్‌అండ్‌డీపై పెట్టుబడులు రావాలన్నారు.

**మానవాళిని తుడిచిపెట్టదు**

ఏదో ఒకరోజు ఏఐ మానవాళిని తుడిచిపెట్టేస్తుందనే అంచనాలను ఎప్పటికీ అంగీకరించబోనని శ్రీధర్ వెంబు అన్నారు. ఏఐ సామర్థ్యం పెరుగుతుండడం వల్ల కలిగే ప్రమాదాలపై నెలకొన్న ఆందోళనలను మాత్రం తాను కొంతవరకు అంగీకరిస్తానని పేర్కొన్నారు. ఏఐ టూల్స్‌పై ప్రజలు అధికంగా ఆధారపడడం వల్ల విచక్షణ, నైపుణ్యాలు ఎక్కడ తుడిచిపెట్టుకుపోతాయోనన్న ఆందోళనను వ్యక్తంచేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ అభివృద్ధిని నిలిపివేయాలన్న పిలుపుపైనా స్పందించారు. అది ఏమాత్రం సాధ్యం కాదన్నారు. ఏఐ అభివృద్ధిలో కంపెనీలు నిత్యం పోటీ పడుతుంటాయని చెప్పారు. పోటీదారులు ఈ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నప్పుడు, ప్రధాన ఏఐ ప్రయోగశాలలు అభివృద్ధిని ఆపేందుకు సాహసించబోవన్నారు. నేర్చుకునే దశలో ఏఐపై ఆధారపడడం వల్ల భవిష్యత్‌లో నైపుణ్యం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే శక్తిని కోల్పోతామని శ్రీధర్ వెంబు అన్నారు. ఏఐ సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ఉద్యోగాలు మరింత ఒత్తిడి ఎదుర్కొంటాయని పేర్కొన్నారు.

## స్మార్ట్‌ఫోన్లకు భద్రమైన టెంపర్డ్‌గ్లాస్

### ప్రత్యేక ప్రమాణాలను నిర్దేశించిన కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖ



**దిల్లీ:** స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్‌లకు రక్షణ కల్పించే టెంపర్డ్ గ్లాస్‌లకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రమాణాలు నిర్దేశించింది. 2027 ఏప్రిల్ 1 నుంచి ఇవి ఐఎస్ 19348:2025 ప్రకారమే ఉండాలని స్పష్టం చేస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 'ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గూడ్స్ (రిక్వయిర్‌మెంట్ ఆఫ్ కంపల్సరీ రిజిస్ట్రేషన్) ఆర్డర్ 2021లో ఈమేరకు సవరణలు చేసినట్లు పేర్కొంది. ఈ కొత్త ప్రమాణాలు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. ఈ నిబంధనల కింద నోటిఫై చేసిన 66వ ఐటెం ఇది. జాబితాలో స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్-ల్యాప్‌టాప్ ఛార్జర్లు, ఎల్ఈడీ టీవీలు, మైక్రోఓవెన్స్, ప్రింటర్లు, సెట్‌టాప్ బాక్స్‌లు తదితరాలున్నాయి.

## సమ్మె ఎఫెక్ట్.. ఆదివారం తెరుచుకోనున్న బ్యాంకులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బ్యాంకు యూనియన్ల సమ్మె నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు సమ్మె తలపెట్టిన నేపథ్యంలో ఆదివారం బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించాలని కేంద్ర ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంక్ నిర్ణయించాయి. దీంతో ఈ నెల 27న బ్యాంకు శాఖలు తెరుచుకోనున్నాయి. సమ్మె నేపథ్యంలో బ్యాంకు వినియోగదారులకు, కస్టమర్లకు ఇబ్బందులు రాకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది. సాధారణంగా నాలుగో శనివారం, ఆదివారం బ్యాంకులు పనిచేయవు. 28 నుంచి (సోమ, మంగళ, బుధ) మూడు రోజుల సమ్మె నేపథ్యంలో మొత్తంగా ఐదు రోజుల పాటు బ్యాంకు సేవలకు విఘాతం కలగనుంది. ఈ క్రమంలో ఆదివారం బ్యాంకులు తెరిచేలా నిర్ణయం తీసుకున్నట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఆర్‌బీఐ కూడా అందుకు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. దీంతో ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఆదివారం పనిచేయనున్నాయని ఆర్థిక శాఖ తెలిపింది. వారంలో అయిదు రోజుల పనిదినాల విధానం అమలు చేయాలనే ఒప్పందాన్ని ఆమోదించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. 2024 మార్చిలో కుదిరిన ఒప్పందం ప్రకారం వారానికి అయిదు రోజులే పని చేసి, రోజుకు 40 నిమిషాలు అదనంగా పనిచేసేందుకు సిద్ధపడినా ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. దీంతోపాటు స్కేల్-4, ఆపై అధికారులకే ప్రత్యేకంగా పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. సమ్మె ప్రభావం దృష్ట్యా ఎస్‌బీఐ సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ వినియోగదారులకు సూచనలు జారీ చేశాయి. శాఖల్లో నేరుగా చేసే పనులకు ఆటంకం కలిగినా డిజిటల్ సర్వీసులు యథాతథంగా అందుబాటులో ఉంటాయని తమ ప్రకటనల్లో స్పష్టం చేశాయి. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ యాప్‌లు, ఏటీఎం ద్వారా చేసే డిజిటల్ బదిలీలు కొనసాగుతాయి. బిల్లుల చెల్లింపులు, చిన్న మొత్తం బదిలీలకు వినియోగదారులు డిజిటల్ మార్గాలనే ఎంచుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి.

## 4 ఏళ్ల గరిష్ఠానికి దేశీయ ఉక్కు ధరలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ముడిసరుకుల ధరలు భగ్గుమనడం, వర్షాకాలం ముగిసిన తర్వాత నిర్మాణ రంగ డిమాండ్ పుంజుకోవడంతో దేశీయంగా ఉక్కు ధరలు నాలుగేళ్ల గరిష్ఠానికి చేరాయని మార్కెట్ పరిశోధనా సంస్థ బిగ్‌మింగ్ తెలిపింది. 2022 జూన్ తర్వాత ధరలు ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఆగస్టు 1 నుంచి ఇప్పటివరకు టన్ను హెచ్‌ఆర్‌సీ రూ.6,000 పెరిగి రూ.64,000కు, సీఆర్‌సీపై రూ.8,500 పెరిగి రూ.75,000కు చేరాయి. కోకింగ్ కోల్ ధర టన్నుకు 65 డాలర్లకు పెరిగి 305 డాలర్లకు వెళ్లింది. ఇనుప ఖనిజం ధర కూడా టన్నుకు రూ.4,500కు పెరిగింది. సీఎంఎఫ్ మొబైల్ ఫోన్లు, విడిభాగాల అమ్మకాలు, వాణిజ్యీకరణ కోసం నథింగ్‌తో ఏర్పాటు చేయనున్న కొత్త సంయుక్త సంస్థ(జేవీ)లో 51.1% మెజారిటీ వాటాను కొనుగోలు చేయడానికి ఆప్టిమస్ ఇన్‌ఫ్రాకామ్ బోర్డు ఆమోదం తెలిపింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సెంట్రల్ బ్యాంక్ నుంచి రెండు కీలక ఆపరేటింగ్ లైసెన్సులకు సూత్రప్రాయ ఆమోదం పొందినట్లు ఫోన్‌పే ప్రకటించింది. బ్యాంకింగ్ వ్యవస్థలో పెరిగిన నగదు లభ్యతను నియంత్రించేందుకు మంగళవారం నిర్వహించిన ఓవర్‌నైట్ వేరియబుల్ రేట్ రివర్స్ రెపో (వీఆర్‌ఆర్‌ఆర్) వేలం ద్వారా బ్యాంకుల నుంచి రూ.71,971 కోట్ల నగదును ఆర్‌బీఐ వెనక్కి తీసుకుంది. నోటిఫై చేసిన రూ.75,000 కోట్లకు గాను వచ్చిన బిడ్లన్నింటినీ 5.24% కటాఫ్ రేటు వద్ద ఆమోదించింది. జర్మనీ డిజిటల్ ఇంజినీరింగ్ సంస్థ నగారో ఎస్ఈలో అదనంగా 61.15 శాతం వాటాను ఐటీ సేవల కంపెనీ పర్సిస్టెంట్ సిస్టమ్స్ మంగళవారం కొనుగోలు చేసింది. ఇది వరకే 22.10 శాతం వాటాను సొంతం చేసుకున్నందున మొత్తం వాటా 83.25 శాతానికి చేరింది.



# 5 రోజులు బ్యాంకింగ్ సేవలు ఉండవా?

### సెప్టెంబరు 28-30 వరకూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపు



హైదరాబాద్: బ్యాంకింగ్ సమాఖ్యల ఐక్య వేదిక (యూఎఫ్‌బీయూ) సెప్టెంబరు 28 నుంచి 30 వరకూ మూడు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ రంగంలోని బ్యాంకింగ్ సేవలు తీవ్రంగా దెబ్బతినే సూచనలు కనిపిస్తున్నాయి. సమ్మెకు ముందే సెప్టెంబరు 26న నాలుగో శనివారం, 27న ఆదివారం కావడంతో వరుసగా 5 రోజుల పాటు బ్యాంకు శాఖల్లో కార్యకలాపాలు స్తంభించిపోనున్నాయి. సెప్టెంబరు 30 అర్ధవార్షిక ముగింపు రోజు కావడం సమస్య తీవ్రతను మరింత పెంచుతోంది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) బ్యాంకుల యాజమాన్యాలతో అత్యవసర సమీక్ష జరిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఉన్నతాధికారులు, భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ), నాబార్డ్ ప్రతినిధులతో ఆర్థిక శాఖ అధికారులు సమ్మె కాలంలో సన్నాహాలపై చర్చించారు. శాఖలు మూతపడినా ఏటీఎంలు, ఆటోమేటెడ్ డిపాజిట్ యంత్రాల్లో సొమ్ము ఖాళీ కాకుండా నిరంతరం భర్తీ చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) కేంద్రాలు, కస్టమర్ సర్వీస్ పాయింట్లలో (సీఎస్‌పీ) తగినంత నగదు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ మార్గాల ద్వారా లావాదేవీలు అంతరాయం లేకుండా సాగేలా చూడాలని సూచించారు. వారంలో అయిదు రోజుల పనిదినాల విధానం అమలు చేయాలనే ఒప్పందాన్ని ఆమోదించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. 2024 మార్చిలో కుదిరిన ఒప్పందం ప్రకారం వారానికి అయిదు రోజులే పని చేసి, రోజుకు 40 నిమిషాలు అదనంగా పనిచేసేందుకు సిద్ధపడినా ప్రభుత్వం నుంచి ఆమోదం రాలేదు. దీంతోపాటు స్కేల్-4, ఆపై అధికారులకే ప్రత్యేకంగా పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. స్కేల్-4, ఆపై స్థాయి అధికారులకే ప్రత్యేక పీఎల్ఐ వర్తింపజేయడం వల్ల ఉద్యోగుల మధ్య వ్యత్యాసాలు పెరుగుతాయని యూనియన్లు వాదిస్తున్నాయి. మొత్తం బ్యాంకు ప్రతిభ ఆధారంగా స్కేల్-6 వరకూ అందరికీ సమానంగా పీఎల్ఐ అందించే పాత విధానాన్నే కొనసాగించాలని కోరుతున్నాయి. యూనియన్ల నిరసనలతో ఈ పథకాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. సమ్మెను నివారించేందుకు కేంద్ర చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మిక సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోతే.. అక్టోబరు 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని యూఎఫ్‌బీయూ స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 90 శాతానికి పైగా ఉద్యోగులకు ఇది ప్రాతినిధ్యం వహిస్తోంది. సమ్మె ప్రభావం దృష్ట్యా ఎస్‌బీఐ సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ వినియోగదారులకు సూచనలు జారీ చేశాయి. సెప్టెంబరు 30 ఆర్థిక సంవత్సరం అర్ధవార్షిక ముగింపు కావడంతో కంపెనీలు, చిన్న తరహా వ్యాపారులు, పన్ను చెల్లింపుదారులు తమ ఖాతాలను ఈ తేదీనే పూర్తి చేస్తారు. శాఖలు మూతపడటం వల్ల చెక్కుల జమ, క్లియరింగ్, డ్రాఫ్ట్‌లు, పెద్ద మొత్తంలో నగదు ఉపసంహరణలు నిలిచిపోతాయి. వ్యాపార లావాదేవీలు ఆగిపోకుండా ఉండేందుకు ఖాతాదారులు తమ అత్యవసర పనులను సెప్టెంబరు 25 (శుక్రవారం) నాడే శాఖలకు వెళ్లి పూర్తి చేసుకోవాలని బ్యాంకులు కోరుతున్నాయి.

## ఇక విమానాశ్రయాల నిర్మాణం 18 నెలల్లో పూర్తి

### రామ్మోహన్ నాయుడు

దిల్లీ: ఉడాన్ పథకం కింద వచ్చే పదేళ్లలో దేశవ్యాప్తంగా 100 విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. గతంలో ఒక్కో ఎయిర్‌పోర్టుకు సగటున 3 ఏళ్ల సమయం పడితే ఈసారి 18 నెలల్లోపే ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆయన మంగళవారం ఇక్కడ ఉడాన్ నూతన దశ అమలుపై 21 రాష్ట్రాలతో ఎంఓయూ కుదుర్చుకున్న సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. 'ఉడాన్ తదుపరి దశను వేగవంతంగా అమలుచేయడం కోసం 21 రాష్ట్రాలతో ఎంఓయూ కుదుర్చుకున్నాం. సామాన్య ప్రజలకు చౌకధరల్లో విమానయాన సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఉడాన్ పథకాన్ని ఇప్పుడు మరో పదేళ్లు పొడిగిస్తున్నాం. ఇప్పుడు దేశవ్యాప్తంగా మరో 100 విమానాశ్రయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అన్నింటినీ ఒకే సమయంలో చేపట్టడానికి బదులు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను బట్టి ప్రాధాన్యతాక్రమంలో నిర్మాణ పనులు చేపడతాం. దేశవ్యాప్తంగా 200 హెలీపోర్టులు కూడా నిర్మిస్తాం' అని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు స్పైస్‌జెట్ కార్యకలాపాల, ఆర్థిక అంశాలను డీజీసీఏ పరిశీలిస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల ఈ కంపెనీలో విమాన ఆలస్యాల, కార్యకలాపాల సమస్యలు వచ్చిన సంగతి తెలిసిందే. కాగా, ప్రైవేటు విమానాశ్రయ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవడానికి తమ శాఖకు పరిమితులుంటాయని ఆయన స్పష్టం చేశారు. రాబోయే పండగల సీజనులో విమాన ఛార్జీలపై పరిమితులేమీ పెట్టలేదు కానీ, ధరలు సహేతుకంగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించినట్లు ఆయన తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
24 సెప్టెంబర్ 2026

# ఓసీపీ-3లో నూతన వీల్ లోడర్ ప్రారంభం

- అందుబాటులోకిరూ.5.08 కోట్ల విలువైన ఆధునిక పరికరం
- భద్రతాప్రమాణాలతో సమర్థవంతంగా వినియోగించుకోవాలి: జీఎం లక్ష్మీపతిగౌడ్



**యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** అర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో నూతనంగా సమకూర్చిన కోమట్స్ WA600-6R వీల్ లోడర్‌ను ఏరియా జనరల్ మేనేజర్ తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ ఆధునిక వీల్ లోడర్‌కు 6.4 క్యూబిక్ మీటర్ల బకెట్ సామర్థ్యం ఉండగా, దీని ప్రాథమిక విలువ రూ.5.08 కోట్లుగా ఉంది. ఈ సందర్భంగా జీఎం లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకుని తొలుత ఓసీపీ-5 కోసం కేటాయించిన వీల్ లోడర్‌ను ఓసీపీ-3 ప్రాజెక్టుకు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన పరికరాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రాజెక్టు కార్యకలాపాలకు మరింత తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. ఓసీపీ-3లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆధునిక పరికరాన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, సమర్థవంతంగా వినియోగించుకోవాలని జీఎం సూచించారు. పరికరాల వినియోగంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాలోత్ రాముడు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ గంధం సాంబశివరావు, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ పెద్ది నరసింహులు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్, ఏజీఎం చంద్రశేఖర్, ఓసీపీ-3 ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉదయ్ హరిజన్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ బి.వి. సత్యనారాయణ, ప్రాజెక్ట్ మేనేజర్ సంపత్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రాజశేఖర్, సేఫ్టీ ఆఫీసర్ లింగబాబు, పిట్ సెక్రటరీలు మహేందర్, కుమారస్వామి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ షేక్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# 55వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు ప్రారంభం

రెండు రోజుల పాటు 10 రెస్క్యూ జట్ల మధ్య పోటీ




**8 ఇంక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** అర్జీ-2 ఏరియాలోని ఎయిట్ ఇంక్లైన్ కాలనీ మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో 55వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 10 రెస్క్యూ జట్లు వివిధ విభాగాల్లో తమ నైపుణ్యాలను ప్రదర్శించనున్నాయి. సింగరేణి డైరెక్టర్ (పీపీ) జె. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.
గనుల్లో ప్రమాదాల సమయంలో రెస్క్యూ సేవలు కీలకమని అధికారులు తెలిపారు. సిబ్బంది అప్రమత్తత, ధైర్యం, క్రమశిక్షణ, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేగంగా స్పందించేందుకు శారీరక, మానసిక దృఢత్వంతో పాటు సరైన నిర్ణయ సామర్థ్యం అవసరమన్నారు. రెస్క్యూ పోటీలు సిబ్బందిలో టీమ్‌వర్క్, సాంకేతిక నైపుణ్యాలు, పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. సింగరేణిలో 21 భూగర్భ, 17 ఓపెన్‌కాస్ట్ గనులు ఉన్నాయని, రెస్క్యూ సిబ్బంది ఖాళీ సమయంలో ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ జూ-జా సాధన కొనసాగించాలని సూచించారు. సింగరేణి రెస్క్యూ వ్యవస్థకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని అధికారులు తెలిపారు. సంస్థలోని 534 మంది బ్రిగేడియర్లలో 34 మంది మహిళలు ఉండగా, పోటీల్లో రెండు మహిళా రెస్క్యూ జట్లు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐమీా అధికారులు, సింగరేణి GMలు, రెస్క్యూ అధికారులు, వైద్య సిబ్బంది, యూనియన్ నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హైనా దాడిలో లేగదూడ మృతి

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారి సమీనా
- బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలన్న సర్పంచ్ సన్నీళ్ల కవిత వెంకటేశం

**చిగురుమామిడి సెప్టెంబర్ 23(జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మొలుగురి రవీందర్ అనే రైతు తన వ్యవసాయ క్షేత్రం వద్ద గల షెడ్డులో కట్టేసిన లేగదూడపై బుధవారం తెల్లవారుజామున హైనా దాడి చేసి హతమార్చిందని బాధిత రైతు రవీందర్ రోధిస్తూ తెలిపారు. రోజువారీలాగే వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో లేగదూడను కట్టేసి తెల్లవారు జామున వచ్చి చూసేసరికి హైనా దూడను హతమార్చి అక్కడి నుండి పరారవుతూ కనిపించిందని విలపించారు. కళ్లముందే ఏడాదిన్నర వయసున్న లేగదూడ ప్రాణాలు కోల్పోవడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరుగా రోధించారు. మృతి చెందిన లేగదూడ విలువ సుమారు 20వేల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఘటనపై రైతు వెంటనే అటవీ శాఖ అధికారులకు, పశువైద్యాధికారికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సమీనా వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, పరిసరాలను, పాదముద్రలను పరిశీలించారు. నష్టపోయిన రైతు రవీందర్ ను ఆమె ఓదార్చి ధైర్యం చెప్పారు. విషయం తెలుసుకున్న గాగిరెడ్డిపల్లె సర్పంచ్ సన్నీళ్ల కవిత వెంకటేశం బాధిత రైతు రవీందర్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత మాట్లాడుతూ హైనా దాడిలో లేగదూడను కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన రైతును ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. బాధితుడికి ప్రభుత్వం నుండి తగిన నష్టపరిహారం అందేలా తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ భరోసా ఇచ్చారు. తమను ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు రవీందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మహిళ కూలీలపై పిడుగుపాటు

వరి కలుపు తీస్తుండగా పిడుగు పడి ఒకరు మృతి.. మరో ఇద్దరి పరిస్థితి విషమం



**పెబ్బేరు సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** వ్యవసాయ పనులు చేస్తున్న మహిళలపై పిడుగు పడి ఒకరు మృతిచెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూగూరు గ్రామానికి చెందిన కుమ్మరి సువర్ణ భర్త ఎల్ల స్వామి కౌలుదారులు సాగుచేసిన వరి పొలంలో కుమ్మరి లక్ష్మి 38 సంవత్సరాలు, చాకలి అనురాధ తో కలిసి వరి పొలంలో కలుపు తీస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వచ్చిన ఉరుములతో కూడిన భారీ వర్షం వచ్చింది. వర్షాలు రాక ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఒక్కసారిగా భారీ వర్షం రావడంతో ఆ సంతోషంలో పొలంలో పనులను పూర్తి చేసుకుందామని భావించిన మహిళలపై పిడుగు పడింది. దీంతో కుమ్మరి లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా, సువర్ణ, అనురాధలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్ లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలుస్తుంది. మృతి చెందిన లక్ష్మి భర్త గత ఎనిమిది సంవత్సరాల క్రితమే మృతి చెందారు. ఆమెకు కొడుకు కూతురు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకునే మహిళలపై పిడుగు పడటంతో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. రాకరాక వచ్చిన వర్షాలకు ఈ ప్రాంత రైతులకు సంతోషం మిగిల్చిన కూలీల కుటుంబాల్లో మాత్రం విషయాన్నీ నింపింది. పిడుగుపాటు వల్ల మహిళా మృతి చెందడం మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో పలువురు తీవ్ర విచారణ వ్యక్తం చేశారు.

# విద్యార్థి తలపై ప్యాడ్‌తో కొట్టిన ఉపాధ్యాయుడు

- రెండు కుట్లు పడ్డాయని తల్లిదండ్రుల ఆరోపణ
- చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్



**రేవల్లి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** రేవల్లి మండల కేంద్రంలోని హాస్టల్‌లో ఉంటూ రేవల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి భాను ప్రకాష్‌పై ఉపాధ్యాయుడు ప్యాడ్‌తో కొట్టినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనలో విద్యార్థి తలకు గాయమై రెండు కుట్లు పడ్డాయని తల్లిదండ్రులు తెలిపారు. టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన భాను ప్రకాష్ రేవల్లి మండలంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడని తల్లిదండ్రులు మల్లేష్, పార్వతమ్మ తెలిపారు. విద్యార్థిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడిని వెంటనే విధుల నుంచి తొలగించి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఘటనపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# అలయ్ బలాయ్-2026ను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు

- రాంనగర్‌లో సన్నాహక సమావేశం.. పాల్గొన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే అలయ్ బలాయ్-2026 వేడుకలను ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాంనగర్‌లో అలయ్ బలాయ్ ఫౌండేషన్ చైర్పర్సన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు. అలయ్ బలాయ్-2026 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కార్యక్రమ నిర్వహణ, ప్రముఖ అతిథుల ఆహ్వానం, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, ప్రజల భాగస్వామ్యం, వేదిక నిర్వహణ తదితర అంశాలపై కమిటీ సభ్యులు తమ సూచనలు, సలహాలను అందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను మరింత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. అలయ్ బలాయ్ వేడుకలు అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఆత్మీయ కార్యక్రమంగా కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ ఏడాది కూడా అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో శిల్పారెడ్డి, వెంకట్ రమణి, ఆనంద్ గౌడ్, ఆర్. ప్రదీప్, డాక్టర్ సత్యం యాదవ్, డాక్టర్ ఆవుల రాంచందర్, గొంటి శంకర్ యాదవ్, వేదకుమార్, వకులాభరణం కృష్ణమోహన్, కట్టా మల్లేష్, కేతినేని సరళ, మేకల సారంగపాణి, అందేలా శ్రీరాములు యాదవ్‌తో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోబోటిక్స్‌పై విద్యార్థులకు ఒక రోజు వర్క్‌షాప్




**బోధన్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సోహం అకాడమీ వారిచే విద్యార్థులకు వివిధ రకాల సర్క్యూట్స్, వాటి ఉపయోగాలు సర్క్యూట్స్ అనుసంధానం అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వేదకు వివిధ రకాలైన ఉపకరణాలను ఉపయోగించి సర్క్యూట్లను ఏ రకంగా అనుసంధానించాలి అనే విషయంపై 60 మంది విద్యార్థులకు చంద్రకాంత్ చే వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు క్విజ్ నిర్వహించడం జరిగింది. యాక్టివ్ పాటిస్పేట్ అయినటువంటి 20 మంది విద్యార్థులను ఎన్నుకోవడం జరిగింది వారికి సంవత్సరం పాటు శిక్షణ, పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజీ మంజుషా తెలిపారు. ఈ కార్యక్రమంలో గణితము, భౌతిక శాస్త్రము మరియు జీవశాస్త్ర ఉపాధ్యాయులు సారథ్యం వహించగా ఉపాధ్యాయులు విజయ్ కుమార్, శోభారాణి స్వామి, జోత్స్న, విజయలక్ష్మి, విఠల్, లక్ష్మి, సంతోష్ యాదవ్, రాజ్ కుమార్, సుధారాణి, అబ్బయ్య, గంధం సాయిలు, మేడి రవి, అక్షయ్ జాదవ్, సాయి చరణ్, స్వర్ణ అంజనా, శ్రీకాంత్, సునిత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన నేపథ్యంలో
# భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 23 (జనం సాక్షి);** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈనెల 30వ తేదీన జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే బుధవారం రోజున పోలీస్ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా, ఇతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలి ంచారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్, పార్కింగ్ కోసం ప్రదేశాలను పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వివిఐపీ, వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఎస్పీ గారి వెంట స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సి.ఐ శ్రీనివాస్, ఆర్ ఐబి డిఈ శాంతయ్య, ఎస్.ఐ లు గణేష్, నాగరాజు, రాజు, సిబ్బంది ఉన్నారు.

# వినాయక శోభయాత్రలో దారుణం

- యువకుడిపై దాడి, గొంతు కోసే యత్నం!
- కుక్కడం గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత




**మాడుగులపల్లి సెప్టెంబర్ 23 (జనం సాక్షి):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో మంగళవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గణేష్ నిమజ్జన శోభయాత్ర సాగుతుండగా ఓ యువకుడిపై కొందరు వ్యక్తులు దారుణంగా దాడి చేసి, గొంతు కోసి హతమార్చేందుకు యత్నించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బస్టాండ్ వద్ద ఘాతుకం గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మంగళ వారం రాత్రి కుక్కడం గ్రామంలో వినాయక నిమజ్జన శోభయాత్ర వైభవంగా సాగుతోంది ఊరేగింపు గ్రామంలోని బస్టాండ్ సమీపానికి చేరుకోగానే, స్థానిక యువకుడు పోతపాక సాయికుమార్‌పై కొందరు దుండగులు ఒక్కసారిగా దాడికి దిగారు. తీవ్ర ఆవేశంతో సాయికుమార్ గొంతు కోసేందుకు యత్నించడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి దాడిని గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి, తీవ్ర రక్తస్రావమవుతున్న సాయికుమార్‌ను చికిత్స నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్పీ రవి**
కేసు దర్యాప్తులో భాగంగా మిర్యాలగూడ డిఎస్పీ రవి బుధవారం కుక్కడం గ్రామానికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు ఘటన జరిగిన తీరును, బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు అక్క ఫిర్యాదుతో 8 మందిపై కేసు నమోదు ఎస్ఐ సురేష్ చేసినట్టుగా సాయికుమార్ అక్క బొంగర్ల మధులత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై మాడుగులపల్లి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి పత్రికా ప్రకటన విడుదల చేశారు దాడి ఘటనకు సంబంధించి కుక్కడం గ్రామానికి చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు ఈ కేసులో తండు వరుణ్, తండు వేణు, పందు వెంకన్న, తండు లింగయ్య, అనుముల వేణు, అనుముల మహేష్, నల్లగంతుల నాగరాజు, మొల్కపట్నం హేమంత్‌లను నిందితులుగా పేర్కొన్నట్లు ఎస్ఐ వెల్లడించారు నిందితులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని, ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని తెలిపారు.

# శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

- రాత్రి నింపిన నీటిలో 60 శాతం లీకేజీ
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- ఎన్నిసార్లు కథనాలు ప్రచురించినా పట్టించుకోని అధికారులు



**కోట్‌పల్లి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
కోట్‌పల్లి మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో తాగునీటి సమస్య తీవ్రతరమవుతోంది. ప్రజలకు సక్రమంగా నీటిని అందించాల్సిన వాటర్ ట్యాంక్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ట్యాంక్‌లో నీటిని నింపిన కొద్దిసేపటికే భారీగా లీకేజీ ఏర్పడుతుండడంతో విలువైన తాగునీరు వృథాగా పోతోంది.
ప్రతిరోజూ రాత్రి ట్యాంక్‌ను పూర్తిస్థాయిలో నీటితో నింపుతున్నప్పటికీ, తెల్లవారే సరికి దాదాపు 60 శాతం నీరు లీకేజీ ద్వారా బయటకు పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రజలకు అందాల్సిన నీటిలో గణనీయమైన భాగం వృథా అవుతోంది. ఒకవైపు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు అధికారులు మాత్రం సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నిసార్లు కథనాలు వచ్చినా**
వాటర్ ట్యాంక్ దుస్థితిపై గతంలో పలుమార్లు వార్తా కథనాలు ప్రచురితమైన ప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాధనం.. నీరు వృథా**
వాటర్ ట్యాంక్ నుంచి భారీగా నీరు లీక్ అవుతుండటంతో ప్రభుత్వ వనరులతో సరఫరా చేస్తున్న తాగునీరు వృథా అవుతోంది. సమస్యను తాత్కాలికంగా పూడ్చిపెట్టకుండా ట్యాంక్‌ను పూర్తిగా పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే భవిష్యత్తులో తాగునీటి సరఫరాపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# బాయ్ బాయ్ గణేశా.. గణనాథులకు ఘన వీడ్కోలు

- కరీంనగర్ జిల్లాలో అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవాలు
- పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా ముగిసిన వేడుకలు
- నగరం నుంచి పల్లె వరకు భక్తజన సందడి.. భారీ బందోబస్తు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు కరీంనగర్ జిల్లా ప్రజలు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. నగరంతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి తదితర పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై శోభాయాత్రగా తరలించి నిమజ్జనం చేశారు. జైజై నినాదాలు, డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలతో నిమజ్జన కేంద్రాలు సందడిగా మారాయి. కరీంనగర్ నగర పరిధిలో సుమారు నాలుగు వేల విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పాతబజార్ శివాలయం వద్ద ఏర్పాటు చేసిన నంబర్-1 గణేశుడికి మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ చిత్రా మిశ్రా, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు.

మానకొండూరు చెరువు వద్ద నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు చేశారు. క్రేన్లు, లైటింగ్, ఎల్ఈడీ స్క్రీన్లు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట నిమజ్జన కేంద్రాల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించారు. నిమజ్జన మార్గాలు, కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు, నగరపాలక సంస్థ, వైద్య, పారిశుద్ధ్య, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయడంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.




**నిమజ్జనోత్సవాలను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

కరీంనగర్ జిల్లా మానకొండూరు చెరువు వద్ద వినాయక నిమజ్జనోత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి సందడి చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తులు సంయమనంతో, పూర్తి జాగ్రత్తలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని కోరారు. నిమజ్జన సమయంలో పర్యావరణానికి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. నిమజ్జనోత్సవాల కోసం అధికారులు, పోలీసులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారని చెప్పారు.

# కొత్రలో కలకలం.. 8 ఏళ్ల బాలుడు అదృశ్యం



**వెల్దండ సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** బీహార్‌కు చెందిన గౌతమ్ సింగ్, సావిత్రి దేవి దంపతులు గత 8 నెలలుగా వెల్దండ మండలం కొత్ర తండాకు చెందిన నేనావత్ సోములు ఆవుల షెడ్డులో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. వారికి ముగ్గురు సంతానం. వారి పెద్ద కుమారుడు ఆర్యన్ (8) కొత్ర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి వారు నివసిస్తున్న ఇంటి వద్ద నుంచి బాలుడు కనిపించకుండా పోయాడు. బాలుడి ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే కింది నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు, పోలీసులు విజ్ఞప్తి చేశారు. వెల్దండ ఎస్ఐ: 8712657756 సీఐ: 8712657755 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

# కరీంనగర్‌లో మూడు రోజుల సీరతున్నబీ ఎక్స్‌పో

- 25 నుంచి 27 వరకు సర్కస్ గ్రౌండ్‌లో నిర్వహణ
- 25న ఎక్స్‌పోను ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్‌బాబు



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో ఈ నెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజులపాటు సీరతున్నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ఎక్స్‌పో నిర్వహించనున్నారు. 25న శుక్రవారం జుమా ప్రార్థనల అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎక్స్‌పోను ప్రారంభించనున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను జమాఅతే ఇస్లామీ హింద్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సొహైబ్ అహ్మద్ ఖాన్‌తో పాటు నిర్వాహకులు పర్యవేక్షిస్తున్నారు. మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌ను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించినట్లు తెలిపారు. ఎక్స్‌పోకు ప్రజలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# అడుక్కునే వైపు నుండి... అక్షరం వైపు చిన్నారులు

## చిరునామా లేని బతుకు జీవులకు.. బడి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

- బడిబాటలో సంచార జాతులపై చలించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- సంచార జాతుల పిల్లల కోసం ప్రాథమిక పాఠశాల

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :**
సంచార జాతుల్లోని అనేక కుటుంబాలు సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ చిన్నచిన్న వస్తువులు విక్రయించడం, కళలు ప్రదర్శించడం, జానపద వినోదాలు, చేతివృత్తులు, చిన్న వ్యాపారాలు వంటి పనులతో జీవనం సాగిస్తున్నారు. కాలం మారడంతో సంప్రదాయ వృత్తులకు ఆదరణ తగ్గడం, ఆధునిక మార్కెట్‌తో పోటీ పెరగడం వల్ల వారి ఆదాయంపై ప్రభావం పడుతోంది..



**స్థిర నివాసం.. పెద్ద సమస్య..**
సంచార కుటుంబాలకు ఎదురవుతున్న ప్రధాన సమస్యల్లో స్థిర నివాసం ఒకటి. సొంత స్థలం లేదా ఇల్లు లేకపోవడంతో తాత్కాలిక నివాసాల్లోనే కాలం గడపాల్సి వస్తోంది. వర్షాకాలంలో గుడారాల్లో జీవనం మరింత కష్టంగా మారుతోంది.స్థిర చిరునామా లేకపోవడం వల్ల కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ సేవలు, పత్రాలు, విద్య, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు..

**పిల్లల చదువుకు ఆటంకాలు..**
సంచార జీవన విధానం పిల్లల విద్యపై కూడా ప్రభావం చూపుతోంది. కుటుంబం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాల్సి రావడంతో పిల్లలు పాఠశాలలను నిరంతరం మార్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.చదువు మధ్యలోనే ఆగిపోయే పిల్లల సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా సంచార కుటుంబాల పిల్లలకు నిరంతర విద్య అందేలా వసతి, పాఠశాల ప్రవేశం, విద్యా సహాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరం.

**బడి బాటతో గుర్తింపు...**
ఫరూక్ నగర్ ఎంఈవో టి.మనోహర్ ఆధ్వర్యంలో షాద్ నగర్ పట్టణంలో బడిబాటతో సంచార జాతులలో ఉన్న విద్యార్థులను గుర్తించి...వారికి "చదువు కుంటేనే భవిష్యత్తు" అని నమ్మకాన్ని కలిగించి ఈ విషయాన్ని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు..వారి స్థితి గతులపై చలించిన ఎమ్మెల్యే వారి జీవితాన్ని వెలుగు లోకి తీసుకురాలని నిర్వహించుకున్నారు.



చేతులలో గిన్నెలు పట్టుకొని "అమ్మా... అయ్యా..." ఒక్క రూపాయి దానం చేయండి అంటూ షాద్ నగర్ చౌరస్తాలో చేతులు చాచి అడుక్కున్న చేతులు వారివి...చెత్త కుప్పలలో ప్లాస్టిక్ కవర్,చెత్తను ఏరుకొని బ్రతికిన చిన్నారులు... కానీ నేడు అదే చిన్నారులకు అక్షరం నేర్చుకోవ డం కోసం పలక, బలపం, చేతికిచ్చి చదువుతోనే దేనినైనా సాధించవచ్చు అనే సంకల్పంతో ఆ చిన్నారులను పాఠశాలకు పంపించి వారికి తమ ప్రాంతంలో బడి లేకపోవడంతో వారి ప్రాంతంలోనే నూతన బడికి శంకుస్థాపన చేశారు.. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్... ఒక రోజు ఒక ఊరు.. మరో రోజు మరో ప్రాంతం.. ఎక్కడ రాత్రి పడుతుందో అక్కడే తాత్కాలిక గుడారం. స్థిరమైన ఇల్లు లేదు.. శాశ్వత చిరునామా లేదు.. పిల్లలకు క్రమం తప్పని విద్య అందడం కష్టం.. ఉపాధి కూడా రోజుకో రూపంలో మారిపోతుంటుంది. తరతరాలుగా సంచార జీవనం సాగిస్తున్న అనేక కుటుంబాల పరిస్థితి ఇప్పటికీ ఇలాగే ఉంది.

### దాతల సహకారంతో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం

షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పేద విద్యార్థుల విద్య కోసం మరో మానవతా దృక్పథంతో ముందడుగు వేశారు.సంచార జాతుల పేద పిల్లల కోసం పాఠశాల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం హాజిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సిండికేట్ కాలనీలో సంచార జాతుల పిల్లల కోసం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు.దాతల సహకారంతో పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడు తూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే తన లక్ష్యమన్నారు. "పేద పిల్లలు బడి కావాలని నన్ను అడిగినప్పుడు ఎం తో చలించిపోయాను. వారికి చదువుకునే అవకాశం కల్పించడం మనందరి బాధ్యత. అందుకే వెంటనే స్పందించి పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టాం అని తెలిపారు.
పేద విద్యార్థుల చదువుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. విద్యా రంగానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దాతలు ముందుకు వచ్చి పేద పిల్లల విద్యకు అండగా నిలవడం అభినందనీయమన్నారు.






# నేటికీ అందని ఉచిత యూనిఫారాలు!

## జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు

**కొందుర్గు జనంసాక్షి :** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీ హెచ్ ఎస్) విద్యార్థులకు ప్రభుత్వ ఉచిత యూనిఫారాలు నేటికీ అందకపోవడం గమనార్హం. విద్యా సంవత్సరం సగం ముగుస్తున్నా తరుణంలో వారు పాత బట్టలతోనే పాఠశాలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రభుత్వం ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ఉచితంగా రెండు జతల యూనిఫారాలను పంపిణీ చేస్తామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అది ఒక్క జతకుడా అమలుకు నోచుకోలేదు. కొందుర్గు ఉన్నత పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యాసిస్తున్నారు. ఇందులో అత్యధికులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే కావడంతో కొత్త దుస్తులు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.ఒకే రకమైన దుస్తులు లేకపోవడంతో పాఠశాలలో విద్యార్థుల మధ్య అసమానతలు కనిపిస్తున్నాయని, క్రమశిక్షణపై కూడా దీని ప్రభావం పడుతుందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు. పాఠశాల ప్రారంభమై నెలలు గడుస్తున్నా అధికారులు కనీసం బట్టలు ఇస్తారా ఇవ్వరా అనే విషయం పట్ల స్పష్టత ఇవ్వకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, కొందుర్గు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులందరికీ తక్షణమే నాణ్యమైన ఉచిత యూనిఫారాలను అందజేయాలని స్థానికులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రభుత్వంతో టీజీఈజేఏసీ చర్చలు విఫలం

## నాలుగు ప్రధాన డిమాండ్లపై స్పష్టత కరవు.. రేపు అత్యవసర రాష్ట్రస్థాయి సమావేశం




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ప్రతిపాదించిన నాలుగు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూతో బుధవారం సచివాలయంలో జరిగిన చర్చలు ఎలాంటి స్పష్టమైన నిర్ణయం లేకుండానే ముగిశాయని టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. డీఏ, పెండింగ్ బిల్లులు, పీఆర్సీ, సీపీఎస్ అంశాలపై చర్చించినప్పటికీ కాలపరిమితితో కూడిన హామీ లభించలేదన్నారు.
డీఏలో దసరాకు ఒకటి, ఉగాదికి మరో డీఏ ఇచ్చే అంశాన్ని కేబినెట్‌కు ప్రతిపాదిస్తామని సీఎస్ తెలిపినట్లు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులపై గతంలో మాదిరిగా నెలకు రూ.2 వేల కోట్ల చెల్లింపులు కోరగా, ప్రస్తుతం రూ.వెయ్యి కోట్ల మేర మాత్రమే చెల్లించగలమని ప్రభుత్వం తెలిపిందన్నారు. పీఆర్సీ నివేదిక మరో ఒకటి, రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని, అనంతరం రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం చెప్పిందన్నారు. సీపీఎస్‌పై కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపినా దాని గడువుపై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు గురువారం అన్ని అనుబంధ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో రాష్ట్రస్థాయి అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

# కార్యదర్శులు రౌడీల్లెక్క తయారవుతుండ్రు..!

- జిల్లా పంచాయతీ అధికారి వనం తరుణ్ చక్రవర్తి ఉక్రోశం

**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
నల్లగొండ జిల్లా పంచాయతీ అధికారి వనం తరుణ్ చక్రవర్తి పంచాయతీ కార్యదర్శులపై చేసిన వ్యాఖ్యలు, అసభ్యంగా మాట్లాడిన మాటలు వెలుగులోకి వచ్చాయి. పంచాయతీ కార్యదర్శులు రౌడీల్లా తయారవుతున్నారని మాట్లాడిన వీడియో జనం సాక్షి నల్లగొండ ప్రతినిధికి చేరింది. మండల పరిషత్ అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పంచాయతీ కార్యదర్శుల ను ఉద్దేశించి మాట్లాడిన మాటలు వైరల్ అవుతున్నాయి. ఉన్నతమైన స్థానంలో ఉన్న అధికారి మాట్లాడాల్సిన మాటలేనా అనే ప్రశ్నలు వస్తున్నా యి. ప్రతినిత్యం ప్రజల సమస్యలపై పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే పనిలో ఉంటున్న పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకం. ఉదయం 9 గంటలలోపు ఆ గ్రామంలోకి వెళ్లి ఫీల్డ్ మీద నుంచే అటెండెన్స్ వేస్తూ, ప్రతి పనినీ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్న వారిపై తీవ్రమైన ఒత్తిడి ఉన్నా, అధికారులు మాత్రం వారినే దోషులుగా చేస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం లేదా ఇలా చిన్నస్థాయి ఉద్యోగులని నోరు పారేసుకోవడం నిత్యకృత్యంగా మారింది.



గ్రామాల్లో వారు చేస్తున్న పనిని గుర్తించకపోగా, వారి ఉన్నత అధికారి ఇలా మాట్లాడటం, ఇంకా వారికి ఉదయం, సాయంత్రం రెండు పూటలా హాజరు వేసే ప్రణాళిక చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ అధికారులు ఏమో ఫీల్డ్ విజిట్ అని ఫీల్డ్‌కు వెళ్లకుండా, వారి కార్యాలయాల్లో ఉండకుండా ప్రభుత్వం ఇస్తున్న భారీ జీతాలతో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారనే ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. కావున జిల్లా కలెక్టర్ ఇకనైనా స్పందించి జిల్లా స్థాయి అధికారులకు, అలాగే మండల స్థాయి అధికారులకు రెండు పూటలా అటెండెన్స్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

# ఆహార భద్రత నిబంధనల అమలులో రాజీ ఉండొద్దు

- హాస్టళ్లు, పాఠశాలలు, క్యాంటీన్లలో ఆకస్మిక తనిఖీలు పెంచాలి : అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :**
ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా జిల్లాలో ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (ఎఫ్ఎస్ఎస్ యాక్ట్) నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల క్యాంటీన్లలో ఆహార నాణ్యతపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ త్రైమాసిక సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ.. ఆహార భద్రత నియంత్రణ, ఆకస్మిక తనిఖీలు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లా పరిధిలోని సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రతి నెల కనీసం రెండు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, వైద్య కళాశాలల క్యాంటీన్లలో అందించే ఆహార నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యాపార సంస్థలకు షోకాజ్, ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేసి, నిర్ణీత గడువు అనంతరం మళ్లీ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే చర్యలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య, విద్యా, పంచాయతీ, సంక్షేమ, ఆహార భద్రత నియమిత అధికారి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మేడ్చల్ చెరువులకు మహర్దశ

- అభివృద్ధి నిధుల మంజూరుకు సీఎం రేవంత్ సానుకూలం
- సీఎం ఆదేశాల మేరకు హైడ్రా కమిషనర్‌ను కలిసిన వజ్రేష్ యాదవ్

**బోడుప్పల్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి):** మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని చెరువుల పరి రక్షణ, పునరుద్ధరణ, సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు వజ్రేష్ యాదవ్ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి మేడ్చల్ నియోజక వర్గంలోని ప్రధాన చెరువుల వివరాలను అందజేశారు. బోడుప్పల్ రా చెరువు, చెంగిచెర్ల చింతల చెరువు, ఎదులాబాద్ చెరువు, రాంపల్లి సూర్యనారాయణ చెరువు, పీర్జాదిగూడ పెద్ద చెరువు తదితర చెరువుల ప్రస్తుత పరిస్థితి, పరిరక్షణ మరియు అభివృద్ధి అవసరాలను కమిషనర్‌కు వివరించారు.




వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గంలోని చెరువులను ఆక్రమణల నుంచి పరిరక్షించడంతో పాటు వాటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ, కట్టల బలోపేతం, నీటి నిల్వ సామర్థ్యం పెంపు వంటి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. తన విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, సీఎం ఆదేశాల మేరకే హైడ్రా కమిషనర్‌ను కలిసి నియోజక వర్గంలోని చెరువులకు సంబంధించిన సమగ్ర వివరాలను అందజేసినట్లు వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు.

# క్యాబ్ డ్రైవర్ హత్య కేసులో ముగ్గురు అరెస్టు

- కారును అపహరించి ముంబయి వైపు పరార్
- బంగారు దుకాణాల్లో చోరీలకు పథకం.. మరో ఇద్దరి కోసం గాలింపు

**రామచంద్రపురం, పటాన్‌చెరు, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
క్యాబ్ డ్రైవర్‌ను హత్య చేసి కారును అపహరించిన కేసును పటాన్‌చెరు పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా.. మరో ఇద్దరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 10న అర్ధరాత్రి సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయం సమీపంలో క్యాబ్ డ్రైవర్ నెలమర్రి రాజశేఖర్‌ను నిందితులు సంప్రదించారు. ముంబయికి వెళ్లాలని చెప్పి క్యాబ్‌ను అద్దెకు తీసుకుని పటాన్‌చెరు వైపు వెళ్లారు. రుద్రారం శివారులో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి చేరుకున్న తర్వాత డ్రైవర్‌పై దాడి చేసి, టవల్‌తో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని అక్కడే వదిలి కారుతో ముంబయి వైపు వెళ్లారు. కోహీర్ సమీపంలో కారు మొరాయించడంతో గోల్డెన్ ధాబా వద్ద వాహనాన్ని వదిలి జహీరాబాద్ వైపు వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. రాజశేఖర్ అదృశ్యంపై బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదవగా, రుద్రారం సమీపంలో మృతదేహం లభ్యమవడంతో పటాన్‌చెరు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో దోపిడీ, నేరపూరిత కుట్ర



కోణాలు వెలుగులోకి రావడంతో సంబంధిత బీఎన్ఎస్ సెక్షన్లను చేర్చారు. ఐదుగురు నిందితులు సికింద్రాబాద్‌లో పరిచయమై క్యాబ్‌ను అద్దెకు తీసుకుని డ్రైవర్‌ను హత్య చేసి కారుతో ముంబయికి వెళ్లాలని పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ బంగారు దుకాణాల్లో చోరీలు చేసి, అనంతరం కారును విక్రయించాలని భావించినట్లు వెల్లడించారు. దర్యాప్తులో మహారాష్ట్రకు చెందిన ఘోడకే రాహుల్ (28), సూరజ్ శశికాంత్ తవాడే (29), బాంబ్లే రాజు రామచంద్ర (33)లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ కేసును సైబరాబాద్ ఎస్వోటీ డీసీపీ పి. శోభన్‌కుమార్, ఆర్సీపురం ఏసీపీ సీహెచ్.వై. శ్రీనివాస్ పర్యవేక్షణలో పటాన్‌చెరు, ఎస్వోటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### అనోజిగూడలో మసాలా కంపెనీపై పోలీసుల దాడి

**గడువు ముగిసిన 2,000 మసాలా ఉత్పత్తులు స్వాధీనం**

**ఘట్కేసర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనోజిగూడలోని దిల్‌బహార్ మసాలా కంపెనీపై పోలీసులు బుధవారం దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు, ఎస్ఓటీ సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో గడువు ముగిసిన పలు రకాల మసాలా ఉత్పత్తులను గుర్తించారు. మటన్ బిర్యానీ, డ్రై మ్యాంగో, సబ్జీ, చికెన్, మీట్, ఫిష్, బిర్యానీ, తందూరి చికెన్, సాంబార్ మసాలా తదితర ఉత్పత్తులు కలిపి సుమారు 2,000 యూనిట్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆహార భద్రతా నిబంధనల ప్రకారం తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# శారీరక లోపం ఎదుగుదలకు అడ్డు కాదు

- సదరం ప్రాంగణం శిబిరం కోసం పది లక్షలు
- తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రతి గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 23 (జనం సాక్షి):**
శారీరక లోపం ఎదుగుదలకు అడ్డు కాదని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.బుధవారం వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వికలత్వ నిర్ధారణ పరీక్ష కేంద్రమును శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ...సదరం శిభిరానికి వచ్చే వారికి మౌలిక వసతులు కల్పించాలన్నారు.సెర్ప్ ద్వారా 10 లక్షల రూపాయల నిధులతో ప్రత్యేకంగా ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో సదరం శిబిరం ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. వికలత్వ నిర్ధారణ పరీక్షకు వచ్చే వారికి ఈ శిబిరం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. ప్రతి అర్హుడైన దివ్యాంగునికి సదరం సర్టిఫికేట్ అందేలా చూడాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు మందులను



ఎప్పటికీ అందుబాటులో ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కావాల్సిన అవసరాలు, సిబ్బంది వివరాలను సభాపతి అధికారులను అడిగి తెలుసుకున్నారు.సదరం శిబిరం ప్రారంభోత్సవంలోజిల్లా కలెక్టర్ దిపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఇంటి దొంగతనం కేసులో నలుగురు అరెస్ట్

- 7 గ్రాముల బంగారం.. 33 తులాల వెండి స్వాధీనం
- కారు, నాలుగు సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం







**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఇంటి దొంగతనం కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. జక్కాపూర్‌కు చెందిన బుచ్చెల్లి అఖిల ఇంటి తలుపులు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌లు, పెట్రోల్‌బంక్ కెమెరాలు, టోల్‌ప్లాజా రికార్డులను విశ్లేషించిన పోలీసులు నేరానికి ఉపయోగించిన కియా సెల్టోస్ కారును గుర్తించారు. బుధవారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా జక్కాపూర్ దొంగతనంతోపాటు మరికొన్ని చోరీలకు పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. మాధగాని సురేష్‌పై తెలంగాణలో 26, ఏపీ కృష్ణా జిల్లా చందర్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు ఉండగా, దాసరి నాగయ్యపై 12 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కట్ల మహేష్, ఉడాడి సురేష్‌లను కూడా అరెస్టు చేశారు. మరో నిందితుడు కుజా కళ్యాణ్ పరారీలో ఉండగా అతడి కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితుల నుంచి చోరీ సొత్తుతోపాటు నేరానికి ఉపయోగించిన కియా సెల్టోస్ కారు, నాలుగు సెల్‌ఫోన్లు, 7 గ్రాముల బంగారం, 33 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ రవీందర్‌రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని సీపీ ఎస్. రష్మి పెరుమాళ్, ఏసీపీ అభినందించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
24 సెప్టెంబర్ 2026

# హంగులతో మోడల్ బస్టాండ్లు

- 13 ప్రాంతాల్లో హైటెక్‌గా నిర్వహణ



హైదరాబాద్, సెప్టెంబర్ 23, (జనంసాక్షి) : తెలంగాణలో ప్రజారవాణా వ్యవస్థను ఆధునీకరించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై బస్టాండ్ అంటే కేవలం బస్సు కోసం వేచి చూసే ఇరుకు ప్రదేశం మాత్రమే కాకుండా, షాపింగ్, వినోదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చబోతోంది. తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి వినూత్న ఆలోచనతో రాష్ట్రవ్యాప్తంగా 13 ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్, కార్పొరేట్ స్థాయి హంగులతో మోడల్ బస్టాండ్లను నిర్మించేందుకు రవాణా శాఖ నుంచి అధికారిక ఆమోదం లభించింది. నూతనంగా అందుబాటులోకి రానున్న ఈ హైటెక్ బస్ స్టేషన్లలో ప్రయాణికుల కోసం మల్టీ-మోడల్ కనెక్టివిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల బస్సు దిగిన వెంటనే రైల్వే స్టేషన్లు లేదా ఇతర రవాణా సాధనాలను సులభంగా చేరుకోవచ్చు. అంతేకాకుండా కమర్షియల్ బిజినెస్ కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్ రేంజ్ ఫుడ్ కోర్టులు, పిల్లల గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లను అందుబాటులోకి తేనున్నారు. బిజినెస్ విస్తరణ కోసం వ్యాపారులు ఈ కాంప్లెక్స్‌లలో షాపులను కేటాయించుకోవచ్చని ఆర్టీసీ ప్రకటించింది. తొలివిడతగా నాగర్‌కర్నూల్, రేగొండ, హుజూర్ నగర్, కోదాడ, కొడంగల్, కోస్గి, మద్దూరు, కేసముద్రం, హుస్నాబాద్, ములుగు, మధిర, నల్గొండ, కొత్తగూడెం ప్రాంతాల్లో ఈ మోడల్ బస్టాండ్లను నిర్మించనున్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్న ఈ ప్రాజెక్టుతో తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు మరింత నాణ్యమైన, ఆధునిక సేవలను అందించనుంది.

# 'డిజిటల్ గవర్నెన్స్'లో రోల్ మోడల్‌గా తెలంగాణ

- ఇంటి ముంగిటకే 'మీ సేవా' సేవలు
- తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో అమలు
- 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు





హైదరాబాద్ (జనంసాక్షి) : 'గుడ్ గవర్నెన్స్'కు టెక్నాలజీని జోడించి 'డిజిటల్ గవర్నెన్స్'లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని నేరుగా ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్ కు టెక్నాలజీని జోడించి పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వం, యంత్రాంగమే నేరుగా ప్రజల దగ్గరికే వెళ్లేలా ఈ 'డోర్ డెలివరీ సర్వీసెస్'కు శ్రీకారం చుట్టామన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే... జనన/మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికేట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర మీ సేవా సేవలను ఇంటి దగ్గరే అందిస్తామన్నారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలిదశలో 'క్యూర్' ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని... ఇంటి నుంచే పౌర సేవల్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటీఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవా కమిషనర్ రవి కిరణ్, టీజీటీఎస్ ఎండీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విల్లా వెంచర్ బిల్డర్‌పై
# తెలంగాణ రెరా కొరడా!



హైదరాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) : తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ మోసపూరిత బిల్డర్లపై తన ప్రతాపాన్ని చూపుతూ మరో సంచలన తీర్పు వెలువరించింది. సరైన అనుమతులు లేని విల్లా ప్రాజెక్ట్ పేరుతో ఓ అమాయక మహిళ నుంచి రూ. 79 లక్షలు భారీగా వసూలు చేసి, ఆపై నిర్మాణం పూర్తి చేయకుండా చేతులెత్తేసిన ఓ కేటుగాడికి వ్యతిరేకంగా బాధితురాలికి అనుకూలంగా తీర్పునిచ్చింది. చట్ట నిబంధనలను ఉల్లంఘించి వినియోగదారులను మోసం చేసిన ఆ బిల్డర్‌కు భారీ జరిమానా విధిస్తూ రెరా కఠిన చర్యలు తీసుకుంది. ఎలాంటి చట్టపరమైన అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ లేకపోయినా ఆకర్షణీయమైన ప్రకటనలతో సదరు బిల్డర్ విల్లా ప్రాజెక్ట్‌ను విక్రయిస్తున్నట్లు నమ్మించాడు. దీనిని నిజమని నమ్మిన బాధితురాలు విల్లా కొనుగోలు నిమిత్తం విడతలవారీగా మొత్తం రూ. 79 లక్షలను ఆ సంస్థకు చెల్లించింది. అయితే డబ్బులు తీసుకున్నప్పటికీ ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగకపోగా, కనీస నిర్మాణాలు కూడా పూర్తి చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు తక్షణమే న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ రెరాను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదును అత్యంత సీరియస్‌గా పరిగణించిన టీఎస్‌రెరా అధికారులు ఇరువర్గాల వాదనలను విచారించి సమగ్ర దర్యాప్తు జరిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాజెక్ట్ చేపట్టడం, డబ్బులు వసూలు చేసి మోసం చేయడం నిరూపితం కావడంతో రెరా చట్టం ప్రకారం బిల్డర్‌ను దోషిగా తేల్చారు. బాధితురాలి నుంచి వసూలు చేసిన అసలు మొత్తం రూ. 79 లక్షలను, ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా, ఆ మొత్తంపై కాలయాపన చేసినందుకు గాను వార్షికంగా 10.7 శాతం వడ్డీని కలిపి బాధితురాలికి తిరిగి చెల్లించాలని రెరా తన తీర్పులో తేల్చిచెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి వినియోగదారులను మోసగిస్తే చట్టపరంగా ఎంతటి కఠిన చర్యలు ఉంటాయో ఈ తీర్పు ద్వారా మరోసారి రుజువైంది. సోషల్ మీడియా ప్రకటనలు, అనుమతులు లేని ప్రీలాంచ్ వెంచర్లను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని, రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో కొనుగోలుదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది

# పుట్టి, పెరిగిన గ్రామాన్ని బాధ్యతగా అభివృద్ధి చేస్తా

- రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట (జనంసాక్షి) : పుట్టి పెరిగిన గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ తో కలిసి తిరుమలగిరి మండలం తాటిపాములలో రూ. 5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో జడ్పీ హైస్కూల్ బలోపేతం చేసే పనులకు, రూ. 2 కోట్ల జెన్ కో నిధులతో ప్రైమరీ స్కూల్ బలోపేతం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 16 కోట్లతో యశ్వంత్‌పూర్ వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ కమ్ బ్రిడ్జి పనులను పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మెరుగైన విద్య అందించడానికి 7 కోట్ల నిధులతో హైస్కూల్, ప్రైమరీ స్కూల్ లో అదనపు గదులు నిర్మించడం జరుగుతుందని, ఇట్టి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వీలైనంత త్వరగా ఒక సంవత్సరంలోపు పూర్తి చేసి ఇవ్వాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే మంత్రి ఒక్కొక్క అంగన్వాడి కేంద్రంనకు 20 లక్షలు చొప్పున మొత్తం 4 అంగన్వాడి సెంటర్లకు 80 లక్షలు మంజూరు చేశారు. మంచి నాణ్యతతో చుట్టూ ప్రహరీ గోడ, టాయిలెట్స్ తో ఆధునిక పద్ధతిలో అంగన్వాడి కేంద్రాలను నిర్మించాలని అన్నారు. రూ. 16 కోట్లతో యశ్వంత్‌పూర్ వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ కమ్ బ్రిడ్జి పనులను పరిశీలన చేసిన మంత్రి పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తిచేసి తుంగతుర్తి నియోజకవర్గానికి నీరు అందిస్తామని తెలిపారు. సమ్మక్క సారలమ్మ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని మంత్రి అన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ రాబోవు రోజులలో తుంగతుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు, అంగన్వాడీ కేంద్రాలు, స్త్రీ శక్తి భవనాలు పాఠశాలకు పక్క భవనాలు నిర్మించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్డిఓ వేణుమాధవ్, డిసీసీ ప్రెసిడెంట్ గుడిపాటి నరసయ్య, సర్పంచ్ కిషన్, ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిలిం ఫెడరేషన్ సంచలన నిర్ణయం..

- సుమలత కార్యవర్గం రద్దు

హైదరాబాద్ (జనంసాక్షి) : ఫిలిం ఫెడరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. డ్యాన్సర్ల సంఘంకు చెందిన సుమలత కార్యవర్గంను రద్దు చేసింది. బుధవారం నాడు సుమలత, రఘు మాస్టర్తో ఫెడరేషన్ సమావేశం జరిపింది. సమావేశానికి 225 మంది డ్యాన్సర్లు హాజరయ్యారు. సుమలతకు 11 మంది డ్యాన్సర్ల మద్దతు.. రఘు మాస్టర్కు 214 మంది సపోర్ట్ చేసారు. డ్యాన్సర్స్ అసోసియేషన్కు అక్టోబర్ 11న ఎన్నికలు జరగనుంది. ఎన్నికల నిర్వహణపై ఫిలిం ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. అంతవరకు సుమలత కార్యవర్గాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# రిమ్స్ ఆసుపత్రి ఘటనపై హెచ్చార్సీ సీరియస్

- సుమోటోగా స్వీకరణ

హైదరాబాద్ (జనంసాక్షి) : ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో శిశువుల మరణంపై కేసును తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఎస్ఎన్సీయూ వార్డులో విద్యుత్ వ్యవస్థ, ఫైర్ అలారం, ఫైర్ పరికరాలు, ఎమర్జెన్సీ తరలింపు, మెయింటెనెన్స్, సెక్యూరిటీ ఏర్పాట్లపై నివేదిక ఇవ్వాలని ఆదేశం ఇచ్చింది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, సహాయక చర్యలపై పూర్తి నివేదిక ఇవ్వాలని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. తదుపరి విచారణ అక్టోబర్ 27వ తేదీకి వాయిదా వేసింది.

# కట్టుదిట్టంగా నిమజ్జన ఏర్పాట్లు

- 20 వేల మంది పోలీసులతో పహారా
- పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్




హైదరాబాద్ (జనంసాక్షి) : నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విభాగాల ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నిమజ్జన ఏర్పాట్లపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గణేశ్ వేడుకలకు సంబంధించి సోషల్ మీడియాలో కొన్ని ఫేక్ వీడియోలు వైరల్ చేస్తున్నారని, పాత లేదా నకిలీ వీడియోలను పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా గణేశ్ మండపాల వద్ద అసభ్యకరమైన వల్గర్ పాటలు మరియు డ్యాన్స్‌లపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. నిమజ్జన వేడుకల భద్రత కోసం హైదరాబాద్‌లో 20 వేల మంది పోలీసులు, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని సీపీ తెలిపారు. ఖైరతాబాద్ మరియు బాలాపూర్ గణేశ్ శోభాయాత్రకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వినాయక చవితి వేడుకల పర్యవేక్షణ కోసం ఈసారి ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు. శోభాయాత్ర పరిశీలనకు 24 డ్రోన్లను వాడుతుండగా, కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు 10 వేల సీసీ కెమెరాలను అనుసంధానించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ 100 హైరైజ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిమజ్జన విధుల్లో 25 క్రైమ్ విభాగాల టీమ్‌లు పనిచేస్తాయని, చైన్ స్నాచింగ్‌లు, ఇతర చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంటుందని చెప్పారు. నిమజ్జన వేడుకల్లో డీజేల వినియోగంపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఖైరతాబాద్ గణేశ్ దర్శనానికి ఇవాళ అర్ధరాత్రి 12 గంటల వరకే అనుమతి ఉంటుందని తెలిపారు. ఎల్లుండి ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఈనెల 25న ప్రైవేటు బస్సులు, ఇతర ప్రైవేటు ట్రక్కులకు నగరంలోకి ప్రవేశం ఉండదని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

# రైలు ఢీకొని నలుగురు దుర్మరణం

- ఒకరికి తీవ్ర గాయాలు.. శ్రీకాకుళం జిల్లాలో విషాదం



శ్రీకాకుళం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) : శ్రీకాకుళం జిల్లాలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. పట్టాలు దాటుతున్న ఐదుగురు యువకులను రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో విషాదం నెలకొంది. వీరిలో నలుగురు ప్రాణాలు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలోని హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. టెక్కలి మండలం రావివలస సమీపంలో ఈ విషాద ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో రాజ్య రాణి ఎక్స్ ప్రెస్ రూర్కెలా నుండి గుణుపూర్ వెళుతోన్నట్లు సమాచారం. ప్రస్తుతానికి అందిన సమాచారం ప్రకారం మృతులు, గాయపడిన వ్యక్తి డమర ప్రాంతానికి చెందినవారిగా ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, రైల్వే అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, మృతుల వివరాలను సేకరిస్తున్నారు. ఈ రైలు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జూరాల నీటి విడుదలకు కృషి చేసిన మంత్రులకు రైతుల ఘన స్వాగతం



హైదరాబాద్ (జనంసాక్షి) : కర్ణాటక ముఖ్యమంత్రితో మాట్లాడి ఎగువ నుండి జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదల జరిగేలా కృషి చేసిన రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే లు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి లకు రైతులు ఘన స్వాగతం పలికారు. శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న మంత్రులను రైతులు పూల బొకేలు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదల కోసం రైతుల తరఫున మంత్రులు చేసిన చొరవకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని వెంటనే స్పందించిన మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పసికందు మృతి

హైదరాబాద్ (జనంసాక్షి) : అత్తాపూర్ లోని పెర్ల్ ఆసుపత్రిలో పసికందు మృతి చెందడం వివాదంగా మారింది. చిన్నారి పుట్టిన మరుసటి రోజు తీవ్ర అస్వస్థతకు గురైయింది. పసికందును ఆసుపత్రి యాజమాన్యం పట్టించుకోలేదని బంధువుల అరోపణ. సరియైన చికిత్స చేయకుండా మూడు రోజులు కాలయాపన చేసారని మండిపడ్డారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన చిన్నారి. చివరి క్షణంలో చిన్నారిని హైదరాబాద్ లోని అంకురా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్ళిన కొద్ది సేపటికి చిన్నారి మృతి చెందింది. పెర్ల్ శ్రీ హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యం తో పసికందు మృతి చెందిందనీతూ బంధువులు అందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

# క్యాబ్ ఎక్కుతుండగా సెక్యూరిటీ గార్డ్ అసభ్య ప్రవర్తన

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సెక్యూరిటీ గార్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందిరానగర్ ప్రాంతంలో ఈ ఘటన వెలుగుచూసింది. ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి క్యాబ్ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా, రాజ్‌కుమార్ అనే సెక్యూరిటీ గార్డ్ ఆమె వద్దకు వచ్చాడు. ఒక్కసారిగా ఆమెను పక్కకు లాగి బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు. ఈ ఆకస్మిక పరిణామంతో గ్భ్రాంతికి గురైన బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని ఝూర్ఖండ్‌కు చెందిన రాజ్‌కుమార్‌గా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. పారిపోయిన నిందితుడు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సెక్యూరిటీ గార్డు రాజ్‌కుమార్‌గా గుర్తించిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా, టెక్నాలజీ సాయంతో అతడిని అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు. నిందితుడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. నడిరోడ్డుపై జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

- టీఆర్ఎస్ చీఫ్ కవిత



అదిలాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) : ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఏసీ పేలుడు ఘటనలో ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. బాధితులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత బుధవారం పరామర్శించారు. రిమ్స్ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ఎస్ఎన్‌సీయూను ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రిమ్స్‌లో చిన్నారుల మరణాలు ప్రభుత్వ హత్యలే అని విమర్శలు చేశారు. దత్తత తీసుకున్న జిల్లాలో చిన్నారులు చనిపోతే ముఖ్యమంత్రికి వచ్చే తీరిక లేదా? అని ప్రశ్నించారు. ఫుట్‌బాల్ ఆడేందుకు, విదేశాల్లో తిరిగేందుకు మాత్రం సమయం ఉంటుందా? అని ఎద్దేవా చేశారు. హెల్త్ మినిస్టర్ ఎక్స్‌కర్షన్‌కు వచ్చినట్లు వచ్చి బాధ్యత లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు. నెల రోజుల్లో హాస్పిటల్ పెండింగ్ బిల్లు చెల్లించాలని, ఆదివాసీ ప్రాంతాలకు రోడ్లు వేయాలన్నారు. లేదంటే ఏజెన్సీల్లోని ఆదివాసీలతో కలిసి ఆదిలాబాద్‌ను ఘెరావ్ చేస్తామన్నారు. "ఆదిలాబాద్ రిమ్స్‌లో హృదయవిదాకరమైన సంఘటన జరిగింది. రోజులు కూడా నిండకముందే ఐదుగురు పసివాళ్లకు నిండు నూరేళ్లు నిండాయి. ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటననో, ప్రకృతి ప్రకోపం కారణంగానో జరగలేదు. కేవలం ఈ కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన సంఘటనే. ఇదే మొదటి సంఘటన కాదు. ఈ హాస్పిటల్‌లో గతేడాది 204 మంది, అంతకుముందు ఏడాది 174 మంది చిన్నారులు చనిపోయారు. ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు ఇక్కడ పరిస్థితులపై ప్రభుత్వం బేరీజు వేసుకొని చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి హాస్పిటల్‌కు వచ్చేందుకు సరైన రోడ్లు లేవు. ఏ రోజు పేపర్ చూసిన గర్భిణీ మృతి, చిన్నారులు మృతి అనే వార్తలే ఉంటున్నాయి. ఈ పరిస్థితి గురించి వార్తలు రాసి, కథనాలు ప్రచురించి మీడియా వాళ్లే విసిగిపోయారు"- కవిత 150 మంది డాక్టర్లు ఉండాల్సిన ఆసుపత్రిలో సగం మంది కూడా లేరని కవిత ఆరోపించారు. నర్సులు సగం మందే ఉన్నారని, శానిటేషన్ సిబ్బంది 20 శాతం మాత్రమే ఉన్నారన్నారు. సిబ్బందితో నడ్డి విరిగేలా పనిచేయిస్తూ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఒక్క రిమ్స్‌లోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్పిటల్స్‌లో పరిస్థితులు బాగా లేవు. వరంగల్ ఎంజీఎంలో పై కప్పు కూలింది. నాగర్ కర్నూల్‌లో ఎలుకలు కొరికి ఈసీజీ మెషీన్ పనిచేయటం లేదు. కచ్చితంగా అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఫోరెన్సిక్ అడిట్ నిర్వహించాలి' అని కవిత అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో హెల్త్ కోసం 10 శాతం బడ్జెట్ కేటాయిస్తామన్న సీఎం 5 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని కవిత ఆరోపించారు. దాంట్లో సగం జీతాలకే పోతుందని, ఇక మౌలిక సదుపాయాలకు ఆ నిధులు ఏం సరిపోతాయ్? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి నెల రోజులు సమయం ఇస్తున్నామని, ఈ లోగా పెండింగ్ బిల్లులు చెల్లించి... ఈ ప్రాంతంలో రోడ్లు వేయించాలన్నారు. అదే విధంగా ఈ జిల్లాకు ముఖ్యమంత్రి వచ్చి పరిస్థితిని తెలుసుకోవాలని, ఎస్టీల కోసం వస్తున్న ఫండ్స్‌కు లెక్క చెప్పాలన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370